అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 26-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 11 సంచిక : 26 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



ఎన్‌ఎంఆర్ ఆగడాలకు హైడ్రా అడ్డుకట్ట

- డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో రూ.10.5 కోట్లు వసూలు
- పోచారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించిన భారీ ప్రహరీ కూల్చివేత





నవతెలంగాణ- సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాల్టీలో అక్రమంగా నిర్మించిన భారీ ప్రహరీని హైడ్రా కూల్చేసింది. దీప్తి శ్రీనగర్‌లోని 2218 ప్లాట్లతోపాటు పోచారం మున్సిపాలిటీ పరిధిలో దాదాపు ఐదు ప్రాంతాల్లో 200 ఎకరాల్లో కాలనీలను నల్ల మల్లారెడ్డి (ఎన్‌ఎంఆర్) లేఅవుట్ చేశారు. ఆ లేఅవుట్‌లో దాదాపు వెయ్యి మందికిపైగా సింగరేణి ఉద్యోగులు 1990లో ప్లాట్లను కొనుగోలు చేశారు. అభివృద్ధి ఒప్పందం ప్రకారం (ఎన్‌ఎంఆర్) ముందుగా రోడ్లు, డ్రయినేజీతోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. అయితే, ఎన్‌ఎంఆర్ 'భద్రత' పేరుతో 200 ఎకరాల విస్తీర్ణం చుట్టూ పటిష్టమైన/ఎత్తైన కాంపౌండ్ వాల్ నిర్మించారు. రోడ్లు, డ్రయినేజీల కోసం డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో 15 ఏండ్ల కిందటే ప్లాట్ల యజమానుల నుంచి రూ.10.5 కోట్లు వసూలు చేశారు. ఎన్‌ఎంఆర్ నేతృత్వంలో వెల్ఫేర్ అసోసియేషన్ 4 కిలోమీటర్ల మేర కాంపౌండ్ (వాల్) నిర్మించింది. ఆ పనిని ఎన్‌ఎంఆర్‌కు చెందిన ఏజెన్సీ సంస్థ పూర్తి చేసింది. రోడ్లు, డ్రయినేజీ నిర్మించని ఎన్‌ఎంఆర్ అభివృద్ధి పేరుతో సేకరించిన నిధులతో వాల్‌ను నిర్మించారు. ఆరు కాలనీలకు కేవలం 2 ఎంట్రీ/ఎగ్జిట్‌ల కోసం అన్ని రహదారులనూ మూసేశారు. దాంతో ఈ ప్రాంతాన్ని ఎన్‌ఎంఆర్ మాఫియా డాన్‌గా నియంత్రిస్తోందని వందలాది మంది సింగరేణి ఉద్యోగులు, స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

ఆ క్రమణలను ధ్రువీకరించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

నల్ల మల్లారెడ్డి (ఎన్‌ఎంఆర్) అభివృద్ధి చేసిన 200 ఎకరాల వెంచర్‌లో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు, భయాందోళనకు గురవుతున్నట్టు బాధితులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. గత గురువారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన విచారణలో పలువురు స్థానికులు, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు. వారి గోడును కమిషనర్‌కు వివరించారు. విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూడా ఆక్రమణ గురించి ధృవీకరించారు. దాంతో హైడ్రా అన్ని చట్టపరమైన నిబంధనలను అనుసరించి, వేలాది మంది ప్రజలకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంది. 12 హెవీ డోజర్ల ద్వారా 4 కిలోమీటర్ల కాంపౌండ్ వాల్‌ను శనివారం కూల్చివేసింది.

ఆక్రమణను నోటీసు కూడా లేకుండా కూల్చేయొచ్చు: హైడ్రా కమిషనర్

మునిసిపల్ చట్టాలు/సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం, ఏదైనా రహదారి ఆక్రమణను నోటీసు కూడా లేకుండా కూల్చేయొచ్చని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సైతం సంబంధిత అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీకి మాత్రమే కాంపౌండ్ వాల్ ఉండేందుకు అనుమతి ఉందని, అయితే అభివృద్ధి చేసిన ప్లాట్లు గేటెడ్ కమ్యూనిటీలో భాగం కావని, అవి లేఅవుట్లలో భాగమన్నారు. ఏ లేఅవుట్ చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టకూడదన్నారు. 4 కిలోమీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పొరుగు కాలనీలు/గ్రామాలకు వెళ్లే మార్గాలు లేకుండా పోయాయని, దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కమిషనర్ తెలిపారు. ఎన్‌ఎంఆర్ సెక్యూరిటీ పేరుతో 2200 ప్లాట్‌ల చుట్టూ కాంపౌండ్ వాల్‌ని నిర్మించిందని, అందులో రియల్ ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతోందన్నారు. ప్రభుత్వ భూమిని ఎన్‌ఎంఆర్ కబ్జా చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతుందన్నారు. హైడ్రా విచారణ పూర్తయిన తర్వాత సంబంధిత అందరిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం గణతంత్ర శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజాస్వామిక, సార్వభౌమ గణతంత్ర రాజ్యంగా భారతదేశం వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభిలషించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలను స్మరిస్తూ సంవిధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా పలు సంక్షేమ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన ప్రముఖులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలి

- బాధితులకు ఆపన్నహస్తం అందించాలి : వక్తల పిలుపు
- హైటెక్స్‌లో అవగాహన కల్పిస్తూ వాకథాన్



నవతెలంగాణ-హైదరాబాద్

క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను రూపొందించి మహమ్మారిని తరిమికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బాధితులకు ఆపన్నహస్తం అందించాలని కోరారు. శనివారం హైటెక్స్‌లో ఎక్స్ పో గెలాక్సియా ఆధ్వర్యంలో ది గుడ్ యాక్ట్ -2025 పేరుతో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ వాకథాన్ నిర్వహించారు. ఇందులో ప్రముఖ డాక్టర్లు, వివిధ ఎంఎన్ సీ కంపెనీల ఐటీ ఉద్యోగులు, టెలికాం ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించడమే కీలకమని పేర్కొన్నారు. వ్యాధిని నిర్మూలించడమే కాకుండా బాధితులకు ఆత్మస్థైర్యం కల్పించాలన్నారు. వారికి ఆపన్న హస్తం అందించి ముఖాల్లో చిరునవ్వులు పూయించాలన్నారు. షావోలిన్ మాస్టర్ సుబ్బు ధర్మా మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడు కోవడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్స్ పో గెలాక్సియా ఫౌండర్, డైరెక్టర్ రేఖా ముఖర్జీ, రోషినీ పై హెల్త్ కేర్ క్యాన్సర్ హాస్పిటల్, బెంగాలీస్ ఇన్ హైదరాబాద్ ప్రతినిధులు పార్థా ప్రతిమ్ ,ప్రతినిధులు వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన అండర్ 19, 20 క్రికెట్

- విజేతలకు పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ బహుమతులు ప్రదానం



నవతెలంగాణ- హైదరాబాద్

రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో వీహెచ్ హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్ 19, 20 క్రికెట్ ముగింపు వేడుకల్లో శనివారం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్‌లో 9 మంది అరెస్ట్

- కిడ్నీ అవసరమైన వారి నుంచి రూ.60 లక్షలు వసూలు
- బాధితునికి రూ.5లక్షలు
- బ్రోకర్లు, డాక్టర్లు, ఆస్పత్రి యజమానులకు వాటాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదోళ్ల అవసరంతో పెద్దోళ్లు దందాను కొనసాగించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని టార్గెట్ చేశారు. కిడ్నీ కావాల్సిన వారి నుంచి రూ.50లక్షల నుంచి రూ.60లక్షలు వసూలు చేసి, కిడ్నీ డోనర్స్‌కు మాత్రం రూ.4 నుంచి 5 లక్షలు ముట్టజెప్పేవారు. అలకానంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడిలపై సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, సరూర్‌నగర్ పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. దర్యాప్తు అనంతరం 15 మంది ముఠాలోని 9 మందిని అరెస్టు చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు.

సరూర్‌నగర్‌లోని అలకానంద ఆస్పత్రికి సుమంత్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. 2022 నుంచి హైదరాబాద్‌లో జననీ ఆస్పత్రిని నిర్వహించారు. అందులో నష్టాలు రావడంతో దాన్ని మూసేసి.. ఆరు నెలలుగా అలకానంద ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. జననీ ఆస్పత్రిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సుమంత్‌ను లక్ష్మణ్ అనే బ్రోకర్ కలిశాడు. ఆస్పత్రి మూసేయొద్దని చెప్పిన లక్ష్మణ్.. కిడ్నీ దందాను వివరించాడు. సుమంత్ అంగీకారంతో అవినాష్ అనే డాక్టర్, పవన్ అనే మరో బ్రోకర్‌తో చేతులు కలిపి కిడ్నీ మార్పిడి దందాకు తెరలేపారు. ఈ దందాలో సుమంత్, అవినాష్, పవన్ కింగ్‌పిన్‌గా వ్యవహరించారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి పవన్ కిడ్నీ అవసరమైన వారిని, డోనర్స్‌ను తీసుకొచ్చేవాడు. ఆస్పత్రిలో చేర్పించి, డాక్టర్ అవినాష్, మరికొంత మంది డాక్టర్స్‌తో కలిసి కిడ్నీ మార్పిడీ చేసేవారు. ఒక్కో ఆపరేషన్‌కు రూ.50లక్షల నుంచి రూ.60 లక్షలు వసూలు చేశారు. డోనర్స్‌కు రూ.5లక్షలు చెల్లించి, మిగతా డబ్బులు వాటాలుగా పంచుకునే వారు. తమిళనాడుకు చెందిన నసింభాను, ఫిర్దోస్ కిడ్నీ డోనర్స్. అలాగే బెంగళూరుకు చెందిన రాజశేఖర్, ప్రభ కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారిగా పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా శస్త్ర చికిత్సలు జరిగాయి. ఇప్పటి వరకు మొత్తం 20 ఆపరేషన్స్ ఆస్పత్రిలో చేశారు. అవినాష్ చైనాలో, సుమంత్ ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చేశారు. వారిద్దరితో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు నలుగురు నిందితులను ప్రశ్నించగా.. ఆస్పత్రి సిబ్బంది, వైద్యుల గురించి ఆరా తీశారు. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకకు చెందిన వ్యక్తులకు ఇందులో సంబంధం ఉందని పూర్తి విచారణ తర్వాత పూర్తి వివరాలు వెలుగు చూస్తాయని సీపీ వివరించారు. మరో ఇద్దరు డాక్టర్స్ రాజశేఖర్, షోహిబ్, తమిళనాడు, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన డాక్టర్లు, బ్రోకర్లు పవన్, పూర్నా, లక్ష్మణ్‌తోపాటు మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్టు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు ప్రవీణ్‌కుమార్, కె.మురళీధర్, అదనపు డీసీపీలు బి.కోటేశ్వర్‌రావు, ఎండీ షేక్ హుస్సేయిన్, ఏసీపీ ఏ.క్రిష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ వి.సైదారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల్లో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నకిలీ మందుల రహిత తెలంగాణే లక్ష్యంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ ఈస్ట్ మారెడ్‌పల్లి, తుకారంగేట్‌లో అక్రమంగా నిల్వ చేసిన మందులను సిద్ధి శ్రీధర్ నుంచి స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపించారు. 27 రకాల మందుల విలువ రూ.2.2 లక్షలుగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్ లో తయారైన దవ టోన్ సిరప్ (ఆయుర్వేదిక్ మెడిసిన్) కిడ్నీ స్టోన్స్ చికిత్సకంటూ తప్పుదోవ పట్టిస్తూ ప్రకటనలిస్తుండటంతో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, జిల్లెలగూడ గ్రామంలో దాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ మన్ ఫర్ ఆయుర్వేదిక్ డ్రగ్స్ తయారు చేసిన సటపుష్ప ఫ్రూట్ చూర్ణ (ఆయుర్వేదిక్ మెడిసిన్)ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో, అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన అల్నా బయోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ తయారు చేసిన కోర్డిఫోలియా టాబ్లెట్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో స్వాధీనం చేసుకున్నారు.

ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన కారు

వ్యక్తి మృతి, మరో ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ - బంజారాహిల్స్

కారు అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ బంజారాహిల్స్‌లో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14లోని బసవతారకం ఆస్పత్రి వద్ద తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఓ కారు ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. దాంతో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కారు నెంబర్ ప్లేట్ ఆధారంగా ఆ వాహనం నిజామాబాద్ జిల్లాకు చెందిన హర్షవర్ధన్ అనే వ్యక్తిపై రిజిస్టరైనట్టు తెలిసింది. మద్యం సేవించి వాహనాన్ని అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

సంపుటి :11 సంచిక : 26
www.navatelangana.com
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
ఆదివారం 26-01-2025
16 పేజీలు + వెబ్‌లో (సోపతి)
వెల : 8.00

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



విభజించు.. పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం | జనం మదిలో రాజ్యాంగం..బీజేపీ మనసులో మనువాదం

- ప్రజల విశ్వాసాలకు, ఆర్ఎస్ఎస్ హిందూత్వకు సంబంధమే లేదు
- మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దేశానికే ప్రమాదకరం
- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి
- సామాన్యులపైకి బుల్డోజర్ వస్తే ఎర్రజెండా అడ్డుకుంటుంది
- కార్మికులు, రైతుల హక్కుల కోసం నిలబడేది కమ్యూనిస్టులే
- సమాజమార్పు కోసం పోరాడాలి : సీపీఐ(ఎం) బహిరంగసభలో పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

' మతోన్మాదాన్ని తుదముట్టిస్తాం.. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం.. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే దాకా పోరాడతాం...' అని సీపీఐ (ఎం) శ్రేణులు ప్రతినబూనాయి. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుబెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో పోరాట పథాన్ని నిర్దేశిస్తూ, భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తూ సీపీఐ (ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం సంగారెడ్డి పట్టణంలో అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సన్నాహకంగా పట్టణంలో నిర్వహించిన భారీ ప్రజా ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు సైతం పాలకుల విధానాలను ఎండగట్టాయి. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ మహాసభల ప్రారంభ సూచికగా స్థానిక పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, బీవీ రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో బీజేపీ మత రాజకీయాలను అడ్డుకొంటామని అందుకు కలిసొచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని పోతామని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. కులాలు, మతాల ఆధారంగా జనాన్ని విభజించి పాలించాలని చూస్తున్న ఆ పార్టీ కుయుక్తులను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వివరాలు 14లో



కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విమర్శించారు. వారికి పేదల బాధలు పట్టవన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక పార్టీలను, ప్రభుత్వాలను చూశామనీ, ఆ పార్టీల మాదిరిగా సీపీఐ(ఎం) కాదని చెప్పారు. తమ పార్టీ పేదలు, సామాన్యులు, రైతులు, కార్మికుల బతుకుల బాగు కోసం నిరంతరం కొట్లాడుతుందని చెప్పారు. బడుగుల బతుకులు బాగుపడాలంటే ఎర్రజెండా పాలన రావాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టులు ప్రశ్నిస్తారనే పాలకులు భయపడుతున్నారని విమర్శించారు. దున్నేవాడిదే భూమి కావాలని కొట్లాడేది కమ్యూనిస్టులేనని ...14లో

మతోన్మాదులారా.. ఖబడ్దార్ : తమ్మినేని



బీజేపీ దేశానికే కాకుండా తెలంగాణకు కూడా ప్రమాదకరమైన పార్టీ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీని ఫాసిస్టు లక్షణాలున్న ఆర్ఎస్ఎస్ నడుపుతున్నదని విమర్శించారు. ఎక్కడ అవకాశం దొరికినా మతాలు, కులాల మధ్య తగాదాలు పెడుతున్నదని చెప్పారు. ఉట్నూరు, జైనూరులో జరిగిన ఘటనలు అందులో భాగమేనని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసమే సాగిందన్నారు. కానీ బీజేపీ దాన్ని హిందూముస్లింలకు మధ్య పోరాటం జరిగిందంటూ చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. ఏటా సెప్టెంబర్ 17న హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నదని అన్నారు. తమ చూపంతా బీజేపీని రాష్ట్రంలోకి రానీయకుండా ...14లో

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

ప్రయివేటును తలదన్నేలా నిర్మాణాలు

- వందేండ్ల అవసరాలకు తగినట్టు ఆధునిక సౌకర్యాలు
- పార్కింగ్, ఫైర్‌స్టేషన్, ఎస్టీపీ, హెలీ అంబులెన్స్ ఏర్పాట్లు
- అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్‌ల కోసం ప్రత్యేక ట్రాక్
- మార్చురీ, బాడీ ఫ్రీజింగ్‌లో ఆధునిక పద్ధతులు : సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 31వ తేదీ ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. వందేండ్ల భవిష్యత్ అవసరాలకు తగినట్టు పూర్తి ఆధునిక వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం ఉండాలని ఆకాంక్షించారు. దానికోసం ఎక్కడా రాజీపడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. శనివారం తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్‌లో మార్పులు సూచిస్తూ, సీఎం దిశానిర్దేశం చేశారు. ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల నిర్మాణం, అక్కడి వైద్య విద్యార్థులు, బోధనా సిబ్బందికి వేర్వేరుగా హాస్టల్ భవనాలు నిర్మించాలని చెప్పారు. పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలనీ, రాకపోకల కోసం ...15లో



వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి
- లక్ష్యసాధన దిశగా సాగాలి : దేశ ప్రజలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వివరాలు 15లో

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

- ఏడుగురికి పద్మ విభూషణ్
- 19 మందికి పద్మ భూషణ్..
- 113 మందికి పద్మశ్రీ
- ఏడుగురు తెలుగువారికి పురస్కారాలు
- తెలంగాణ నుంచి ఇద్దరు..
- ఏపీ నుంచి ఐదుగురు
- వైద్య విభాగంలో దువ్వూరి నాగేశ్వర్ రెడ్డికి పద్మ విభూషణ్
- ప్రజా వ్యవహారాలు కేటగిరిలో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ
- ఏపీ నుంచి నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్
- మరో నలుగురికి పద్మశ్రీ

వివరాలు 15లో


(ఫైల్)


సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

- పేదల పక్షాన అలుపెరగని పోరాటాలు
- పలు రాజకీయ పార్టీల నేతల నివాళి

వివరాలు 15లో

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

జమ్మూ కాశ్మీర్ : జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన పై వందేభారత్ రైలు తొలి కూత పెట్టింది. ఈ వంతెనపై శనివారం వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్స్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ ...15లో



నేడు 4 పథకాలు ప్రారంభం

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు

- సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి
- వివరాలు వెల్లడించిన మంత్రులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు (ఆదివారం) రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభించబోతున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున రేపటి నుంచి మార్చి వరకు లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ నాలుగు పథకాలను ఆదివారం నుంచి ప్రతి మండలంలో ఒక గ్రామంలో నూరు శాతం ...6లో

దేశానికి రిపబ్లిక్ డే సంకేతాలు



తెలకపల్లి రవి

ఈ రోజు దేశవ్యాపితంగా రిపబ్లిక్ డే.అంటే గణతంత్ర దినోత్సవం.దేశ రాజధానిలో భారత దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శించడంతో పాటు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన శకటాలను కూడా ప్రదర్శిస్తారు.75 ఏండ్ల కిందట భారత రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చిన రోజు. వివిధ పత్రికల్లో రాజ్యాంగ రూపకల్పన చరిత్ర, ప్రాథమిక హక్కులు మౌలిక స్వభావం సుప్రీంకోర్టు తీర్పులు తదితర విషయాలపై జాతీయ పత్రికల్లోనూ తెలుగులోనూ చాలా వ్యాసాలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రధాన వ్యాసం ఏడున్నర దశబ్దాల తర్వాత కూడా ముమ్ముందుకు..అనే శీర్షికతో వ్యాసం వెలువడింది. బీజేపీ జాతీయ కార్యదర్శి రాసిన వ్యాసం తెలుగులో వచ్చింది.రాజ్యాంగాన్ని వలసవాద పత్రమని కొంతమంది పేర్కొనడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో భారతీయమేదీ లేదని ఆరోపించిన సంస్థ సాక్షాత్తూ ఆరెస్సెస్ మాత్రమేనని ఆ కుదురు నుంచే వచ్చిన నేతలకు తెలియకపోవడం ఆశ్చర్యమే.అప్పట్లో రాజ్యాంగ నిర్మాతలు అమెరికా, బ్రిటన్, కెనడా, స్విడ్జర్లాండ్ వంటి దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేస్తే దానికి మింగుడు పడలేదు. రాజ్యాంగంలో భారతీయతే లేదని దాన్ని ఆమోదించిన రోజునే వారి అధికార పత్రిక 'ఆర్గనైజర్'లో రాశారు. ఆగష్టు 15స్వాతంత్ర దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం రెండే జాతీయ పర్వదినాలుగా జరు గుతూ వచ్చాయి. మోడీ నవంబరు 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ఆమోదించిన రోజు అంటూ దానికి రాజ్యాం గ దినోత్సవం పేరు పెట్టారు. 2015లో అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం జనవరి 26 రిపబ్లిక్ డే ప్రాధాన్యత తగ్గించేందుకే.

జనవరి 26 ఎందుకు?

1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి తీసుకురావడం స్పష్టమైన అవగాహనతో జరిగింది. 1930జనవరి 26న పూర్ణస్వరాజ్ దినోత్సవం జరపాలని కాంగ్రెస్ జాతీయోద్యమకాలంలో ఇచ్చిన పిలుపును గుర్తు చేసుకోవడానికి ఈ తేదీని తీసుకున్నారు. కాని కాంగ్రెస్ పూర్ణస్వరాజ్ పిలుపునివ్వడానికి రంగం సిద్ధం చేసింది కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం. కాంగ్రెస్‌తో విభేదించి స్వరాజ్య పార్టీ పెట్టుకున్న మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు పరిమిత ప్రతిపత్తితో అధికారం పంచుకోవడానికి సిద్ధమవుతున్నారు. దేశ ప్రజలకు సమ్మతించదగిన రాజ్యాంగం ఇవ్వాలని 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. 1920లో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగిననాటి నుంచి సంపూర్ణ స్వరాజ్యం కోరుతూ వచ్చారు. 1921 అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో వారే పూర్తి స్వాతంత్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు, మళ్లీ 1927లో మద్రాసు కాంగ్రెస్ మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ పైన చెప్పినట్టు పూర్ణస్వరాజ్ కోసం 1930జనవరి26న పతాకావిష్కరణలు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టి నపుడు బలపర్చిన ప్రతినిధి జోగ్లేకర్ కమ్యూనిస్టు నాయకుడే. 1947లో దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆ తేదీనే ప్రకటించవచ్చునని మొదట భావించారు.అయితే ఘోరమైన మతకలహాల కల్లోలం రీత్యా కాస్తముందుకు జరిపి ఆగష్టు 15నే ప్రకటించారు. 1948 జనవరి 26న ఈ విషయాలు సభల్లో చెప్పారు కూడా. నిజంగానే 1948 జనవరి 30న గాంధీజీని మతశక్తులు హత్య చేయడంతో ఆ భయాలు నిజమయ్యాయి.

గాంధీజీ హత్య,అంబేద్కర్‌కు అవమానం

1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు మొదలు పెట్టేనాటికి దేశం మతకలహాల ముప్పునూ సామ రస్యత లౌకికతత్వం ఆవశ్యకతనూ గుర్తించగలిగింది. గాంధీజీ హత్యకు శిక్ష విధించబడిన గాడ్సేను దేశ భక్తుడుగా చెప్పేవారు. ఆయన గురువైన వీరసావర్కార్‌ను పార్ల మెంటులో ప్రతిష్టించినవారు దేశాధిపత్యం చేపట్టిన ఫలితమిది. రాజ్యాంగస్ఫూర్తిపై దాడికి నవంబరు 26 నిర్ణయం తొలిఅడుగు మాత్రమేనని తర్వాత వరుసగా జరుగుతున్న మార్పులు,చర్యలు, తాజాగా తీసుకొచ్చిన జమిలి ఎన్నికల బిల్లులు వంటివన్నీ స్పష్టం చేస్తున్నాయి.

లిఖిత రూపంలో ప్రపంచంలో మరేదేశానికి లేనంత పెద్దది భారత రాజ్యాంగం. దానికోసం జరిగిన లోతైన చర్చల్లో 36 లక్షల పదాలు వున్నాయని రికార్డులు చెబుతున్నాయి.7635 సవరణలను లేదా ప్రతిపాదనల్లో 2473 వివరంగా చర్చించి నిర్ధారణలకు వచ్చారు. 395 అధికరణలు, 8 షెడ్యూళ్లలో వీటిని పొందుపర్చారు. ఆరోగ్యం అంత బాగాలేనప్పటికీ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ దానికి తుదిరూపమివ్వడానికి అంకితమయ్యారని రాజ్యాంగ పరిషత్ ఛైర్మన్ తొలిరాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అభినందించారు. దాదాపు 300 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఇంచుమించు మూడేండ్లపాటు శ్రమించి, చర్చించి, తర్కించి, వాదించి, శోధించి దాన్ని జాతికి అందించారు. మొదట ఇందుకు సంబంధించిన ఎజెండా ప్రతిపాదిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఇది మన సంకల్పం అని ప్రతిజ్ఞ అనీ ప్రకటించారు. ఆయనే మళ్లీ తొలి ప్రధానిగా అధికారం స్వీకరిస్తూ ప్రపంచమంతా నిద్రలో వున్న ఈ సమయంలో భారతదేశం స్వాతంత్ర్య యుగోదయంలోకి ప్రవేశిస్తున్నదని ప్రకటించారు. నిరంతర అప్రమత్తతే స్వాతంత్ర్యానికి మూలం అన్నది శాశ్వత సూక్తి. రాజ్యాంగ రూపకల్పనలోనూ ఆమోదించి అమలుకు తేవడంలోనూ స్వాతంత్ర్య యోధులు, న్యాయ కోవిదులు, దేశభక్తులు ఆదర్శంగా పెట్టుకున్న లక్ష్యాలకూ ఈనాటి పరిస్థితికి పొంతన ఏమైనా వున్నదా అని బేరీజు వేసు కోవాలి.ఎందుకంటే రాజ్యాంగం అమలు తీరు నిజమైన కొలబద్ద అని చెప్పిన అంబేద్కర్ బొమ్మ పెట్టుకోవడం కన్నా దేవుడిబొమ్మ పెట్టుకుంటే పుణ్యం వచ్చేదని హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ వార్షికోత్సవ చర్చలోనే అనడం ఇందుకు నిదర్శనం.

స్ఫూర్తికి ఎసరు

'దేశమంటే మనుషులోయ్' అన్నట్టే, రాజ్యాంగమంటే దాని మౌలిక స్వభావమే, ఇచ్చే నిర్దేశమే తప్ప నిర్జీవ నిబంధనలు కాదు. రాజ్యాంగం 368వ అధికరణం పరిస్థితులకు తగినట్టు దాన్ని మార్చుకునే అధికారం ఇస్తున్నదని మొదట పేర్కొన్న 'టైమ్స్' వ్యాసం చెబుతుంది. రాజ్యాంగం మౌలిక స్వభావం సిద్ధాంతం కూడా తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిందే తప్ప అందులోది కాదని ఆ వ్యాసకర్త అంటారు.రాజ్యాంగంలో ఏదీ పరమ పవిత్రం కాదని స్వయంగా రెండోస్థానంలో వున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఇటీవల వాక్రుచ్చారు. ఏది ఎలాగైనా మార్చే యోచన ఉన్నట్టయితే ఇక దేశాలకు రాజ్యాంగాల అవసరమే వుండదు.

> ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు?



> ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

ఒక విధాన చట్రంగా మూలసూత్రాలుగా వాటి పరిధిలోనే వ్యవహరించాలన్నది ఇక్కడ కీలకం. 368 ప్రకారం పార్లమెంటులో బలం వుంది గనక ఏది ఎలాగైనా తలకిందులు చేస్తామంటే చెల్లుబాటు కాదు, కాకూడదు.

స్వభావరీత్యా ప్రజాస్వామికం, రాజరికం రెండు రకాలు (డెమోక్రసీ, మోనార్కీ).పాలనాపరంగా అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా(ప్రెసిడెన్సియల్ పార్లమెంటరీ) అధ్యక్ష తరహా,అధ్యక్ష తరహా పార్లమెంటరీ మిశ్రమం, పూర్తి పార్లమెంటరీ తరహా అనే మూడు విధానాలు ప్రపంచంలో వున్నాయి. అధ్యక్ష తరహాలో అన్నీ అధ్యక్షులే శాసిస్తారు. మిశ్రమ తరహాలో ప్రధాని అధ్యక్షుడు(రాష్ట్రపతి) ఉభయులూ పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. మరికొన్ని చోట్ల అధ్యక్షుడే ప్రధానిని ఎంపిక చేస్తూ పాలన చేస్తాడు. మిశ్రమ పద్ధతిలో కొన్నిచోట్ల అధ్యక్షుడు కొన్ని చోట్ల ప్రధాని కీలక పాత్ర వహిస్తారు. మన దేశంలో రాష్ట్రపతి నామమాత్రం కాగా ప్రధాని సలహాపైనే నిర్ణయాలు తీసుకుంటాడు. ఈ విధానాన్ని కూడా ఇష్టప్రకారం మార్చేసే వీలుండదు. మన చుట్టుపక్కల శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి చోట్ల వీటిని అటూ ఇటూ మార్చిన ఉదాహరణలున్నాయి. వాటిని కోర్టులు కొట్టివేసిన సందర్భాలూ వున్నాయి, రాజకీయ వ్యవస్థ బలహీనంగా వున్నచోట్ల సైనికబలంతో అమలు చేసిన హెచ్చరికలూ వున్నాయి. ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

జవాబుదారీతనం మాయం

'రాజ్యాంగాన్ని భారత ప్రజలమైన మేము మాకు ఇచ్చుకుంటున్నాము' అని పేర్కొంటున్నాం. అంటే వ్యవస్థలో జరిగిన దానికి చేసిన దానికి ఎవరో ఒకరు అందరికీ జవాబుదారీగా వుండాలి.అధ్యక్ష తరహా పార్లమెంటరీ తరహా ఏదైనా సరే. మనం తీసుకున్న పార్లమెంటరీ వ్యవస్థలో అందరూ రాజ్యాంగానికి జవాబుదారి. కేంద్రంలో వారు పార్ల మెంటుకు రాష్ట్రాల్లో పాలకులు శాసన సభలకూ జవాబుదారీ. ఓటర్ల ఆమోదంతో ఎన్నికై అధికారం చేపట్టి విధానాలు చట్టాలు రూపొందించేవారు సుప్రీంకోర్టుకు జవాబు దారీ.అంటే వారు చేసిన చట్టాలు రాజ్యాంగ నిబంధనలకు లో బడి వున్నాయా లేదా అని సుప్రీంకోర్టు, హైకోర్టు చెబుతాయి. న్యాయవ్యవస్థ కూడా రాజ్యాంగ పరిధిలో పనిచేయ వలసిందే. ఏ వ్యవస్థ రాజ్యాం గానికి అతీతం కాదు. అయితే జవాబుదారీ తనం సమిష్టిగానూ వ్యక్తిగతం గానూ వుం టుంది. ఉదాహరణకు సభల్లో బలాన్ని బట్టి ప్రధాని, ముఖ్యమంత్రి నియామకం జరిగాక మంత్రివర్గం దాని తరపున నాయకులుగా వున్న ప్రధాని లేదా ముఖ్యమంత్రి సభకు బాధ్యత వహించాలి. అంతర్గతంగా ఆయా శాఖలు లేదా విభాగాలు చూసేవారు ముఖ్యమంత్రికి, ప్రధానికి, ప్రభుత్వాలకు బాధ్యత వహించాలి.ఇది విస్తృతమైన విభజన. కానీ రాజధానుల నుంచి ప్రాజెక్టుల వరకూ దేశమంతటా కొనుగోళ్ల నుంచి నిధుల వరకూ ఎన్ని తప్పులు జరిగినా, ఎన్ని కేసులు నడిచినా పూర్తి బాధ్యత ఎవరిదనేది తేల్చడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా అస్మదీయులు తస్మ దీయులనే ప్రాతిపదికన వెళ్లడం కోర్టుల్లోనూ రకరకాల తీర్పులు రావడం జరిగిపోతుంది. అదానీ విద్యుత్ కొనుగోళ్లు,కాళేశ్వరం, పోలవరం, అమరావతి, బీహార్‌లో గుజరాత్‌లో బ్రిడ్జిలు పతనం ఎన్ని సంచలనాత్మక తప్పిదాల్లో బాధ్యత తేల్చారా?గుజరాత్ మారణకాండతో సహా ఎన్నో జరిగిపోయాయి. కానీ పాలకులు ఎవరిపైనా ఏదైనా చర్య చూశామా?

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు? పెద్దనోట్ల రద్దు వంటి నిర్ణయాలు, భారీ కుంభకోణాలు,లక్షల కోట్ల ఎగవేతలు, ప్రజల ఆస్తులు కట్టబెట్టడాలు - వీటికి పాలకుల బాధ్యత ఏమై పోతున్నట్టు? సార్వభౌమత్వాన్ని కాపాడవలసిన కేంద్రపాలకులు అమెరికా వంటి దేశాల ఒత్తిడికి లోబడిపోతే పార్లమెంటుకు కూడా జవాబుదారీతనం ఎక్కడ మిగిలేట్టు? తమ రాజకీయ అవసరాల కోసం దుస్సాహస నిర్ణయాలు తీసుకుంటే ఎక్కడ చర్చ జరిగేట్టు? అలాగే అధికారాన్ని నిరంకుశంగా వినియోగించి ప్రజల హక్కులు హరిస్తే ఎక్కడ విచారించేట్టు? ఇవన్నీ 75ఏండ్ల అనుభవం ముందుకు తెస్తున్న కీలక సవాళ్లు. వాటికి జవాబులు వెతకాల్సింది పోయి, ఉన్న హక్కులను కూడా తొలగించడం, వ్యవస్థలను తలకిందులు చేసి వ్యక్తుల పెత్త నాలు రుద్దడం అనుమతించ రానిది. ట్రంప్ ప్రమాణ స్వీకారంలో ఎలన్‌మస్క్ చక్రం తిప్పినట్టే ఇక్కడ పాలకుల నీడన అదానీలు, అంబానీలు, ఇంకా రాష్ట్రాల కుబేరులు ధనాన్ని, మతాన్ని జోడించి స్వారీ చేస్తుంటే ఇక జవాబుదారీ తనం, రాజ్యాంగ విలువలు ఎటుపోయేట్టు? ఆగష్టు 15న జెండా ఎగరేస్తారు.అంటే ఒక ఎత్తుకు చేరుస్తారు. జనవరి 26న పైనకట్టి వున్న జెండా ఆవిష్కరిస్తారు. అంటే స్వేచ్ఛగా ఎగిరేలా చేస్తారు. తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని సరిగ్గా కాపాడుకోవడమే ఇందులో సందేశం. ■

సంపాదకీయం



గణతంత్రం @ 75

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

"భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ - సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటన, విశ్వాసం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అవకాశాల్లో, అంతస్తుల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మాకు మేము సమర్పించుకుంటున్నాము". ఇది రాజ్యాంగ పీఠిక సారాంశం. దీని యొక్క సారాంశంగానే రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. అలా రూపుదిద్దుకుని అమలులోకి వచ్చి నేటికి 75 ఏండ్లు నిండుతున్నవి. దాదాపు మూడేండ్లపాటు తీవ్రమైన కృషిచేసి అనేక దేశాల పరిపాలనను, రాజ్యాంగాలను పరిశోధించి ఏర్పాటుచేసుకున్న అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా డా. బాబూ రాజేంద్ర ప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా డా॥ బి.ఆర్.అంబేద్కర్‌లు, మరికొందరు మేధోసంపన్నులు చర్చించి అందించిన మహత్ ప్రణాళిక ఇది. అయితే ఎంతో శ్రమకోర్చి ఇంత పెద్ద రాజ్యాంగాన్ని ప్రజలందరి హక్కులకు, స్వేచ్ఛకు, ప్రజాస్వామిక విధానానికి హామీ ఇస్తూ సమర్పించిన అంబేద్కర్ ఏమన్నారంటే, ఈ రాజ్యాంగం ఘనమైనది, గొప్పదైనదీ అయినప్పటికీ, దీన్ని అమలు చేసే వాళ్లు చెడ్డవారైతే ఎందుకూ పనికిరాదని సెలవిచ్చాడు. ఆ ప్రమాదం 75 ఏండ్ల తర్వాత మరింత పెరిగింది.

రాజ్యాంగ నిర్మాణం కేవలం మేధావుల సృజనాత్మక అంశంగా రూపొత్త లేదు. రాజ్యాలు, సామ్రాజ్యాలు, రాజులు, సామంతులుపోయి బ్రిటీష్‌వారి ఏకచక్రాధి పత్యంలోకి వచ్చాక రెండు వందలేండ్లు సాగిన దోపిడిపై సమైక్యంగా ప్రజల తిరుగుబాటులోంచి స్వాతంత్ర్య పోరాటం నడిచింది. జాతి, మత, కుల, ప్రాంత భేదాల నొదిలి వీరోచిత త్యాగాల ఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాడు ప్రజలలో ఏర్పడిన ఐక్యత, సమానత, సౌభ్రాతృత్వాల కారణంగా వారి ఆశలు, ఆకాంక్షలు, ఆలోచనల ప్రతిబింబమే మన గణతంత్రం. మరి ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి! ఏ దిశగా మన పయనం సాగుతున్నది చర్చించుకోవాల్సిన సందర్భం ఇది. ఈ రాజ్యాంగం ఏర్పడిననాడే, ఈ రాజ్యాంగాన్ని మేము అంగీకరించమని, వ్యతిరేకిస్తూ మాట్లాడినవారు, ఇదే రాజ్యాంగం ప్రకారం ఎన్నికయి ఏలుబడిలో ఉన్నారు. వారి వారసులే మొన్నీమధ్య ఆగస్టు 15ను నిజమైన స్వాతంత్ర్య దినం కాదని, అయోధ్యలో రాముని ప్రతిష్టాపన రోజే స్వాతంత్ర్యదినోత్సవమని ప్రకటించాడు. మనుధర్మమే రాజ్యాంగ ధర్మమనీ ఆలోచించేవారి చేతిలో రాజ్యాంగం అమలుకొనసాగటం నేటి విషాదం! 2015లో గణతంత్ర ఉత్సవాలను జరుపుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రాజ్యాంగ ప్రతుల పీఠికలో 'సామ్యవాద', 'లౌకిక' పదాలను తొలగించి అందించారు. అదేమంటే, ఆరంభాన అవిలేవని, మధ్యలో 1976లో 42వ సవరణ ద్వారా చేర్చారని చెప్పారు. కానీ సామ్యవాద, లౌకిక విధానాలతో సాగాలని రాజ్యాంగంలో సారభూతంగా ఆది నుండీ ఉంది. 1973లోనే సుప్రీంకోర్టు ఒక తీర్పులో రాజ్యాంగ స్వరూపాన్ని చెబుతూ లౌకిక ప్రజాస్వామిక, సమానత, స్వేచ్ఛ, సమాఖ్య సమన్యాయాలతో కూడినదని తెలిపారు.

సమన్యాయం సాధించబడలేదు, సామాజిక న్యాయమూలేదు, ఆర్థిక అసమానత పెరిగిపోతున్నది. ఇప్పటికీ ఒక్క శాతం ప్రజల దగ్గర 23శాతం దేశ సంపద ఉంది. 10శాతం ప్రజల దగ్గర 55 శాతం సంపద పోగుబడి ఉందని ప్రభుత్వ రిపోర్టులే చెబుతున్నాయి. ప్రజలందరూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కునూ లాగేస్తున్నారు. అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశ ద్రోహులుగా చిత్రిస్తున్నారు. తినే తిండి, కట్టుకునేబట్ట, పెళ్లి, ఉత్సవం ఏదీ కూడా పౌరులు స్వేచ్ఛగా ఆచరించే వీలు లేకుండా పోయింది. ఇక లౌకికత్వం అనే మాట హేళన చేయబడుతున్నది. మెజారిటీ మతానికి మైనారిటీ మతాల ప్రజలు లోబడి ఉండాలని, లేదంటే చంపుతామని, తరుముతామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు. ఇక ప్రజాస్వామ్యమూ పలుచనపడిపోయింది. ఒక ఓటుకు ఒకే విలువ అన్నప్పటికీ ఒక మనిషికి ఒకే విలువ లేదు. ఓటూ సరుకై కొనుగోలుకు గురవుతున్నది. రాజకీయాలు ధనకీయాలయిపోయాయి. అందుకే కుబేరుల బొజ్జలు నింపుతూ, అన్నం పెట్టే రైతన్నలపై కండ్లెర్రజేస్తూ హింసిస్తున్నారు. న్యాయం కావాలన్న గొంతులపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిర్బంధాలతో అణచివేతలు చేస్తున్నారు. ఇక సామ్యవాద సమసమాజ భావన తుడిచివేసారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంగలేస్తున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కులు అథఃపాతాళానికి తొక్కి వేయబడుతున్నాయి. కొత్త నేర చట్టాలతో ప్రాథమిక హక్కులే మృగ్యమవుతున్నాయి.

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

ట్రంప: ట్రంపస్య.. ట్రంపోభ్య:





జంధ్యాల రఘుబాబు
9849753298

ట్రంపు భలే ఇంపు అన్నాడొక మిత్రుడు. వెంటనే, కాదు కాదు ట్రంపు ఓ కంపు అన్నది ఓ స్నేహితురాలు. కానే కాదు ట్రంపు మాట వినసొంపు అన్నాడో పెద్దమనిషి.. లేదు లేదు ట్రంపు ఏమంత ఇంపైన పదం కాదని మరో పండితురాలు అన్నది. ఈ డైలాగులన్నీ పక్కనే ఉన్నా మాట్లాడుకునేవాళ్లకు తెలియకుండా వింటోంది పిపీలకం అనే మాద్రన్ చీమ. సహజంగానే దానికి ఎన్నో అనుమానా లొచ్చాయి. రావిశాస్త్రి గారి కథలోలాగ తానూ బయలుదేరి మాంచి తెలివి గలవారిని కలిసి ఇంతకీ ఈ ట్రంపు నిజంగా ఇంపు, కంపు, సొంపునా లేక ఇవేవీ కాని మరో మనిషా అని తెలుసుకోడానికి అక్కడినుండి జనంపై, ప్రపంచంపై పడింది చీమ.

మొదట దువ్వాడ జగన్నాథం సినిమా డైలాగులు రాసినతని దగ్గరికి పోయింది పిపీలకం. ఆయన వెంటనే తన డైలాగు ట్రంప: ట్రంపస్య ట్రంపోభ్య:... అన్నాడు. ఈ పదాలకు అర్థమేమిటన్నది పిపీలకం. నేను బిజీగా ఉన్నాను మళ్లీ రమ్మన్నాడాయన. డ్రీం రియలిజంలో లాగ కలనో, నిజమో తెలియకుండానే చీమ తనకిష్టమైన వాళ్లదగ్గరికి అలవోకగా పోతోంది. అలా ఇంగ్లీషు రచయిత, నాటకకర్త షేక్స్పియర్ దగ్గరికి పోయింది. ట్రంపు గురించి అడిగింది, మీకేమైనా తెలిస్తే చెప్పమంది. ఆయనొక్కటే మాట చెప్పాడు. ట్రంపు మిత్రులెవరో చెప్పు నేను ట్రంపు గురించి చెబుతాను అన్నాడు. ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరై వచ్చిన వాళ్లెవరో ముందు కనుక్కో అన్నాడు. చీమ వెంటనే ట్రంపు మిత్రులెవరు అని కనుక్కోవడానికి బయలుదేరింది. ఆయన మిత్రుల్ని వరుసగా కలుస్తోంది. ఒక మిత్రుడేమో ట్రంపంటే అమెరికా ప్రెసిడెంటు అంటే ప్రపంచంలో బాగా ప్రాచుర్యమున్న, బలవంతుడైన వ్యక్తి అన్నాడు.

ప్రపంచంలో బలవంతుడైన వ్యక్తి ఎలాగవుతాడు? ఒక్క బాక్సింగు క్రీడాకరిణిని లేదా క్రీడాకారుణ్ణి కొట్టగలడా అని ఆరా తీసింది.కొట్టలేడని చెప్పారు చాలామంది. మరి ప్రపంచంలో అందరికంటే ఎలా బలవంతుడవుతాడు అమెరికా ప్రెసిడెంటు, అది ట్రంపు కావచ్చు ఇంకెవరైనా కావచ్చు అనేసరికి అసలు అమెరికా అధ్యక్షుడంటే ప్రపంచ పోలీసు నీకేం తెలుసు?అని ఇంకొకరన్నారు. మరి మామూలు సూటు బూటు వేసుకున్నాడు కదా పోలీసెలా అవుతాడు వాళ్ల యూనిఫాం కూడా వేసుకోలేదు కదా అంది పిపీలకం. ఓసి పిచ్చి పిపీలకమా అదంతే! ప్రపంచ పోలీసు అలాగే ఉంటాడు మరి. చేతిలో లాఠీ పెట్టుకొని ఉంటాడా ఏమన్నా? అవసరమొచ్చినప్పుడు తన లాఠీ లాంటి ఆధిపత్యం చూపిస్తాడు అదే అందులో ఉన్న తమాషా అన్నారింకొకరు.



అసలు ఈ రాష్ట్రంలో, ఈదేశంలో కాదు నేను సీదా అమెరికాకే పోయి ట్రంపుగారి ఆఫీసులో ఏమేమి జరుగుతాయో చూసిరావడం మేలు అనుకొని పిపీలకం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ఎటువంటి పాసుపోర్టు, వీసా కనీసం టికెట్టు కూడా లేకుండానే విమానమెక్కేసింది. విమానంలో పోతున్న భారతీయులు అక్కడ పౌరసత్వం ఉన్నోళ్లు, ఇప్పుడు తీసుకుందామని ప్రయత్నాలు చేస్తున్నవాళ్లు మాట్లాడుకునే మాటలు మన పిపీలకం గారి చెవిలో పడ్డాయి. తన దేశ పౌరుల క్షేమమే తనకు ముఖ్యం అని ట్రంపు మాటలున్న వీడియో చూస్తున్నాడు ఒక యువకుడు. పక్కనే ఇంకో యువతి, ఇద్దరూ భార్యాభర్తలు అక్కడ ఒకరికి ఉద్యోగముంది ఇంకొకరికి ప్రయత్నం చేద్దామని పోతున్నారు. తెలుగులో మాట్లాడుతుండడం విని పిపీలకానికి ఆశ్చర్యమేసింది, అరే వీళ్ళు తెలుగోళ్ళు కదా ఇంగ్లీషులో కదా మాట్లాడాల్సింది అనుకుంది కూడా. పక్కనోళ్లకు వినబడకుండా అలా తెలుగులో మాట్లాడుతున్నారని తరువాత అర్థమయింది. ఇప్పుడు ట్రంపు చేస్తున్న పనులకు, మాట్లాడుతున్న మాటలకు ఎక్కువగా భయపడు తున్నది భారతీయులే అని అర్థమయింది. ఇంతలో దానికి ఆకలిగా అనిపించింది. విమానంలో పిల్లలు తింటూ పడేసిన కేకుపొడి, ఇంకా అలాంటివే దొరికితే తిని పడుకుంది పిపీలకం. వాషింగ్టన్ వచ్చిందని అందరూ దిగిపోతున్నారు.

మెల్లగా అందరూ దిగిపోయినాక తానూ దిగింది పిపీలకం. తననెవరైనా చూస్తున్నారేమోనని మొదట అనుమానపడింది. ఎవరిపనుల్లో వాళ్లున్నారు. అక్కడి చీమలు కూడా తనని చూసినట్టు అనిపించింది కాని అవి పెద్దగా పట్టించుకోలేదు. ట్రంపు పాలనలో తమకేమైనా మేలు జరుగుతుందని అనుకుంటున్నారా అని వాటిని అడిగింది పిపీలకం వచ్చీరాని ఇంగ్లీషులో. ఎవరొస్తే ఏమన్నట్టు మాట్లాడాయి అవికూడా. సరేననుకుని మెల్లగా ప్రెసిడెంటు ఉండే స్వేతసౌధం వైపు పోయింది. అక్కడ చీమలతో ఇంటర్వ్యూ చేసి కొన్ని వివరాలు రాబట్టింది. విలేకరులతో ట్రంపుగారు ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి అది. అందరికీ వాళ్ళ టిఫిన్లు ఇచ్చారు. వాళ్లు తినేలోపు వైట్‌హవుస్ వంటశాలలో తనకు నచ్చినవి తినొచ్చింది పిపీలకం. విలేకరులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలిస్తున్నాడు ట్రంపు. ఈదేశంలో పుట్టినంత మాత్రాన ఇక్కడి పౌరసత్వం రాదని ఖరాకండిగా చెబుతున్నాడు. అలా చేస్తే మన దేశానికి నష్టం కదా అన్న ఒక ప్రశ్నకు ముందు నాదేశ పౌరుల్ని కాపాడుకోవడం నా విధి అంటున్నాడు. ఫలానా తేదీ తరువాత పుట్టేటోళ్లకు పౌరసత్వం రాదంటున్నాడు. మొదట సరైన పత్రాల్లేని ఐదువందల విదేశీ పౌరుల్ని వాళ్ల వాళ్ల దేశాలకు పంపేశానన్నాడు. ఇలా చేస్తే వాళ్లు చేసే పనులు అంత తక్కువ జీతాలకు ఇతరులు చేయరు కదా అని ఒక విలేకరి అడిగాడు. నువ్వు బైడెన్ మనిషివా? అన్నాడు ట్రంపు. ఆ నోటి కంపు భరించలేక ఊరకున్నాడు ఆ విలేకరి. దానికీ మార్గం చూపు తానన్నాడు. ఆ సమావేశం తరువాత పెద్ద పెద్ద కంపెనీల సీయివోలతో సమావేశమయ్యాడు అధ్యక్షుడు. అక్కడికీ పోయింది మన పిపీలకం. అక్కడ వాళ్లు నిర్దేశించినవి తన సహాయకుడు అన్నీ రాసుకుంటున్నాడు. త్వరలో ఇవన్నీ చేస్తానని చెబుతున్నాడు వాళ్లకి. అమెరికాలో కొన్ని రాష్ట్రాలకు కూడా పోయింది పిపీలకం. అన్నిదేశాల వాళ్ల ఇండ్లకూ పిలవని పేరంటంలా పోయి అక్కడక్కడ కొన్ని విషయాలు కనుక్కుంది. అయినా తృప్తి కలుగలేదు దానికి.

ఓరోజు ట్యాంకుబండు దగ్గర ఓ పెద్దాయన కూచొని ఉన్నాడు. ఆయన్నడిగితే ఏమైనా తెలుస్తుందేమోనని మెల్లగా కదిలించింది. నువ్వు రావి శాస్త్రి పిపీలకానివా అన్నాడాయన. నేను కొత్త తరం పిపీలకాన్ని, ఐనా నాకూ కొన్ని అనుమానాలున్నాయి అని అమెరికా అధ్యక్షుడి గురించిన విషయం అడిగింది. చూడూ సీదా ఉస్మానియా యూనివర్సిటీకి పో. అక్కడ అపర్ణ అనే విద్యార్థిని అమెరికా అధ్యక్షులపై పరిశోధన చేస్తోంది.ఆమెనే తీరుస్తుంది నీ అనుమానాలు అన్నాడు. సరేనని అపర్ణను కలిసింది పిపీలకం. తనకున్న అనుమానాలన్నీ అడిగింది. ఇంతలేవు నీవు అనుకోకుండా పిపీలకం గారూ అని మొదలు పెట్టింది అపర్ణ.

సూటు బూట్లు, మంచి తిండి, వైట్ హవుస్ నివాసం, మంచి గుర్తింపు, ప్రథమ పౌరుడు భార్యకు ప్రథమ పౌరురాలు, చార్టరుడు విమానాలు, మంచి కార్లు ఇలా అన్నీ ఉంటాయి అధ్యక్షుల వారికి. పెద్ద బుష్షును ఒకరు ఎదిరిస్తే చిన్న బుష్షు తరువాత చంపుతాడు. ఏ అధ్యక్షుడైనా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా రీగన్ కాదు, ఒబామా కాదు ఇంకెవరైనా తమ దేశంలో ఉన్న పెట్టుబడిదారులే ఆ దేశాన్ని, తద్వారా ప్రపంచాన్ని కంట్రోలు చేసేది. అంతెందుకు ఏయే అధ్యక్షుడు ఉండంగా ఏయే యుద్ధాలు చేశాడు, చేయించాడు లేకుంటే ఆయుధాలందించాడు? ఒక్క అధ్యక్షుడైనా ఒక యుద్ధాన్ని ఆపాడా? ఇప్పుడు జరుగుతున్న హమాస్-ఇజ్రాయిల్ యుద్ధమే తీసుకో అధ్యక్షుడు ఏవైపున్నాడు. ఇప్పుడు కొత్త ప్రెసిడెంటు వచ్చాడు కదా అంతకుముందాయన మొదలుపెట్టిన వాటిని ఆపుతాడా? కాబట్టి పిపీలకం గారూ, తోలుబొమ్మలాట చూశారా అలాగే ఈ అధ్యక్షుడి ఆట ఆడించేది వేరే వాళ్లు. ముందు అది తెలుసుకోండి.

పిపీలకానికి మనసు తేలికపడిందిప్పుడు. హాయిగా తన చిన్ని చిన్ని ఊపిరితిత్తులతో గాలి తీసుకుంది. అమెరికా అధ్యక్షుడంటే ఓ మిలిటరీ ఉద్యోగం అనుకుంటూ ఇంటికి పోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు వాళ్లకు విషయాలు చెప్పాలని కూడా అనుకుంది. ■

బిజినెస్

ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.11,792 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 14.8 శాతం వృద్ధితో రూ.11,792 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.10,272 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.18,678 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో 9.1 శాతం వృద్ధితో రూ.20,370.6 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 14.1 శాతం పెరిగి రూ.15,20,309 కోట్లుగా చోటు చేసుకున్నాయి. కరెంట్ ఎకౌంట్ డిపాజిట్లు 13.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి. నికర దేశీయ అడ్వాన్సులు 15.1 శాతం పెరిగాయని ఆ సంస్థ తెలిపింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.96 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం సెప్టెంబర్ త్రైమాసికంలో జీఎన్‌పీఏ 1.97 శాతంగా చోటు చేసుకుంది.

బీఓఐ ఫలితాలు ఆకర్షణీయం

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 35 శాతం వృద్ధితో రూ.2,517 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,870 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో బీఓఐ నికర వడ్డీ ఆదాయం 11 శాతం పెరిగి రూ.6,070 కోట్లకు చేరింది. నికర మొండి బాకీలు1.41 శాతం నుంచి 0.85 శాతానికి తగ్గాయి. సూల ఎన్పీఏలు 5.35 శాతం నుంచి 3.69 శాతానికి పరిమితమయ్యాయి.

తగ్గిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభాలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ప్రయివేటు రంగంలోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభాలు 53 శాతం తగ్గి రూ.339 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.716 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 14 శాతం పెరిగి రూ.4,902 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.94 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 2.04 శాతం జీఎన్‌పిఏ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 0.68 శాతంగా నికర నిరర్థక ఆస్తులు.. గడిచిన క్యూ33 ముగింపు నాటికి 0.52 శాతానికి తగ్గాయి.

యెస్ బ్యాంక్ లాభాలు మూడు రెట్లు..

ప్రయివేటు రంగంలో యెస్ బ్యాంక్ నికర లాభాలు మూడు రెట్లు పెరిగాయి. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.612 కోట్ల నికర లాభాలు సాధించింది. మొండి బాకీలు తగ్గడంతో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.231 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.8,179 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో రూ.9,341 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2 శాతం నుంచి 1.6 శాతానికి తగ్గగా.. నికర ఎన్పీఏలు 0.9 శాతం నుంచి 0.5 శాతానికి పరిమితమయ్యాయి.

నెలలో 8 లక్షల క్రెడిట్ కార్డుల జారీ



న్యూఢిల్లీ : దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం, జారీ భారీగా పెరుగుతోంది. 2024 డిసెంబర్‌లో కొత్తగా 8,20,000 క్రెడిట్ కార్డులు జారీ అయినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వెల్లడించింది. అంతక్రితం నవంబర్‌లో కొత్తగా 3.50 లక్షల కార్డులు జారీ అయ్యాయి. గడిచిన నెలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా 3.12 లక్షల కార్డులను అందించగా.. ఎస్బీఐ కార్డ్స్ 2.09 లక్షల కార్డులను వినియోగదారులకు అందించింది. ఆ తర్వాత స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ 1.50 లక్షల కార్డులు జారీ చేసింది. పెండ్లిండ్ల సీజన్, ఏడాది ముగింపు పండగల సమయంలో ఖర్చులు అధికమవడం ఈ కార్డుల పెరుగుదలకు కారణమైందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024 డిసెంబర్‌లో క్రెడిట్ కార్డుల వ్యయాలు దాదాపు 11 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

హిండ్‌వేర్ టైల్స్ బిజినెస్ సీఈఓగా నిరుపమ్ సహాయ్



న్యూఢిల్లీ : హిండ్‌వేర్ లిమిటెడ్ తన బాత్ అండ్ టైల్స్ వ్యాపారానికి కొత్త సీఈఓగా నిరుపమ్ సహాయ్‌ను నియమించింది. తన శానిటరీవేర్, కుళాయిలు, టైల్స్ వ్యాపారాల తదుపరి అభివృద్ధి దశకు ఆయన నాయకత్వం వహించనున్నారని ఆ కంపెనీ తెలిపింది. డిక్సన్ టెక్నాలజీస్ నుంచి వచ్చి ఆయన హిండ్‌వేర్‌లో చేరారు. డిక్సన్‌లో లైటింగ్ సొల్యూషన్స్ బిజినెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కెరీర్‌లో ఫిలిప్స్ లైటింగ్, జీఈ క్యాపిటల్, వర్ల్‌పూల్, ఏషియన్ పెయింట్స్‌లను కీలక హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది.

దేశంలోనే తొలి లిథియం రిఫైనరీ

- వర్ధమాన్ లిథియం వెల్లడి

VARDHAAN LITHIUM (I) PRIVATE LIMITED

నాగ్‌పూర్ : దేశంలోనే తొలి లిథియం రిఫైనరీని తాము ఏర్పాటు చేస్తున్నట్టు వర్ధమాన్ రిఫైనరీ చైర్మెన్ సునీల్ జోషి, డైరెక్టర్ వేదాంష్ జోషి తెలిపారు. రూ.42,532 కోట్లతో నాగ్‌పూర్ సమీపంలో దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించారు. 500 ఎకరాల్లోని ఈ ప్లాంట్‌లో ప్రతీ ఏడాది 60వేల టన్నుల లిథియం రిఫైన్ చేయడం ద్వారా 20గిగావాట్ బ్యాటరీలను తయారు చేయనున్నామన్నారు.

పరస్పరం సహకరించుకుందాం

- ద్వైపాక్షిక విధానాలపై చర్చ
- భారత్, ఇండోనేసియా మధ్య కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ : ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, ఇండోనేసియా నిర్ణయించాయి. ముఖ్యంగా రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలు జరిగేలా ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ప్రధాని మోడీ మధ్య జరిగిన సమావేశంలో ఒప్పందం కుదిరింది. సుబియాంతో మూడు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.శనివారం సమావేశం ముగిసిన అనంతరం ఇరుదేశాల నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ఇండోనేసియా కీలక భాగస్వామి అని మోడీ వ్యాఖ్యానించారు. 10 సభ్యదేశాలు కలిగిన ఆసియాన్‌తో పాటు ఇండో పసిఫిక్ కూటమిలో ఇండోనేసియాకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వివాదమే ఊపిరిగా..

ముస్లింల ప్రార్థనా స్థలాలపై బీజేపీ తీరు | హిందూత్వ శక్తులకు సహకారం

- కోర్టులను ఆశ్రయిస్తూ అలజడిని సృష్టిస్తున్న వైనం
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇది తీవ్రం
- అయోధ్యలో రామాలయ ప్రతిష్టాపన జరిగిన ఏడాదిలోపే పలు ఘటనలు
- మోడీ, యోగిల వివాదాస్పద వ్యాఖ్యలు ఆందోళనకరం : మేధావుల, విశ్లేషకులు



న్యూఢిల్లీ : అయోధ్యలో రామ మందిర నిర్మాణం పేరుతో బీజేపీ రాజకీయంగా చాలా ప్రయోజనాన్ని పొందింది. ముఖ్యంగా, 1980ల నుంచి ఈ అంశాన్ని వాడుకుంటూ వచ్చింది. ఎట్టకేలకు 2019లో సుప్రీంకోర్టు ఆదేశాలతో వివాదం ముగిసింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలోనే ఆలయ నిర్మాణానికి దారులు సుగమమయ్యాయి. దీంతో ఏడాది క్రితం ప్రధాని మోడీ సమక్షంలో ఇక్కడ పాక్షికంగా నిర్మించిన రామాలయ ప్రతిష్టాపన జరిగింది. ఇక అయోధ్య వంటి వివాదాస్పద అంశం ఉండదని అంతా భావించారు. అయినప్పటికీ, 'రామ మందిరం' లాంటి వివాదాలు దేశంలోని పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయనీ, హిందూత్వ శక్తుల ప్రయత్నాలకు బీజేపీ ప్రభుత్వాలు తోడ్పాటును అందిస్తున్నాయని కొందరు మేధావులు, విశ్లేషకులు చెప్తున్నారు.

రామాలయ ప్రతిష్టాపన.. విజయానికి అవకాశం మాత్రమే కాదనీ, వినయం కూడా అని మోడీ అన్నారు. ఆ సమయంలో మోడీ చెప్పిన మాటలు.. ఆయన వ్యవహరిస్తున్న తీరుకు విరుద్ధంగా ఉన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో మోడీ చేసిన ప్రసంగాలే దీనికి ఉదాహరణగా వివరిస్తున్నారు. ఈ జాబితాలో యూపీ సీఎం యోగి కూడా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. మోడీ, యోగిల నుంచి ఇతర బీజేపీ నాయకుల వరకు ఈ వినయం అనేది ఏ కోశానా కనబడటం లేదని అంటున్నారు. బాధ్యతాయుతమైన స్థాయిలో ఉండి అగ్నికి ఆజ్యం పోసేలా వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు.

సుదూర కలగా అయోధ్య మసీదు

మసీదు నిర్మాణం కోసం అయోధ్యలోనే సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు 5 ఎకరాల తగిన భూమిని ఇవ్వాలని తీర్పు సమయంలోనే సుప్రీంకోర్టు తెలిపింది. అయితే మసీదు అనేది సుదూర కలగానే మిగిలిపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం వివాదానికి శాశ్వత పరిష్కారమని అంతా భావించారనీ, అయితే, ముస్లిం మైనారిటీల స్థలాలను ఆక్రమించుకోవటానికి ఇది ఒక ఉదాహరణగా నిలిచిందని అంటున్నారు. ఈ వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడాలని సూచిస్తున్నారు.

ప్రార్థనా స్థలాల చట్టానికి వ్యతిరేకంగా పరిస్థితులు

ప్రస్తుతం దేశంలో పి.వి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం 1991 చర్చకు వస్తున్నది. మరే ఇతర ప్రార్థనా స్థలం లక్షణాన్ని మార్చకూడదని సుప్రీంకోర్టు హామీ ఇచ్చిన అదే చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ ప్రస్తుతం కొనసాగుతున్నది. దేశంలోని పరిస్థితులు మాత్రం ఈ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, బీజేపీ పాలిత రాష్ట్రాలైన యూపీ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ముస్లిం మత ప్రార్థనా స్థలాల విషయంలో ఈ తీరు కనిపిస్తున్నదని చెప్తున్నారు.

బీజేపీకి ఊపిరే 'వివాదం'

వివాదాస్పద బాబ్రీ మసీదు-అయోధ్య అంశం తర్వాత.. ఇకపై ఇలాంటి వివాదాలేవీ ఉండవని అంతా భావించారు. కానీ, యోగి లాంటి నేతల వ్యాఖ్యలు చూస్తే 'వివాదం' ఇంకా సమసిపోలేదన్న విషయం అర్థమవుతున్నదని విశ్లేషకులు అంటున్నారు.

దానిని ఉనికిలో ఉంచటం ద్వారానే బీజేపీకి రాజకీయంగా ఊపిరి అందుతుందన్న ఆలోచనతోనే బీజేపీ అగ్ర నాయకులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు.

సంభాల్.. వారణాసి..మధుర..అజ్మీర్

యూపీలోని సంభాల్‌లో హిందూత్వ శక్తులు అక్కడ ఉన్న ముస్లిం ప్రార్థనా స్థలాన్ని స్వాధీనం చేసుకునే చర్యలకు పాల్పడుతుంటే, అధికారంలో ఉన్న యోగి సర్కారు వారికి అండదండగా నిలుస్తున్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. "వారసత్వాన్ని తిరిగి పొందటం చెడు విషయం కాదు. వివాదాస్పద నిర్మాణాలను మసీదులు అని పిలవకూడదు. ముస్లిం లీగ్ మనస్తత్వంపై భారత్ నడపబడదు" అని యూపీ సీఎం యోగి నొక్కి చెప్పిన విషయాన్ని తెలియజేస్తున్నారు. రామాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాముడి శక్తి, పరిష్కారం అంటూ వ్యాఖ్యలు చేసిన మోడీ.. యోగి వ్యాఖ్యలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒక్క సంభాల్ మాత్రమే కాదు.. వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు, మధురలోని షాహి ఈద్గా, అజ్మీర్‌లో దర్గా.. ఇలా అనేక ఇస్లామిక్ ప్రార్థనా స్థలాలే టార్గెట్‌గా హిందూత్వ శక్తుల నుంచి దాడుల నిరంతరం కొనసాగుతున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

వడ్డీ వసూల్ స్కీంగా "కళ్యాణ లక్ష్మి"

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కళ్యాణ లక్ష్మి స్కీం వడ్డీ వసూల్ స్కీంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సిరికొండలో పెందూరు సోంబాయి తీసుకున్న క్రాప్‌లోన్‌కు సంబంధించి రుణమాఫీ డబ్బులను బ్యాంక్ వడ్డీకింద జమ చేసుకోవడాన్ని ఆయన తప్పు పట్టారు. "వచ్చిన కల్యాణలక్ష్మి రూ. లక్షలో రూ.60 వేలు బ్యాంకుకు, రూ.40 వేలు లబ్ధిదారునికా? మీరు నడిపేది ప్రభుత్వమా? రికవరీ ఏజెన్సీనా? అందరికీ రూ. రెండు లక్షల పంట రుణమాఫీ చేసామని బాకాలు కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. సోంబాయి కన్నీటికి కారణం ఎవరు? తనకు రావాల్సిన కల్యాణలక్ష్మి డబ్బుల్లో రూ. 60 వేలు ఎందుకు గుంజుకున్నారు. తులం బంగారం అన్నారు, ఆఖరికి కల్యాణలక్ష్మి డబ్బుల్లో కూడా కొర్రీలు పెడుతున్నారు. దందాలు, వసూళ్ల మాత్రమే తెలిసిన రేవంత్‌కి ఒక చిన్న సలహా! కనీసం ఆడపిల్ల పెండ్లి డబ్బుల జోలికి పోవద్దు. వినడానికే అసహ్యంగా ఉంది" అని కేటీఆర్ విమర్శించారు.

కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పాలి : కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్ కలెక్టర్‌కు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎక్స్‌వేదికగా డిమాండ్ చేశారు. మహిళా కలెక్టర్ అని చూడకుండా మంత్రి అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. "కాంగ్రెస్ నాయకుల అహంకారానికి పరాకాష్ట ఈ ఉదంతం. ఇలాంటి వైఖరి ఆమోదయోగ్యం కాదు. ఇది కేవలం కలెక్టర్‌ను అవమానించడమే కాదు. మొత్తం అధికార యంత్రాంగాన్నే అవమానించినట్టు. మహిళా కలెక్టర్‌కి మేము అండగా ఉన్నాం. అని కవిత పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యానించారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నేషనల్ ఓటర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గవర్నర్ ప్రసంగించారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాతలు స్వేచ్ఛగా, పక్షపాతానికి తావులేకుండా దేశంలో ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించాలన్న లక్ష్యంతో భారత ఎన్నికల కమిషన్‌ను స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం ఇచ్చిన హక్కును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మొదటి సారి 5,45,026 కొత్త ఓటర్ కార్డ్‌లను జారీ చేశామని చెప్పారు. తెలంగాణ ఎన్నికల స్టాటికల్ రిపోర్ట్ బుక్‌ను ఈ సందర్భంగా గవర్నర్ విడుదల చేశారు. ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు భారత ప్రధాన ఎన్నికల అధికారి సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఈఓలు సత్యవాణి, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఇందిరమ్మ ఇండ్లకు మోడీ ఫోటో పెడతారా? రేషన్‌కార్డులపై మోడీ ఫోటో ముద్రిస్తారా? అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై ఆయన చేసి వ్యాఖ్యలను ఖండించారు. ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. దావోస్ నుంచి రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల పర్వాన్ని చూస్తేనే కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని అర్థమవుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రికార్డు స్థాయిలో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు రావడం అసాధారణ విషయమన్నారు. పదేండ్లలో కేసీఆర్ ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. పదేండ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల పదేండ్ల నిరీక్షణ ఇందిరమ్మ ఇండ్లతో తీరబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా సీఎం రేవంత్, మంత్రులు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. రిపబ్లిక్ డే సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు కనువిప్పు కలిగేలా కాంగ్రెస్ పాలన ఉందని చెప్పారు. రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ నాలుగు ముక్కలౌవుతుందని తెలిపారు. తండ్రి, కొడుకు తప్ప ఆ పార్టీలతో ఇంకెవరూ మిగలబోరని ఆయన హెచ్చరించారు.

పార్టీ కోసం అహర్నిశలు పని చేశారు.

సీనియర్ నేత ప్రేమ్‌లాల్ సంతాప సభలో మహేష్‌కుమార్‌గౌడ్

కాంగ్రెస్ సీనియర్ నేత ప్రేమ్‌లాల్ మరణం బాధాకరకమని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా తనకు, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. పార్టీ కోసం ఆయన అహర్నిశలు పని చేశారని గుర్తు చేశారు.

ఆయనతో తనకు 30 ఏండ్ల అనుబంధం ఉందని తెలిపారు.శనివారం హైదరబాద్‌లోని ఇందిరాభవన్‌లో ప్రేమ్‌లాల్ సంతాపసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాషలో ప్రేమ్‌లాల్‌కు చక్కటి ప్రావీణ్యం ఉందని చెప్పారు. ఆయనకు దక్కాల్సిన పదవులు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానినికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షులు కేశవరావు, వి. హనుమంతరావు, ఎమ్మెల్యే సామేల్, సీనియర్ నేతలు జి.చిన్నారెడ్డి, ఎం. కోదండరెడ్డి, మెట్టు సాయికుమార్, నర్సింహ రెడ్డి, నూతి శ్రీకాంత్, బొల్లు కిషన్, ఫిరోజ్ ఖాన్, దీపక్ జాన్ తదితరులు మాట్లాడారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై తప్పుడు ప్రచారం మానుకోండి

- బీఆర్ఎస్ నేతలకు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)పై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ వెంబడి భూమి ధరలు పెంచి పరిహారం పెరిగేలా చూశామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై కక్షతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవద్దని హితవు పలికారు. శుక్రవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే తమ అజెండా అని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు సీఎంను బదనాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. ట్రిబుల్‌ఆర్ అలాట్‌మెంట్ మార్పుపై బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు పలు విమర్శలు చేస్తున్నారని చెప్పారు. దాని అలాట్‌మెంట్ ఫైనల్ చేసిందే కేంద్ర ప్రభుత్వం అని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నాయకులతో చేతులు కలపొద్దని బీజేపీ నేతలకు సూచించారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి ఆ ఘనత బీజేపీ ఖాతాలో వేసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అత్యంత సంపన్నుల కోసం..


- వైట్‌హౌస్ స్థాయి భద్రతతో 'డూమ్స్‌డే బంకర్'

వాషింగ్టన్ : అత్యంత సంపన్నుల కోసం అమెరికాకు చెందిన స్ట్రాటజికల్లీ ఆర్మర్డ్ అండ్ ఫోర్టిఫైడ్ ఎన్విరాన్‌మెంట్స్ (సేఫ్) అనే సంస్థ 'డూమ్స్‌డే బంకర్' కాంప్లెక్స్‌ను ఆవిష్కరించింది. ఇందులో వైట్‌హౌస్ స్థాయి భద్రత, గోప్యతతో పాటు.. రోబోటిక్ స్టాఫ్, డైనింగ్ సౌకర్యాలు, ఇండోర్ స్విమ్మింగ్ పూల్, కోల్డ్ ఫ్లంజ్ సెంటర్లు, క్లైంబింగ్ వాల్, భూగర్భ స్విమ్మింగ్ పూల్ వంటి అత్యాధునిక సదుపాయాలను అందిస్తున్నట్టు వివరించింది. ప్రకృతి విపత్తులను, భారీ పేలుళ్లను తట్టుకోగలిగేలా వీటిని నిర్మిస్తున్నట్టు తెలిపింది. ఈతరహా సేవలు అమెరికాలోని 50 నగరాల్లో అందుబాటులోకి రానున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్ అల్ కోర్బీ తెలిపారు.

'స్త్రీ' తప్పక చదవాల్సిన పుస్తకం

- డాక్టర్ హెచ్.నర్మద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



జీవితంలోని వివిధ దశలు దాటే స్త్రీ తన ఆరోగ్యసంరక్షణ కోసం అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ హెచ్.నర్మద తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో 1977 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ఆ బ్యాచ్‌కు చెందిన 150 మందికి పైగా డాక్టర్లు, తన క్లాస్ మేట్స్ సమక్షంలో నర్మద 'స్త్రీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సు నుంచి రుతువిరతి (మెనోపాజ్) వరకు వచ్చే మార్పులపై ఈ పుస్తకం అవగాహన కలిగిస్తుందని తెలిపారు. మహిళలకు, ముఖ్యంగా గ్రామీణ మహిళలకు ప్రయోజనం కలిగించే రీతిలో పుస్తకాన్ని రాసినట్టు చెప్పారు. యుక్తవయస్సు నుంచి రుతువిరతి వరకు, స్త్రీ శరీరం హార్మోన్ల మార్పులు, యుక్తవయస్సు పునరుత్పత్తి సామర్థ్యం ప్రారంభమైతే, సూచిస్తుంది రుతువిరతి దాని ముగింపు అని తెలిపారు. మెనోపాజ్‌కు దారితీసే పెరిమెనోపాజ్ దశలు, వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు, మూడ్ స్వింగ్‌లు ఇలాంటి ఎన్నో సమస్యలతో సతమతమయ్యే మహిళలకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ నర్మద తెలిపారు. యుక్తవయస్సు, వివాహం, శిశుజననం, నవజాత శిశువులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, మెనోపాజ్, పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్ (పీసీఓడీ), పోషకాహారం, గర్భిణీ స్త్రీలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, రొమ్ము క్యాన్సర్, వంధ్యత్వం, టెస్ట్ ట్యూబ్ బేబీ, చైల్డ్ న్యూట్రిషన్ తదితర ఆసక్తికర విషయాలు ఇందులో ఉన్నాయని తెలిపారు.

రెడ్‌క్రాస్‌కు నలుగురు ఇజ్రాయిలీ మహిళా సైనికుల అప్పగింత

- 70మంది ఖైదీలను విడుదల చేసిన ఇజ్రాయిల్



గాజా సిటీ : తమవద్ద బందీలుగా వున్న నలుగురు ఇజ్రాయిలీ మహిళా సైనికులను హమాస్ కార్యకర్తలు శనివారం గాజాలోని రెడ్‌క్రాస్‌కు అప్పగించారు. అప్పగించడానికి ముందు వారిని జనాల ఎదుట ప్రదర్శనగా తీసుకువెళ్లారు. గాజా నగరంలోని పాలస్తీనా స్క్వేర్ వద్ద గల వేదికపై నిలుచుని ఆ నలుగురు మహిళలు నవ్వుతూ వేలాదిమంది ప్రజలకు చేయి ఊపుతూ కనిపించారు. వారందరూ 20ఏళ్ళ లోపు వయస్సు వారే. అనంతరం వారు అక్కడ వేచి వున్న రెడ్‌క్రాస్ వాహనాల్లో వెళ్ళిపోయారు. మరోవైపు, ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్ 70మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. అయితే వారిని తిరిగి గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌కు వెళ్ళేందుకు అనుమతించడం లేదు. ఈజిప్ట్ ప్రభుత్వ కైహెరా టివి ఈ మేరకు వెల్లడించింది. వారందరూ రాఫా సరిహద్దుల్లో ఈజిప్ట్ వైపునకు చేరుకుంటున్నారని తెలిపింది. హమాస్ చెరలో బందీగా వున్న సామాన్య మహిళ ఒకరు విడుదలై తమ వద్దకు చేరేవరకు పాలస్తీనా ఖైదీలను ఉత్తర గాజాలోకి తిరిగి వెళ్లనివ్వబోమని ఇజ్రాయిల్ తెలిపింది. అయితే యహూద్‌ను వచ్చే వారం విడుదల చేస్తామని తాము మధ్యవర్తులకు చెప్పామని హమాస్ సీనియర్ అధికారి తెలిపారు. కాగా ఇది చిన్న విషయమేనని ఈజిప్ట్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అయినా ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇదిలావుండగా, ప్రధాని నెతన్యాహు కార్యాలయం బందీల విడుదల కార్యక్రమం వీడియోను విడుదల చేసింది. ఇజ్రాయిల్ ఆర్మీ బేస్ వద్ద వారికి సాదరంగా స్వాగతం పలుకుతున్న దృశ్యాలు అందులో వున్నాయి. శనివారం బందీల విడుదల వుందని తెలిసిన వెంటనే వారిని చూసేందుకు ఉదయం నుండే టెల్ అవీవ్‌లో, గాజా సిటీలో ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. అక్కడ పరిస్థితులను ఎప్పటికప్పుడు లైవ్‌లో చూపిస్తూ ఇజ్రాయిల్ టివి ప్రసారం చేసింది. ఇజ్రాయిల్ ఆర్మీ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి టివిలో మాట్లాడుతూ, యువతులైన ఆ నలుగురు బందీలను అలా ప్రదర్శనగా చూపించడాన్ని తీవ్రంగా నిరసించారు. గత ఆదివారం కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ముగ్గురు బందీలు విడుదలయ్యారు. ఇందుకు బదులుగా 90మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేశారు. వీరిలో అందరూ మహిళలు, పిల్లలే.

నవచిత్రం



6 భాషల్లో 'వెంకటలచ్చిమి'

పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'వెంకటలచ్చిమి'. రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మాతలుగా, డైరెక్టర్ ముని దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ఈ మూవీ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ ముని మాట్లాడుతూ.. "వెంకటలచ్చిమి'గా కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ట్రైబల్ గర్ల్ యాక్షన్ రివేంజ్ డ్రామాగా ఇండియన్ ఇండస్ట్రీలో ఈ సినిమా సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు.

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ,'మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. డైరెక్టర్ ముని ఈ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ సినిమా తర్వాత నా పేరు 'వెంకటలచ్చిమి'గా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది. నా కెరీర్‌కి నెక్స్ట్ లెవల్‌గా ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిలిచిపోతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ముని, మ్యూజిక్ డైరెక్టర్: వికాస్ బడిశా, ప్రొడ్యూసర్: రాజా, ఎస్ఎస్ చౌదరి



'ఎల్‌వైఎఫ్' టీజర్ విడుదల

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తూ మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై కిషోర్ రాఠి, మహేష్ రాఠి, ఏ రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'ఎల్‌వైఎఫ్'.

ఎస్పీ చరణ్, ప్రవీణ్, భద్రం, నవాబ్ షా, షకలక శంకర్, రవిబాబు, రియా, సంధ్య తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్ర టీజర్ ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'మంచి కథతో వస్తున్న ఈ చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలి. తీసే సినిమాలు ఎక్కువ బడ్జెట్లో కాకుండా మంచి కంటెంట్ తో తక్కువ బడ్జెట్ తో ఉంటే సినిమాలు బాగుంటాయి. ఎక్కువ బడ్జెట్ పెట్టి తర్వాత టికెట్ రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని అడగడం కంటే తక్కువ బడ్జెట్లో మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం మంచిది.

ఈ చిత్రం అలా తక్కువ బడ్జెట్లో, మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రం. ఇటువంటి చిత్రాలను ప్రోత్సహించడంలో సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా నేను ముందుంటాను. ఓటిటిలో అయినా థియేటర్లో అయినా తక్కువ బడ్జెట్ తో వచ్చే చిన్న సినిమాలు మంచి విజయాన్ని సాధిస్తున్నాయి. కొత్త సినిమాలతో పోటీపడుతూ కలెక్షన్స్ వసూలు చేస్తున్నాయి' అని అన్నారు.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పవన్ కేతరాజు, సినిమాటోగ్రఫీ : శ్యామ్ కె నాయుడు, సంగీతం : మణిశర్మ, యాక్షన్ : కార్తీక్ క్రొడర్, ఎడిటర్ : ఆర్. కె, కొరియోగ్రఫీ : మోయిన్, ఆర్ట్ : చిడిపల్లి శంకర్.

రాష్ట్ర మహాసభకు 'నవతెలంగాణ' ప్రత్యేక సంచిక

ఆవిష్కరించిన బీవీ.రాఘవులు, తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరుగుతున్నందున 'నవతెలంగాణ' ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. మహాసభ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పోరాటాలు, సాధించిన విజయాలకు సంబంధించి ఆర్టికల్స్‌తో పాటు పలువురు ప్రజానాయకుల ఇంటర్వ్యూలతో కూడిన ప్రత్యేక సంచికను శనివారం పీఎస్ఆర్ గ్రౌండ్‌లో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ బహిరంగ సభలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య, బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, టి.జ్యోతి, మల్లు లక్ష్మి, అబ్బాస్, పాలడుగు బాస్కర్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్‌తో కలిసి సభావేదికపై ఆవిష్కరించారు. నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతీ య ప్రతినిధి మేకల కృష్ణయ్య, డెస్క్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, రిపోర్టర్స్ సుదర్శన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఏడివిటి బాధ్యులు మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు 4 పథకాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా, భూమిలేని నిరుపేద, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకొని అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. లక్షలాది సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి జనవరి 26న అత్యంత పరమ పవిత్రమైన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఈ సంక్షేమ పథకాల అమలును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని నూరు శాతం ఆ గ్రామంలో ఈ నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. లక్షలాదిగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్లలో ఎంట్రీ చేసి అర్హులను గుర్తిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి ఉదాత్త ఉన్నతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఇందిరమ్మ రాజ్యం సంక్షేమ రాజ్యం అని తెలిపారు.అంతకు ముందు ఆ నాలుగు పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.

నేడు నారాయణపేట జిల్లాలో

సీఎం రేవంత్ రెడ్డి నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లా కొస్గి మండలం, చంద్రవంచ గ్రామంలో మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఇందు కోసం ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు.

కలర్‌ఫుల్‌గా 'మై సౌత్ దివా క్యాలెండర్'

ప్రముఖ ఫొటోగ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ రూపొందించిన ప్రతిష్టాత్మక 'మై సౌత్ దివా క్యాలెండర్' ద్వారా ఇప్పటికే పలువురు హీరోయిన్స్ పరిచయమై.. అగ్రశ్రేణిలో ఉన్నారు. తాజాగా 2025 క్యాలెండర్ ను 12 మంది స్టార్స్ తో శుక్రవారం గ్రాండ్ గా లాంచ్ చేశారు.

హీరోయిన్స్ శ్రియా శరన్, కేథరిన్ థెరిస్సా, కాజల్ అగర్వాల్, మాళవికా శర్మ, తాన్య హోప్, ఐశ్వర్య కృష్ణ, కుషిత కొల్లాపు, వినాలీ భట్నాగర్, రియా సచ్ దేవ్, కనిక మాన్, పలక్ అగర్వాల్ తో ఈ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఫౌండర్ మనోజ్ కుమార్ కటొకర్, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డితోపాటు సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్, దర్శకులు కరుణ కుమార్, సుజనా రావు ముఖ్య అతిథులుగా హాజరై తమ విషెస్ తెలియజేశారు.

ఈ సందర్భంగా మై సౌత్ దివా క్యాలెండర్ ఫౌండర్, ఫోటో గ్రాఫర్ మనోజ్ కుమార్ కటొకర్ మాట్లాడుతూ,'మా క్యాలెండర్ ను తొమ్మిది ఏళ్లుగా సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. 12 మంది హీరోయిన్స్ తో కూడిన ఈ క్యాలెండర్ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా. మా క్యాలెండర్ ద్వారా ఇప్పటికే కొత్తవారిని మోడల్స్ గా పరిచయం చేశాం. అలాగే కొంతమంది హీరోయిన్స్ గా మంచి గుర్తింపును అందుకున్నారు. ఈ ఏడాది మరో ఐదుగురిని ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఈ జర్నీలో నాకు సపోర్ట్ గా నిలిచిన మా పార్ట్నర్స్ భారతి సిమెంట్స్, కియారా జ్యువెలరీ, ఈరా క్లినిక్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చెప్పారు.



భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, 'సౌత్ దివా క్యాలెండర్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. ఒక క్యాలెండర్‌లో చాలా కల్చర్స్ ఉండటం మంచి పరిణామం. స్టార్ హీరోయిన్స్‌తో ఉన్న ఈ క్యాలెండర్ కలర్‌ఫుల్‌గా ఉంది' అని అన్నారు

తమ్మినేని సోదరి తోటకూరి సరోజిని మృతి

- పలువురి నివాళి

నవతెలంగాణ-చింతకాని

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదరి, ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన తోటకూరి సరోజిని(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. మృతదేహానికి ఆమె తమ్ముడు తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపల్లెవాడ గ్రామంలో సీపీఐ(ఎం)కు ఆమె పునాదులు వేసినట్టు చెప్పారు. పార్టీ కార్యకలాపాలలో తమ బావకి చేదోడు వాదోడుగా ఉంటూ, సహకరిస్తూ ఉండేదని, అలాంటి వ్యక్తి ఈరోజు మన మధ్యన లేకపోవడం మా కుటుంబానికి తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు కృష్ణమూర్తి కిరణ్ బాబు తదితరులు నివాళి అర్పించారు.



ఉద్యోగులను మరోసారి మోసగించేందుకే యూపీఎస్

- ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులను మరోసారి మోసగించడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్)ను ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి తెస్తున్నదని ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ విమర్శించారు. సీపీఎస్, యూపీఎస్ వద్దనీ, ఓపీఎస్ ముద్దని అన్నారు. శనివారం ఎన్ఎంఓపీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న యూపీఎస్‌కు సంబంధించిన గెజిట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిందని పేర్కొన్నారు. దీని ద్వారా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ వసూలు చేసి పెన్షన్ అమలు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ రూపంలో ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా జమ అయిన రూ.10.5 లక్షల కోట్ల నిధులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తాయని వివరించారు. మరోసారి ఉద్యోగుల సంక్షేమం, కుటుంబ సామాజిక భద్రత ఆలోచించకుండా కేవలం షేర్ మార్కెట్ ద్వారానే ఉద్యోగి భవితవ్యాన్ని నిర్ణయించే ఈ యూపీఎస్ విధానాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా కాంట్రిబ్యూషన్ లేని పెన్షన్ ఒక హక్కుగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ల అనుకూల విధానాలను వంతన పాడే కుహనా ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు సిఫారసు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్పొరేట్ల కడుపు నింపే విధంగా ఈ పెన్షన్ విధానం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏండ్లు కావస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామిక స్వయంపాలనను అమలుల్లోకి తెచ్చి, భారతదేశాన్ని సార్వభౌమాధికార, సర్వసత్తాక, గణతంత్ర దేశంగా నిలిపిన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, మహిళలకు సమాన భాగస్వామ్యం దక్కేలా పాలకులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

వారం రోజుల్లో నలుగురు రైతుల ఆత్మహత్య

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అప్పుల బాధలు భరించలేక వారం రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చనిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. "కాంగ్రెస్‌కు నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేస్తే రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

- ములుగులో రోడ్డు భద్రత మాసోత్సవాలు
- టాస్క్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-ములుగు

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమావళిని పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం సాధన స్కూల్ నుంచి సాధన స్కూల్ వరకు 3కే రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బానోతు రవిచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకంగా ఉండాలని సూచించారు. సహజ సిద్ధమైన కూరగాయలను తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నియంత్రణ అలవర్చుకోవాలని అన్నారు. తప్పుదారుల్లో వాహనాలను నడపటం, అధిక వేగం, హెల్మెంట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురై ఎంతోమంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. రోడ్డుపై లభించే తినుబండారాలను విచ్చలవిడిగా తినడం వల్ల చిన్నపిల్లలకు సైతం గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో సహజసిద్ధమైన కూరగాయలను సాగు చేసుకోవాలని చెప్పారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా గిరిజన ప్రాంతమని, రోడ్డు భద్రత నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే వాహనాలు నడపాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ.. తాను కళాశాలలో ఉన్నప్పుడే రోడ్డు భద్రత నియమావళిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకున్నానని, జీవితం పోతే తిరిగి రాదని, రోడ్డు ప్రమాదాలలో విలువైన ప్రాణాన్ని తీసుకోవద్దని వికలాంగులుగా మారవద్దని చెప్పారు.

జిల్లాలో టాస్క్ శిక్షణ కేంద్రం ఏర్పాటు గొప్ప వరం

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు, ప్రతిభ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి జిల్లాలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప వరమని మంత్రి సీతయ్య అన్నారు. కష్టంలో వచ్చిన విజయం జీవితాంతం సంతోషాన్నిస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌ను కలెక్టర్ దివాకర్ టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టాస్క్ సెంటర్ మారుమూల ప్రాంతాల యువతి, యువకులకు ఎంతగానో దోహదపడుతుందని, ప్రతిభా పరిజ్ఞానం లేకపోతే ఉన్నత చదువులు చదివినా లాభం ఉండదని చెప్పారు.

ఎంఈవో, జేఎల్, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులివ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి పీఆర్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సర్వీసు రూల్స్‌ను ఇస్తూ ఎంఈవో, జేఎల్, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులను కల్పించాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థులు అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం డైరీని అందజేశారు. ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. వీలైనంత త్వరలో అన్ని రకాల పదోన్నతులతోపాటు బదిలీలు నిర్వహించడానికి విశ్లేషణ చేసి నిర్ణయం తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళ సిబ్బందికి రాష్ట్రపతి పతకం ప్రదానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళ సిబ్బంది ఇద్దరికి ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పతకం లభించింది. 76వ గణతంత్ర దినోత్సవం-2025 సందర్భంగా విశిష్ట సేవలందించినందుకుగాను ఇన్‌స్పెక్టర్/స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్/సికింద్రాబాద్ దొంతగాని శ్రీనివాసరావు, సబ్-ఇన్‌స్పెక్టర్/ట్రైనింగ్ సెంటర్, మౌలాలీ పుత్తూరు రవిచంద్రన్ ఈ పతకాన్ని అందుకున్నారు. వీరిలో దొంతగాని శ్రీనివాసరావు: ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌లో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్‌లో అసాధారణ నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు ప్రధాన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించారు. ద

గోదావరి, కృష్ణా నదుల పుష్కరాల సమయంలో దాదాపు 1000 మంది ఇంటి నుండి పారిపోయిన పిల్లలను రక్షించారు, మహిళా ప్రయాణికులను రక్షించారు పి.రవిచంద్రన్ ప్రస్తుతం మౌలాలీ శిక్షణా కేంద్రంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. తన కెరీర్ ప్రారంభం నుంచి అతను డ్రైవింగ్ రంగంలో ఆదర్శప్రాయమైన నైపుణ్యాలను ప్రదర్శించారు. 24 సంవత్సరాల సేవలో "యాక్సిడెంట్ ఫ్రీ" డ్రైవింగ్ పట్ల అతని వృత్తి నైపుణ్యానికి గుర్తింపు, ప్రశంసలు లభించాయి. రాష్ట్రపతి పతకం అందుకున్న సందర్భంగా వారివురికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందనలు తెలిపారు.

సత్ఫలితాలనిస్తున్న మిషన్ భగీరథ టోల్ ఫ్రీ నెంబర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ టోల్ ఫ్రీ నెంబర్‌తో మంచి ఫలితాలొస్తున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. ఆమె ఆదేశాలతో గతేడాది డిసెంబర్ 23న ప్రారంభమైన ఈ కాల్ సెంటర్‌ద్వారా సత్ఫలితాలొస్తున్నాయన్నారు. 280 కాల్స్ రాగా, ఇందులో పట్టణ ప్రాంతాల నుంచి 73, గ్రామీణ ప్రాంతాల నుంచి 207 ఫిర్యాదులొచ్చాయని తెలిపారు. మొత్తం 280 ఫిర్యాదులు రాగా.. 187 ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారని చెప్పారు.

వక్ఫ్ కమిటీ చైర్మెన్ చర్యను తప్పుబట్టిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : వక్ఫ్ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్ తీసుకున్న చర్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా విభేదించింది. ప్రభుత్వ అభిప్రాయాలను వ్యతిరేకించినందుకు జేపీసీలోని ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయడానికి కమిటీ చైర్మెన్ ఎంచుకున్న కారణం చాలా పేలవంగా వుందని విమర్శించింది. కమిటీ వ్యవస్థకు సంబంధించి ఏండ్ల తరబడి స్పష్టంగా రూపొందించుకుని, అనుసరిస్తూ వచ్చిన సాంప్రదాయాలన్నింటినీ తుంగలో తొక్కి చట్టబద్ధమైన పార్లమెంటరీ ప్రక్రియను దెబ్బతీయడం కన్నా మరేదీ దారుణం కాబోదని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్డీఏ ప్రభుత్వం అనుసరించే ఇటువంటి దారుణ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రతిఘటించేందుకు ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్ సార్వభౌమాధికారాన్ని గౌరవించే వారందరూ ఏకతాటిపైకి రావాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

ఎఫ్ఎస్ఎన్ఎల్ ప్రయివేటీకరణ చర్యలను తీవ్రంగా నిరసించిన సీఐటీయూ

న్యూఢిల్లీ : మినీ రత్నగా భావించే ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) ప్రయివేటీకరణను సీఐటీయూ తీవ్రంగా నిరసించింది. ఎంఎస్‌టీసీ లిమిటెడ్ అనుబంధ సంస్థగా వున్న ఈ సంస్థను జపాన్ కార్పొరేషన్ అయిన కొనొయ్కా ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్‌కు అప్పగిస్తూ బీజేపీ ప్రభుత్వం మరో హేయమైన నేరానికి పాల్పడిందని ఒక ప్రకటనలో విమర్శించింది. గత దశాబ్ద కాలంగా ఎఫ్ఎస్ఎన్ఎల్ ప్రయివేటీకరణ చర్యలు కొనసాగుతున్నాయని, కానీ కార్మికులు సమైక్యంగా సాగించే పోరాటాల వల్ల ఇంతకాలం ఆగుతూ వచ్చిందని పేర్కొంది. గతేడాది అక్టోబరు 24న జపాన్ సంస్థతో వాటాల కొనుగోలు ఒప్పందంపై సంతకాలు జరిగిన వెంటనే ఎఫ్ఎస్ఎన్ఎల్‌లోని వివిధ యూనియన్లు ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇటువంటి జాతి వ్యతిరేక చర్యలకు దూరంగా వుండాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కానీ వాటిని పెడచెవిన పెట్టిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ, ఇరు పక్షాల మధ్య కుదిరిన ఒప్పందంలోని సంబంధిత క్లాజుల కింద ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సర్వీసులకు రక్షణ కల్పించబడుతుందని రాతపూర్వకంగా తెలియచేసింది. కానీ ఈ విషయంలో మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీఐటీయూ విమర్శించింది. క్లోజింగ్ తేదీ నుండి ఏడాది కాలం వరకు ఏ ఉద్యోగిని తొలగించడం లేదా పదవీ విరమణ చేయించడం వంటి చర్యలు కంపెనీ తీసుకోదని ఆ వాటాల కొనుగోలు ఒప్పందంలోని సంబంధిత క్లాజు పేర్కొంటోంది. ఇటువంటి ఒప్పందం ద్వారానే కాకుండా మొత్తంగా స్క్రాప్ నిర్వహణా వ్యాపారాన్ని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసిందని విమర్శించింది. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన సీఐటీయూ, ఇటువంటి జాతి వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తూ పోరు బాటను చేపట్టాల్సిందిగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. బంగారు బాతు వంటి కంపెనీని ఇలా ప్రయివేటు సంస్థకు ధారాదత్తం చేసే చర్యలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేసింది.

బ్యాంకులను ప్రయివేటీకరించొద్దు

- లేని పక్షంలో పోరాటాలు, సమ్మెలు : కేంద్రానికి ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం
- పెట్టుబడిదారీ విధానం పెరిగితే దేశానికి ప్రమాదం: ప్రొఫెసర్ బాబు మాథ్యూస్
- ఏపీటీబీఈఎఫ్ 30వ త్రైవార్షిక మహాసభ ప్రారంభం



ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రం హామీ ఇవ్వాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశంలో జాతీయ బ్యాంకులను ప్రయివేటీకరించబోమని 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రయివేటీకరణ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను పాలకులు వీడకుంటే పోరాటాలు, సమ్మెలు చేయడానికి బ్యాంకింగ్ ఉద్యోగులు వెనుకాడబోరని హెచ్చరించారు. హైదరాబాద్ కాచిగూడలోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు హాల్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) రెండ్రోజుల 30వ త్రైవార్షిక మహాసభను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించడ మంటే ప్రజలు పొదుపు చేసిన దాదాపు రూ.280 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రయివేటీకరించడమేనన్నారు. జాతీయ బ్యాంకులు సరిగ్గా పని చేయకపోతే లక్షల కోట్ల లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చినా భారత దేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడ గలిగిందంటే అది.. ప్రభుత్వరంగ బ్యాంకుల వల్లనేనన్నారు. బ్యాంకుల సేవలు, అవసరాలు, ఖాతాదారుల సంఖ్యకు అనుగుణంగా క్లరికల్, కిందిస్థాయి సిబ్బందిని నియమిం చాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల పనితీరును సమీక్షించే చర్యలకు పాల్పడితే సమ్మె తప్పదని హెచ్చరించారు.

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (బెంగళూరు) ప్రొఫెసర్ బాబు మాథ్యూస్ మాట్లాడుతూ.. ఏకీకృత పెట్టుబడి దారీ విధానం మరింత పెరిగితే దేశానికి, ప్రజలకు అత్యంత ప్రమాదమని చెప్పారు. లేబర్ కోడ్ పూర్తిస్థాయిలో అమలు చేస్తే భవిష్యత్‌లో సమ్మెలు చేసే పరిస్థితే ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడీబీఐ లాంటి బ్యాంకుల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇచ్చి ఉత్పాదక రంగంలో ఉద్యోగాల ను, ఉపాధి అవకాశాలను పెంపొందించి నిరుద్యోగాన్ని తొలగించే చర్యలను ప్రభుత్వం చేపట్టడం లేదని విమర్శించారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగల్ కిషోర్ రాయలు మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, స్టీల్ అథారిటీ లాంటి సంస్థల్లో వీఆర్ఎస్ వల్ల దాదాపు ప్రయివేటీకరణ జరిగిపోయాయ న్నారు. పది లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాడిన ఫలితంగా బ్యాంకుల ప్రయివేటీకరణ ఆగిపోయిందని, ఇదే స్ఫూర్తి ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి, ఏఐబీఈఏ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు స్వాగతోపన్యాసం చేశారు. ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్ర నాథ్ మహాసభకు అధ్యక్షత వహించగా, ఏఐబీఈఏ జాతీయ సంయుక్త కార్యదర్శి వంక ఉదయ్ కుమార్ ఏపీటీబీఈఎఫ్ సంయుక్త కార్యదర్శి పివి.కృష్ణారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సాగులో నష్టాలు.. అప్పుల భారం భరించలేక ఓ రైతు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమానూర్ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రైతు మైల నర్సయ్య(59) తనకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేసేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇప్పటికే పంటలు సరిగా పండక.. పెట్టుబడులు కూడా ఎల్లక అప్పులుండగా.. కుమార్తె వివాహానికి మరికొంత అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై పొలంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు

- బాలికల దినోత్సవం రోజే ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

నవతెలంగాణ-బల్మూరు

కోపంలో సహనం కోల్పోయిన ఉపాధ్యాయుడు విద్యార్థినిని చెప్పుతో కొట్టాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీరియస్ అయ్యారు. సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తరగతి గదిలో శుక్రవారం రిపబ్లిక్ డేకు సంబంధించి రిహార్సల్స్ జరుగుతుండగా.. క్లాస్ తీసుకుంటానని ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ సమయంలో విద్యార్థులు నవ్వారన్న కోపంతో "నన్ను చూసి నవ్వుతారా" అంటూ ఉపాధ్యాయుడు విద్యార్థిని పైకి చెప్పు విసిరాడు. 9వ తరగతి చదువుతున్న బాధిత విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో శనివారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయున్ని నిలదీశారు. దాంతో వారికి సదరు ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పారు. బాలికల దినోత్సవం రోజే బాలికలపై దాడి చేసిన ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి సస్పెన్షన్

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి సీరియస్ అయ్యారు. ఉపాధ్యాయుడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్‌కు ఫోన్ ద్వారా మౌఖిక ఆదేశాలు జారీ చెయ్యగా, బల్మూరు మండల విద్యాధికారి నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

'దుందుభి'లో ఇసుక తరలింపుపై రైతుల నిరసన

- అక్కడే నడిగడ్డ రైతుల వంటావార్పు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ప్రభుత్వం నీళ్ల ఇవ్వక పోయినా.. తామే స్వయంగా దుందుభి నది వాగులో ఫిల్టర్ పాయింట్ల ద్వారా బోరుబావులను తవ్వి సాగునీటిని పంట పొలాలకు మళ్లించుకున్నాం.. ఉమ్మడి జిల్లా కరువుతో విలయతాండవం చేస్తున్నా మాకు ఇక్కడ సాగునీరు లభించింది. తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. ఇప్పుడు అధికారులు ఇబ్బడిముబ్బడిగా ఇసుక తరలింపుకు అనుమతులు ఇస్తుండటంతో సాగు నీటి కష్టాలు వచ్చేలా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి" అంటూ నడిగడ్డ రైతులు నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నడిగడ్డ శివారులోని రామగిరి మూలమలుపు వంటావార్పు చేశారు.

ఈ సందర్భంగా బర్ల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇసుక తరలింపుకు విధానపరమైన నిర్ణయంపై అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదన్నారు. నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఇసుకను తరలించాల్సి ఉన్నా రాత్రింబవళ్లు ఇసుకను తోడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాన్ ఉంటేనే ఇసుక తరలించాల్సి ఉండగా.. ఇసుక వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపుల నుంచి ఇసుక తరలింపుకు టిప్పర్లు వాడుతున్నారని చెప్పారు. దీని వెనుక పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. తమ పంట పొలాలకు సాగునీటి కోసం ఇసుక తరలింపును అడ్డుకుంటా మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బీరం జగత్ రెడ్డి, బర్ల కాశిరెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, యాకోబ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సోదరికి కేసీఆర్ నివాళి

- మేడ్చల్ జిల్లా పూడూరులో అంత్యక్రియలు
- హాజరైన కేటీఆర్, హరీశ్‌రావు, కవిత



నవతెలంగాణ- మేడ్చల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ(82) శుక్రవారం రాత్రి కన్నుమూసిన సంగతి తెలిసిందే. శనివారం మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామంలోని ఆమె కుమారుడి నివాసంలో మృతదేహానికి సీఎం కేసీఆర్ నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. అనంతరం పూడూరు శ్మశానవాటికలో సకలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దేవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్ యాదవ్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భాస్కర్ యాదవ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సకలమ్మ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు ఆమె 5వ సోదరి. సకలమ్మ స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. ఆమె భర్త హన్మంతరావు కొన్నేండ్ల కిందటే మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు సంతానం.

అంబేద్కర్ వల్లే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-జనగామ

భారతదేశంలో ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో వందే మాతరం స్టూడెంట్ ఫెడరేషన్, జిల్లా ఉద్యమకారుల ఆధ్వర్యంలో మంగళంపల్లి రాజు అధ్యక్షతన జనగామ చౌరస్తాలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బక్కి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ కుల, మతాలకతీతం గా ఓటు వేయడానికి అంబేద్కరే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు విజయ్, పానుగంటి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సువార్త, వీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్ల రాహుల్, నాయకులు వేంపటి అజయ్, సల్ల మహేష్, యాదగిరి, నరేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ. కోటి ఆస్తి నష్టం
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఎలక్ట్రికల్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించి, సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడ ప్రాంతంలోని హైదర్‌గూడలో గతేడాది ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభమైంది. శనివారం ఉదయం షోరూం యజమానులు పూజ చేసి బయటకు రాగానే లోపల ఒక్కసారిగా పొగలు, మంటలు వచ్చాయి. క్షణాల్లో అక్కడ ఉన్న ఎలక్ట్రికల్ బైకులు పేలయాయి. అందులో పని చేస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు గంటపాటు కష్టపడి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చింది. ఎలక్ట్రికల్ బైకులు ఒకదాని తర్వాత ఒకటి పేలడంతో ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. 45 ఎలక్ట్రికల్ బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు కోటి రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని యజమానులు చెప్పారు. ఈ ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమా, లేదా ఎలక్ట్రికల్ బ్యాటరీ సమస్యనా.. అని పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి, కమీషన్ల చాటున 'గంగుల' రాజకీయం

- కరీంనగర్ ఎమ్మెల్యేపై మేయర్ సునీల్‌రావు సంచలన వ్యాఖ్యలు
- కేంద్ర మంత్రి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిక
- మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునీల్‌రావుది.. : ఎమ్మెల్యే గంగుల



నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'నా జోలికొస్తే గంగుల కమలాకర్ అవినీతి, అక్రమాల బండారం బయటపెడతా. కరీంనగర్‌లో చోటుచేసుకున్న ప్రతి స్కాం వెనుక ఎమ్మెల్యేనే ఉన్నారు. ఏ టెండర్ వచ్చినా అందులో ఎంత కమీషన్ వస్తుందన్నదే ఆలోచనే. బినామీలతో అన్ని రకాల కాంట్రాక్టు పనులు చేయిస్తూ దోచుకున్నారు' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మేయర్ వై.సునీల్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచే మేయర్‌గా పని చేసిన ఆయన శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఏ షరతూ లేకుండానే బీజేపీలో చేరుతున్నానని, సామాన్య కార్యకర్తగానే పని చేస్తానని అన్నారు. ఇదే సమయంలో ఇన్నాళ్లూ తాను ఉన్న బీఆర్ఎస్ పార్టీలోని స్థానిక ఎమ్మెల్యే టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మేయర్ పదవి రావడానికి ప్రధాన కారణం వినోద్ కుమార్ అని, అడ్డుకున్నది మాత్రం గంగుల కమలాకరేనని ఆరోపించారు. అవమానాలు దిగమింగుకుని బీఆర్ఎస్‌లో ఐదేండ్లు పని చేశానన్నారు. స్మార్ట్ సిటీ నిధులు బండి సంజయ్ తెచ్చారని వాస్తవాలు చెబితే గంగులకు ఎందుకు కోపం అంటూ ప్రశ్నించారు. గంగులకు, బండి సంజయ్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందంటూ వ్యాఖ్యానించారు. ఏనాడూ తనకు ఫలానా పని కావాలని కూడా అడగని క్లీన్ హిస్టరీ ఉన్న సంజయ్ వెంట నడిచేందుకే సిద్ధమై బీజేపీలో చేరానంటూ చెప్పుకొచ్చారు.

మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ఐదేండ్లు మంచివాడిగా నటిస్తూ వచ్చిన మేయర్ సునీల్‌రావు తన పదవీకాలంలో రూ.కోట్లు కూడబెట్టుకున్నారని, ఆయనే అతిపెద్ద అవినీతి తిమింగలం అని బీఆర్ఎస్ కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షులు హరిశంకర్ సహా పలువురు కార్పొరేటర్లు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సునీల్‌రావు బీజేపీలోకి వెళ్తున్నాడని ఐదు నెలల కిందటే చెప్పామని, ఆయన ద్రోహం, రాజకీయ వ్యభిచారం, వెన్నుపోటు, అవినీతి రాజకీయాల అస్త్రాలతోనే పని చేశారని విమర్శించారు. అధికార పార్టీలో ఉండాలన్న తపనతోనే బీజేపీలో చేరాడన్నారు. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు చేసిన వెన్నుపోటు రాజకీయాలతోనే ఆ పార్టీ వాళ్లు దగ్గరికి రానియ్య లేదని, అందుకే ప్రత్యామ్నాయంగా ఎంపీ సంజయ్ పంచన చేరి బీజేపీలోకి వెళ్లాడని అన్నారు. సునీల్‌రావును మేయర్‌గా బోయినపల్లి వినోద్ కుమార్ చేస్తే.. ఐదేండ్లు ఎమ్మెల్యే గంగులనే సహాయ సహకారాలు అందించిన విషయం మరిచావా? అంటూ ప్రశ్నించారు.

ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునీల్‌రావుది.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్

'రెండున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్న సునీల్‌రావు ఆ పార్టీ అధికారం కోల్పోగానే.. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌లోకి దొడ్డిదారిన వచ్చాడు. అప్పుడే ఆయన గురించి పార్టీ పెద్దలకు చెప్పాను. ఆయన మేయర్‌గా చేసిన కాలంలో చాలా ఫిర్యాదులు వచ్చాయి. అప్పుడు మేము పెద్దగా దృష్టి సారించలేదు. ఇప్పుడు వాటన్నింటిపై విచారణ చేసేందుకు దృష్టిసారిస్తాం' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మేయర్ వ్యాఖ్యలపై స్పందించారు. గౌరవంగా పార్టీని వీడి వెళ్లిపోవాలిగానీ, అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తే మైలేజ్ రాదని హితవు పలికారు. తన సహకారం లేదని, అవినీతి చేశాడని చెబుతున్న ఆయన.. తమ పార్టీలో ఉన్నన్ని రోజులూ తన పేరే జపించిన విషయం తెలియదా? అంటూ ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి వాళ్లు వెళ్లిపోవడం వల్ల బీఆర్ఎస్‌కు పట్టిన కొన్ని శనీశ్వరులను వదిలించుకున్నట్టే అవుతుందని అన్నారు.

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు

మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన

- వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర తగ్గిస్తున్నారని ఆవేదన
- వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద ఘటన



నవతెలంగాణ-పరిగి

పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వేరుశనగ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు, ఇతర జిల్లాల నుంచి రైతులు శుక్రవారం ఉదయం పరిగి మార్కెట్‌కు వేరుశనగ పంటను తీసుకొచ్చారు. శుక్రవారం ఈనాం వెబ్‌సైట్ మొరాయించడంతో అధికారులు ట్రేడింగ్ నిర్వహించలేదు. శనివారం మధ్యాహ్నం ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించగా రూ.4,400 నుంచి రూ.5,800 ధర పలికింది. దాంతో మద్దతు ధర రావడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డులోని దుకాణ సముదాయాలన్నీ మూయించి ఆందోళన వ్యక్తం చేశారు. ధర తగ్గడంపై అధికారులను నిలదీయగా సరైన సమాధానం చెప్పక పోవడంతో రైతులు రోడ్డెక్కారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైటాయించి నిరసన తెలిపారు. వేరుశనగ క్వింటాలుకు రూ.6,783 ధర ఉంటే ఇక్కడ రూ.4 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిగి మార్కెట్ యార్డులో ట్రేడర్లంతా సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపించారు. అధికారులు వచ్చి హామీ ఇస్తేనే తప్ప అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చు న్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పి మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. మద్దతు ధరపై మార్కెట్ కార్యదర్శిని నిలదీశారు. గందరగోళం ఏర్పడటంతో రైతులు మరోసారి రోడ్డు పై బైటాయించారు. దాంతో మార్కెట్ కార్యదర్శి ఇంతకుముందు జరిగిన ట్రేడింగ్‌ని క్యాన్సల్ చేసి, మరోసారి ట్రేడింగ్ నిర్వహిస్తామని చెప్పారు. లేదా ఉన్నతాధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చూస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

- చనాక-కోరాట బ్యారేజీ పనులను ప్రారంభించాలి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని హామినిచ్చిందని, కానీ ఇప్పుడు ఊసెత్తడం లేదని మాజీ మంత్రి, రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చిన కమిటీ సభ్యులతో కలిసి ఆయన శనివారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చనాక-కోరాట బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేసిందని, మెయిన్ కెనాల్ కూడా పూర్తయిందని, మిగతా పనులను కాంగ్రెస్ సర్కారు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై తాపత్రయం లేదని విమర్శించారు. ప్రభుత్వ పట్టింపు లేనితనం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతోందన్నారు. చనకా- కోర్ట ప్రాజెక్టు పూర్తిపై బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు జోగు రామన్న, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థపరులు వర్గీకరణను అడ్డుకుంటున్నారు

- శాంతియుతంగా రిజర్వేషన్ సాధించుకుందాం
- లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలతో మన ఆవేదనను చాటుదాం :ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-సిద్దిపేట

సమాజంలో అన్ని వర్గాలు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, కోర్టులో ఎస్సీ వర్గీకరణ అవసరమని చెబుతుంటే, మాలలు మాత్రం స్వార్థంతో వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల సాంస్కృతిక ప్రదర్శన లక్షల డప్పులు.. వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వద్దని లగడపాటి అంటే.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ వద్దని వెంకటస్వామి కుటుంబం కోరుతోందని ఆరోపించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు వర్గీకరణకు అనుకూలంగా ఉంటే, మన జాతి మద్దతు ఇచ్చిందని, తరువాత వర్గీకరణ జరిగిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు అని చెప్పి వర్గీకరణను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, నరేంద్ర మోడీ వర్గీకరణకు మద్దతు ఇవ్వడంతో ఆయన వద్దకు మనం పోవాల్సి వచ్చిందని, వారికి మద్దతు ఇచ్చామన్నారు.

కానీ నాటి నుంచి కాంగ్రెస్ పార్టీలో మాలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారు వర్గీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. మల్లు, వెంకటస్వామి కుటుంబాలు అడ్డు పడుతున్నాయన్నారు. లక్ష డప్పుల ద్వారా మన ఆవేదనను ప్రపంచానికి తెలియజేస్తామంటే, వారు లక్ష బరిసెలు, కర్రలు అంటున్నారని, మనం శాంతియుతంగా అంటే, వారు తొడలు కొడుతున్నారని విమర్శించారు. శాంతియుతంగా వర్గీకరణను సాధించుకుందామన్నారు. తన ఎదుగుదలలో మాదిగల పాత్ర ఎంతో ఉందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు కొంతమందికి భయపడి వర్గీకరణను ఆలస్యం చేస్తున్నారని, అందుకే తాను మరోసారి రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని అన్నారు. తనకు అనేక పార్టీలు పదవులు ఇస్తామని ప్రకటించినా, భవిష్యత్ తరాలకు మూలమైన వర్గీకరణ కోసమే తాను ఈ నల్ల కండువాను విడిచిపెట్టలేదని చెప్పారు. ఫిబ్రవరి 7న ప్రతి ఇంటి నుంచి ఒక డప్పు రావాలని, మన ఆవేదనను ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, నాయకులు పరశురాములు, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, రమేష్, భాస్కర్, ప్రకాష్, యాదగిరి, రాములు, రాజు, పవన్ కళ్యాణ్, ప్రసాద్, కనకరాజు పాల్గొన్నారు.

ఏడాదిలోనే సమస్యలెందుకు!?

బ్యారేజీపై కాంట్రాక్టర్లకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్న

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాజెక్టుల పనులు ప్రారంభించే ముందు అన్ని అంశాలను పూర్తిస్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణసంస్థలపై లేదా అని కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని ఎందుకు సంప్రదించలేదని అడిగారు. ముందేజాగ్రత్తలు తీసుకుని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లిఖార్జునరావు, శేఖర్‌దాస్ కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలుచేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర అంశాలపై వారిని కమిషన్ చైర్మెన్ ప్రశ్నించారు.

బ్యారేజీ ప్రతిపాదిత లోకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గంకూడా లేకపోవడంతో ఏడాదిపాటు ప్రయివేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్టు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసే క్రమంలో అన్ని అంశాలను పూర్తిస్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించిందని చెప్పారు. వందేండ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ అడిగింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునే వాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదల శాఖతో సంప్రదింపులు చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్టు పేర్కొన్నారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సెల్టెన్సీతో అధ్యయనం చేయించామనీ, ఆ సిఫారసులపై నీటి పారుదలశాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదనీ, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్టు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్‌కు తెలియజేశారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి పరామర్శ



నవతెలంగాణ-చంపాపేట్

శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతిలో ఉన్న ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్తలు బిసుకుంట్ల సతీష్ గౌడ్, మధుసాగర్, యాదిరెడ్డి తదితరులు కలిశారు. తర్వాత పండ్లు అందజేసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్‌లోని పీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన టాప్ దర్జీ సెషన్స్ లార్జెస్ట్ ఫ్యాషన్ లైఫ్ మరియు లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుండి రెండు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. ఇలాంటి ఎగ్జిషన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రాములు, ఉప్పల సాయి తేజ, ఆకన్శా రెడ్డి, స్నేహ రెడ్డి, రమ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు త్వరగా పూర్తి చేయండి



ఎమ్మెల్యే బలాల

నవతెలంగాణ - మలక్‌పేట్

ఓల్డ్ మలక్‌పేట్ పద్మానగర్‌లోని రైల్వే వంతెన కింద చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బలాల అన్నారు. శనివారం ఆ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రహదారి పనులను హెచ్ఆర్‌డీసీఎల్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేటాయించిన నిధులు చాలకపోవడంతో అదనంగా మంజూరు చేయించామని తెలిపారు. రహదారి పనులు పూర్తి అయితే కాలనీవాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని చెప్పారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ మలక్‌పేట్ కో కార్పొరేటర్ షఫీ, జీహెచ్ఎంసీ అధికారులు, హెచ్ఆర్డీసీఎల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంజాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజపూర్ పరిధిలోని ఆపిల్ ఎవెన్యూ కాలనీలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇంటర్నల్ రోడ్స్ బీటీ రోడ్లుగా ఏర్పాటు చేయడానికి, అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడానికి సంబంధించిన పనులను ప్రారంభించినట్టు తెలిపారు. కాలనీకి అవసరమైన అన్ని సమస్యలను త్వరలో తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, కాలనీ అధ్యక్షులు నాయిని చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షులు పున్న రమణ విశ్వమ్, ఉపాధ్యక్షులు ఎం. వీరప్ప నాయక్, టి. నర్సింగ్ రావు, కోశాధికారి దాసరి ఆంజనేయులు, తూముకుంట సుధాకర్ రెడ్డి, తోటపల్లి ప్రభాకర్ రెడ్డి, వి, సంతోష్ గౌడ్, వెంకన్న, బుచ్చా రెడ్డి, శంకరాచారి, మహేందర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా, రంగా కృష్ణ గౌడ్, దేప శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరం.. జీవితానికి దారి..లక్ష్యసాధనకు బీజం



కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ-నాగోల్

అక్షరం జీవితానికి దారి చూపుతూ లక్ష సాధనకు బీజం వేస్తుందని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని బ్లైండ్స్ కాలనీ (జైపురీ కాలనీ)లో అంధుల లిపి అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులేని జీవితాన్ని సారం లేని నేలతో పోల్చుకోవచ్చని అన్నారు. లూయిస్ బ్రెయిలీ స్పర్శతోనే అక్షరాలను ఔపోసన పట్టి రాతకే కొత్త రాతను లిఖించారని కొనియాడారు. అనంతరం డిసబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కేకేఎస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ డిసేబుల్ చైర్మెన్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

'వీరికే రైతు భరోసా'

- హయత్‌నగర్‌లో 350 ఎకరాలకు అప్పట్లో రైతు బంధు
- ఇప్పుడు వ్యవసాయ యోగ్యమైన 19 ఎకరాలకే రైతు భరోసా
- ప్రభుత్వానికి ఏడాదికి లక్ష 20వేలు ఆదా...



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం భూమి ఉన్న ప్రతి రైతుకు సాగు చేసిన, చేయక పోయిన ప్రతి ఏటా ఎకరాకు 10వేల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రైతు భరోసా కింద నెలకు 12వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఏడాది గడిచింది. కానీ దానిని పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడంతో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత ఎదురవుతోందని గమనించి.. 2025 జనవరి26 నుంచి సాగు చేసే ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని చెప్పింది. రెండు విడతలుగా (ఖరీఫ్,రబీ) ఏడాదికి 12వేల రూపాయల చొప్పున ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జనవరి 26న యాసంగికి సంబంధించి ఎకరాకు 6వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలో జమ చేయనుంది. ఇటీవల హయత్‌నగర్ మండలంలో రెండు రోజులు నిర్వహించిన గ్రామ సభలో వ్యవసాయ యోగ్యమైన భూమికి సంబంధించిన లిస్టును రైతులకు చూపించి, తద్వారా మిగిలిన వారికి రైతు భరోసా ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

రైతు భరోసా- మార్గ దర్శకాలు

రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం సంవత్సరానికి ఎకరానికి 12వేల రూపాయలు ఇస్తారు. (ఖరీఫ్ 6వేలు, రబీ 6వేలు). భూ భారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టదారులకు సాయం అందిస్తారు. వ్యవసాయ యోగ్యం కానీ భూములు రైతు భరోసా నుండి తొలగిస్తారు. ఆర్ఓ ఎఫ్ ఆర్ (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాదారులు కూడా రైతు భరోసాకు అర్హులు. ఆర్‌బీఐ నిర్వహించే డీబీటీ (నేరుగా లబ్ది దారులకు నగదు బదిలీ) పద్ధతిలో రైతు భరోసా సాయం రైతు ఖాతాలో జమ.

ఆ భూములకు రైతు భరోసా కట్

సాగులో ఉన్న భూమికే రైతు భరోసా ఇవ్వాలని చూస్తున్న ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. రాళ్లు, రప్పలు ఉన్న భూములు, మైనింగ్ కోసం ఇచ్చిన భూములు, రహదారి నిర్మాణంలో భాగంగా పోయిన పొలాలు, రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసాకు ఇవ్వకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ఈ భూముల విషయమై రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల వారీగా సమాచారం సేకరించి గ్రామ సభలో జాబితాను వెల్లడించారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన





సీనియర్ సిటిజన్ల బిల్డింగ్స్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ-ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో సీనియర్ సిటిజన్స్ బిల్డింగ్స్‌కు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డిలు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆర్కేపురం డివిజన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని పేర్కొన్నారు. ఆర్కేపురం నుండి ఆర్టీసీ సిటీ బస్సులను నడుపుతాం అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదు అని మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కృషితో ప్రభుత్వం ఎస్‌డిఎఫ్ నిధులు రూ.10 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, సురేష్, రమేష్ నేత, భూపాల్ రెడ్డి, పందుల వెంకటేష్ గౌడ్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, పెద్దపూర సైదులు శేఖర్ ముదిరాజ్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్ యాదవ్, లింగ స్వామి గౌడ్, షఫీ, మహేందర్, రాజు నాయక్, ఇమ్రాన్, ఎల్లన్న, శ్రీకాంత్, ప్రేమ్ నాయక్, నభీ, శ్రీధర్, చందు, సూరి, మహ్మద్, పటేల్, నాగేష్, సంతోష్, భాస్కర్ నాయక్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నాం

నవతెలంగాణ - మీర్ పేట్



అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలో రూ.3కోట్ల 63లక్షలతో చేపట్టిన పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వాలు పేద ప్రజలను పట్టించుకోలేదని, పట్టణాలలో కనీసం మౌలిక సదుపాయాలు, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. గత పది సంవత్సరాలలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని వారికి ఇండ్లు, ఇండ్ల స్థలాలను త్వరలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ చైర్మెన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, బాలాపూర్ మండల తహసీల్దార్, కందుకూర్ ఆర్డీవో, కమిషనర్ జ్ఞానేశ్వర్, డిఈ, ఏఈ, కాంగ్రెస్ నాయకులు దేపా భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్ పేట్ కార్పొరేషన్, జల్ పల్లి మున్సిపాలిటీలలో రూ.75 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మహేశ్వరం ఇంచార్జి కేఎల్ఆర్, మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, బడంగ్ పేట్ కమిషనర్ సరస్వతీలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంఖు స్థాపన చేశారు. అదే విధంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మెన్ అబ్దుల్లా బిన్ హమీద్ సాధి, కమిషనర్ వెంకట్రామ్‌లతో కలిసి రూ.65 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంఖు స్థాపన చేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





'బాలికలు హక్కుల కోసం పాటుపడాలి'



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

బాలికలు తమ హక్కుల కోసం పాటు పడాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్లు సావిత్రమ్మ, నారాయణమ్మలు విజ్ఞప్తి చేశారు. రాజీవ్ గాంధీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్లు మాట్లాడుతూ బాలికలు హక్కులు, సమానత్వం, విద్యా ప్రాముఖ్యతలపై వివరించారు. బాలికలు భద్రత విషయంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి ఐసిడిఎస్ కృషి చేస్తుందన్నారు. కో ఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ నేటికీ బాల్య వివాహాలు జరగడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలను అన్ని వర్గాల వారు అడ్డుకోవాలని కోరారు. బాల్య వివాహాల కారణంగా భవిష్యత్తులో ఎన్నో సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలను నిరోధించడానికి ఐసిడిఎస్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని వివరించారు. సైబర్ భద్రతా గురించి శ్రీకాంత్ మాట్లాడుతూ సోషల్ మీడియా కారణంగా ఎదుర్కొంటున్న సవాళ్ళను నివారణ సూచనలు చేశారు. బాల రక్ష భారత్ నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మర్రి ముత్యం, పెంటమ్మల జ్ఞాపకార్థం అన్నదానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో మానవతా హృదయంతో అన్నదానం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని నాదర్‌గుల్ భాగ్యనగర్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామానికి చెందిన కీ.శే.మర్రి ముత్యం రెడ్డి, కీ.శే.మర్రి పెంటమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు భాగ్యనగర్ సహకార బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి, వారి కుటుంబ సభ్యులు మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలోని 150 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరి చేస్తున్న సేవలను గుర్తు చేశారు. కన్న తల్లిదండ్రులకే బుక్కెడు బువ్వ పెట్టని ఈ రోజుల్లో ఎవరో కూడా తెలియని అనాథలను చేరదీసి ఆశ్రమం కల్పించడం అనేది గొప్ప మనసున్న వారికి మాత్రమే సాధ్యమని కొనియాడారు. గట్టు గిరిని ప్రేరణగా తీసుకుని తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 150 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి నరసింహారెడ్డి, వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- ముగిసిన మీర్ పేట్ కార్పొరేషన్ చివరి సమావేశం
- రూ.9కోట్ల 70లక్షల పనులకు తీర్మానం



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులకు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శనివారం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం చివరి సమావేశం కొత్తగా నిర్మాణం చేసిన మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రజలు ఎప్పటికి మర్చిపోరని కొనియాడారు.

కార్పొరేషన్ అభివృద్ధి కోసం చివరి కౌన్సిల్ సమావేశంలో రూ.9కోట్ల 70లక్షల పనులకు తీర్మానం చేసి ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్లందరిని శాలువాలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ జ్ఞానేశ్వర్, మేనేజర్, ఆర్వో, డిఈ, ఏఈ, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా



డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాపూర్ గ్రామానికి సంబంధించిన మాలల స్మశాన వాటికలో బోరు వేయించి, సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుక రావటానికి తన వంతు కృషి చేయడం జరిగిందన్నారు. ఎస్‌సిఆర్‌పిఎస్ సంఘం అధ్యక్షులు గుండె నాగార్జున బాబు మాట్లాడుతూ.. స్మశాన వాటికలోని మౌలిక సదుపాయాల సమస్యలపై స్పందించి ప్రత్యేక చొరవ తీసుకొని సహకరించిన మాజీ వైస్ చైర్మన్ చిగురింత నరసింహారెడ్డికి, ప్రభాకర్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్మశాన వాటికలోని మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించిన బడంగ్ పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌కి కార్పొరేటర్లు వంగటి ప్రభాకర్ రెడ్డికి, ఎర్ర మహేశ్వరి జైహింద్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు సంఘం అధ్యక్షులు గుండె నాగార్జున బాబు, ప్రధాన కార్యదర్శి గుండె రాఘవేంద్రబాబు, ఉపాధ్యక్షులు కొప్పుల వినయ్ కుమార్, దార్ల రామచందర్, దయానంద్, నాలిక సూర్య ప్రకాష్, హనుమాన్ల శంకరయ్య, గుండె గణేష్ బాబు, దార్ల ఆనంద్, పవన్ కుమార్, కొప్పుల శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, ఎం.సి.శేఖర్, మర్రి చంద్రశేఖర్, మర్రి సాయి కాంత్, మర్రి సాయికుమార్, నాలిక శివకుమార్, మర్రి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

జాతీయ చింతన్ శిబిర్ కార్యక్రమంలో జిట్టా



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఢీల్లీలో జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో.. జరుగుతున్న రెండు రోజుల జాతీయ చింతన్ శిబిర్ కార్యక్రమంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త జిట్టా సునీల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను, జవహర్ బాల్ మంచ్ జాతీయ చైర్మెన్ డాక్టర్ జీవీ హరి, జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రిషికేష్ రెడ్డి పాల్గొన్నారు.

మల్లు రవిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హైదరాబాద్ నగరంలో నాగర్ కర్నూల్ లోక్ సభ సభ్యులు మల్లు రవి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌తో పాటు యూనియన్ సభ్యులు మల్లు రవిని శనివారం కలిశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి, కేశవ్, శ్రీహరి, లక్ష్మణ్ జి.కుమార్, రాంబాబు గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు కలిగి ఉండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్ఓ హరిప్రియతో కలిసి ఉద్యోగులందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇప్పుడు ఏడాదికి నాలుగు సార్లు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఓటరుగా నమోదుకు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి బీఎల్‌ఓలను సంప్రదించి ఓటరు నమోదుకు ఫామ్-6తో పాటు, ఫామ్-6బీ ద్వారా ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటే నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రాన్ని చక్కగా అభివద్ధి పర్చుకోగలమని తెలిపారు. అనంతరం ఓటు హక్కుపై నిర్వహించిన రంగోళీ పోటీల్లో పాల్గొన్న విజేతలకు, స్వీప్ కార్యక్రమాలను బాగా ప్రచారం చేసిన టీఎస్ఎస్ కళాకరులకు జిల్లా అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లు, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా భూసేకరణ అధికారి శంకర్ కుమార్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు పథకంలో అవినీతికి తావులేదు

- కాంగ్రెస్ కూకట్‌పల్లి యువ నాయకుడు గాదె శివ చౌదరి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు పథకంలో అవినీతికి తావులేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని అప్రతిష్టపాలు చేయదలచిన కొంత మంది వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చిరన్నారు. అలాంటి ఆకతాయిల దృష్టిలో పడి మీరు మోసపోవద్దన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో పేదలు, లబ్ధిదారులకు ఎవరికి ఇండ్లు మంజూరు చేయలేదని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆశావాహుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడతాయన్నారు. ప్రస్తుతం సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు ఐదు లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. లబ్ధిదారులు వారికి నచ్చిన విధంగా వారి సొంత స్థలంలో ఇండ్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని మిమ్ములను డబ్బులు అడిగి మోసం చేయదలచిన వ్యక్తుల పై కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పిర్యాదు చేయవచ్చని అన్నారు. ప్రజలను మోసం చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోబడతాయన్నారు. అర్హులందరికీ తప్పనిసరి గా ఇండ్లు చేయబడతాయని, అందరికీ ఒకేసారి ఇవ్వలేము కాబట్టి విడతల వారీగా మంజూరు చేయబడతాయన్నారు.

ఉచిత లివర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు మంచి స్పందన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ కాలనీ వసంత నగర్ సొసైటీ నందు రెనోవా హాస్పిటల్ వారి సౌజన్యంతో మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో.. శనివారం నిర్వహించిన ఉచిత లివర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ఈ టెస్టుల గురించి వాటి యొక్క ప్రత్యేకతలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లు ఈ టెస్టులు గురించి వివరాలు తెలియజేస్తూ లివర్ ఏ విధంగా ఉంటుంది. ఆ అవయవానికి సంబంధించి డాక్టర్లు క్లుప్తంగా చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఇలాంటి టెస్టులు ప్రస్తుతానికి ఎక్కడ అందుబాటులో లేదని, ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు మందలపు సాయిబాబా చౌదరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి పైగా హాజరయ్యి లివర్‌కు సంబంధించిన టెస్టులు చేపించుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న గోరే, కాలనీ వాసులు శ్యామలరాజు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, రత్నాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మనోభావాలకనుగుణంగా
తల్లిదండ్రులు ప్రోత్సహించాలి..





- జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేతూరి నర్సింహా

నవతెలంగాణజగద్గిరిగుట్ట

విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అప్పుడే వారు అనుకున్న గమ్యం చేరుకుంటారని జగద్గిరిగుట్ట సీఐ .కెతూరి నర్సింహా అన్నారు. శుక్రవారం రాత్రి జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్ భగత్ సింగ్ మార్గ్‌లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. ఈ వేడుకలకు ఆయన,ఎస్ఐ.శంకర్, తెలం గాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు కె.రామేశ్వర్ రెడ్డి,పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతుల్ని మంత్ర ముగ్ధులను చేశాయి. అనంతరం సీఐ. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలధిరోహించడం ఖాయమన్నారు. విద్యార్థులు పట్టుదల కనబరిస్తే ఉన్నత శిఖరాలదిరోహిస్తారని ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు కె.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ప్రతిభావంతులవుతారన్నారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల తల్లులకు బహు మతులను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బిర్రు శోభారాణి ట్రస్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనే హనుమంత్ రెడ్డి,ట్రపస చైర్మన్ కె.వెంకటేష్,అధ్యక్షులు డాక్టర్ వినోద్ జాదవ్,ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ రశీద్,వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ కె.శ్రీనివాస్ రెడ్డి, మధు,నర్సింహులు, సిహెచ్.నర్సింహులు గౌడ్, అంజనేయులు, ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా, ప్రశాంతి, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి 19వ డివిజన్ అధ్యక్షులుగా ఆగం శంకర్ ముదిరాజ్‌ని నియమించారు. ఈ సందర్భంగా శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని ఆగం శంకర్ ముదిరాజ్ కలిశారు.. అనంతరం హన్మంతన్న శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 18 డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ సీత రామ్ రెడ్డి, కొలన్ జనార్దన్ రెడ్డి, కొలన్ శంకర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కె.పెద్ద జీత్తయ్య, కె. జీతందర్ రెడ్డి, కె.నారాయణ, కె. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

నేటి నుంచి 4 పథకాలు

- మండలానికో గ్రామం ఎంపిక
- సంక్షేమ పథకాలకు సర్వం సిద్ధం
- వడబోత తర్వాతే కొత్త రేషన్ కార్డులు







నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 4 పథకాల అమలుకు రంగం సిద్ధమైంది. నేడు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పథకాలను అమలు చేసేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. మొదటి రోజు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి లబ్దిదారులకు ఈ 4 పథకాలను అమలు చేయనున్నారు. కాగా ఇందుకు లబ్దిదారులను సర్వేలు, ఇటీవల నిర్వహించిన గ్రామ సభల ద్వారా ఎంపిక చేశారు.

21 నుంచి 24 వరకు గ్రామ సభలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పథకాలకు అర్హుల కోసం ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో దరఖాస్తుదారుల జాబితాను ప్రదర్శించారు. ఈ గ్రామ సభల్లో రేషన్ కార్డుల కోసం 33,435, ఇందిరమ్మ ఇండ్ల కోసం 27,086, రైతు భరోసా కోసం 378, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 1,245 దరఖాస్తులు వచ్చాయి. నేడు మొదటి రోజు జిల్లాలోని రూరల్‌లో ఉన్న ఐదు మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి లబ్దిదారులకు ఈ 4 పథకాలను అందించనున్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు భారీగా దరఖాస్తులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో 1,43,267 అప్లికేషన్లు రాగా, వీరి వివరాలను సర్వేయర్లు ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. కాగా తాజాగా నిర్వహించిన గ్రామ సభల్లో 27,086 దరఖాస్తులు కొత్తగా అందాయి. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఐదు నియోజకవర్గాలకు గాను మొత్తం తొలి విడుతలో జిల్లాకు 17,500 ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇంటి నిర్మాణం కోసం సొంత స్థలం ఉన్న పేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ఆహార భద్రతా కార్డులు..

జిల్లా ప్రజలు ఏండ్లుగా ఎదరు చూస్తున్న కొత్త రేషన్ కార్డులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆహార భద్రతా కార్డుల కోసం ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేలో 34,719 దరఖాస్తులు రాగా, వీటిని తాజాగా నిర్వహించిన గ్రామ సభల్లో ప్రదర్శించారు. అయితే ఈ గ్రామ సభల్లో మరో 33,435 దరఖాస్తులు అందాయి. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం 68,154 దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1,21,696 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రూరల్ ఏరియాలో 31,316, బాలానగర్, ఉప్పల్ సర్కిళ్లలో 90,560 దరఖాస్తులు వచ్చాయి. ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారి కోసం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

వ్యవసాయ భూముల గుర్తింపు

రైతు భరోసా పథకం కోసం వ్యవసాయానికి యోగ్యత గల భూముల జాబితాను సిద్ధమైంది. ఇటీవల నిర్వహించిన సర్వేలో 64,800 ఎకరాలు వ్యవసాయానికి యోగ్యంగా, 14,430 ఎకరాలు వ్యవసాయానికి యోగ్యత లేని భూములుగా అధికారులు గుర్తించారు. ఈ జాబితాను తాజాగా నిర్వహించిన గ్రామ సభల్లో ప్రదర్శించారు. కాగా కొత్తగా మరో 378 మంది రైతులు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో జిల్లాలో 79,290 ఎకరాలకు రైతు బంధు ఇవ్వగా, ఈ సారి తగ్గే అవకాశం కనిపిస్తోంది. వ్యవసాయానికి యోగ్యత లేని భూములకు రైతు భరోసాను కట్ చేయనున్నట్టు సమాచారం.

ఇందిరమ్మ ఆత్మీ భరోసాకు ఇలా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం జిల్లాలో 1,074 మంది లబ్దిదారులను గుర్తించారు. తాజాగా నిర్వహించిన గ్రామ సభల్లో మరో 1,245 దరఖాస్తులు వచ్చాయి. కీసర మండలంలో 182 మంది, శామిర్‌పేట మండలంలో 237 మంది, ఘట్‌కేసర్ మండలంలో 463 మంది, మూడు చింతలపల్లి మండలంలో 115 మంది రైతు కూలీలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా గుర్తించి తాజాగా నిర్వహించిన గ్రామ సభల్లో జాబితాను ప్రదర్శించారు. కాగా జిల్లాలోని ఐదు రూరల్ మండలాల్లో 2023-24 వార్షిక సంవత్సరంలో నెలలో 20 రోజుల పాటు ఉపాధి హామీ చట్టంలో పని చేసిన రైతు కూలీలు ఈ పథకానికి అర్హులు. ఈ పథకానికి అర్హత సాధించిన రైతు కూలీలకు రూ. ఏడాదికి రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

వడబోత తర్వాతే రేషన్ కార్డులు

జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజా పాలనతోపాటు ఇటీవల నిర్వహించిన సర్వే గ్రామ సభల్లో కలిపి దాదాపు 70వేల వరకు దరఖాస్తులు అంది నట్టు సమాచారం. అర్హులను తేల్చేందుకు ఫిబ్రవరి మొదటి వారంలో మరోసారి గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఇందులో వచ్చిన మొత్తం దరఖాస్తులను వడబోసి అసలైన లబ్దిదారులను ఎంపిక చేసిన కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నట్టు సమాచారం.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ రాష్ట్ర సీపీఐ(ఎం) మహాసభల సందర్భంగా జరుగుతున్న భారీ బహిరంగ సభకు శనివారం మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం నుంచి వందలాదిగా తరలి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు బి. వెంకట రామయ్య పాల్గొన్నారు. సంగారెడ్డిలో ఈ భారీ బహిరంగ సభకు బాచుపల్లి మండలం నుంచి 100 మంది తరలి వెళారు. జిల్లా నుంచి 500 మంది తరలి వెళ్లారని తెలిపారు. బహిరంగ సభకు సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి. రాఘవులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో తెలంగాణ రాజకీయాల పైన ప్రత్యామ్నాయ విధానాల పైన చర్చించి.. రాజకీయ విధానం రూపొందించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజా సమస్యలపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు కర్తవ్యాలను తీసుకోవడం జరుగుతుంది. గత మూడు సంవత్సరాల నుంచి తెలంగాణలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగి న ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. అలాగే సీపీఐ(ఎం) పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు బాచుపల్లి మండల నాయకులు బాల వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ప్రభాకర్, మధుకర్, బాలపీరు, శంకర్రావు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా శనివారం సంగారెడ్డిలో జరుగు బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో.. షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ దగ్గర నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు , నాయకులు ,కార్యకర్తలు సంగారెడ్డి బయలుదేరి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) రాజీలేని పోరా టాలు చేస్తుందని అన్నారు. ఈ మహాసభలో గత మూడు ఏళ్లలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను చర్చించి.. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయవలసిన పోరాటాల కు రూపకల్పన దిశా నిర్దేశం జరుగుతుందన్నారు. శనివారం జరిగే బహిరంగ సభకు రాష్ట్ర నాలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖలో హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలకు పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, విజయ రాఘవన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు పసుల అంజయ్య, బి.సత్యం, జి వెంకన్న, కే.శీను, తిమ్మప్ప, ఆంజనేయులు, మల్లారెడ్డి, రాజేష్, వీరేష్, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎంఆర్ పాఠశాలలో "పారా సెయిలింగ్"



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్, పేట్ బషీరాబాద్ పైప్ లైన్ రోడ్‌లోని సీఎంఆర్ పాఠశాల నందు పారా సెయిలింగ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులందరికీ ఒక అపూర్వమైన అనుభవాన్ని అందించింది.ఈ కార్యక్రమం లో విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యబృందం, తల్లి దండ్రులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ పారా సెయిలింగ్ కార్యక్రమాన్ని స్క్వాడ్రన్ లీడర్ ఎస్‌పిఎస్ కౌశిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రధాన నిర్వాహకురాలిగా పి.స్నితిజా రెడ్డి విచ్చేశారు. ప్రధానో పాధ్యాయురాలు ఉమాదేవి మాట్లాడుతూ... సాహస క్రీడలు, విద్యార్థుల మాన సిక, శారీరక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతాయని, స్పష్టం చేశారు. సీఎంఆర్ పాఠశాలల డైరెక్టర్ పి.స్నితిజా రెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మనో బలాన్ని పెంచడంతో పాటు సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా స్క్వాడ్రన్ లీడర్ ఎస్ పి ఎస్ కౌశిక్ ఇటువంటి సాహసోపేతమైన క్రీడలను పాఠశాల స్థాయిలో ప్రోత్సహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు.

మంచి నీటి పైప్ లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ చైతన్య బస్తీలో మంచి నీటి పైప్ లైన్ పనులను మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషి వల్ల మంచి నీటి పైప్ లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పలు మార్లు బస్తీ వాసులు తన దృష్టికి తీసుకువస్తే.. అట్టి సమస్యను ఎమ్మెల్యేకి వివరించగా.. ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే నూతన పైప్ లైన్ కోసం నిధులు మంజూరు చేయించారని తెలిపారు. దీని ద్వారా చాలా రోజులుగా చైతన్య బస్తీ వాసులను వెంటాడిన కలుషిత నీటి సమస్యకు పరిష్కారం లభించ నుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీని వాస్, జిల్లా గోపాల్, గరిగె తుకారాం, జిల్లా బాబు రావు, అయిలయ్య, కె. శ్రీనివాస్, ఇనుగంటి రాజు, జైరాజ్, అనంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి బాధ్యత : డీసీ జి. రాజు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి, మల్కాజిగిరి సర్కిల్ కమిషనర్ జి.రాజు విజ్ఞప్తి చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరిలోనిసర్కిల్ కార్యాలయంలో శనివారం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పలువురికి నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం ఎలక్షన్ సిబందికి, బీఎల్‌వోలకి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని సహాయక ఓటరు నమోదు అధికారులు వారి వారి కార్యాలయాల్లో నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలు పాటించాలి



నవతెలంగాణ-ఉప్పల్

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమ నిబంధనలు అలవర్చుకోవాలని ఉప్పల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఉమా అన్నారు. జాతీయ రహదారి రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా శనివారం జోషి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ఉమాలు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నియామ నిబంధనలపై, తమ తల్లిదండ్రులతోపాటు, ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణపై, నిబంధనలపై వారికి వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు, శ్రీనివాస్, కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో రూ.63 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అభివృద్ధి పనులను రెగ్యులర్‌గా పర్యవేక్షించాలని ఆదేశించారు. సీసీ రోడ్డుల పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ వినీత్ రావు, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్‌రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, నోబెల్ రెడ్డి, తదితరులున్నారు.

'ఆశా'లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ కల్పించాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కల్యాణి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆశా వర్కర్లకు రూ. వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కల్యాణి అన్నారు. ఆశా వర్కలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ఆధ్వర్యంలో మల్కాజిగిరిలోని సీఐటీయూ కార్యాలయం నుండి జిల్లా హాస్పిటల్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.రేవతి, కల్యాణిలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేల ఇస్తామని సీతక్క అనేక సందర్భాల్లో మాట్లాడిందని గుర్తు చేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆశా వర్కర్లకు ప్రమోషన్ కల్పించాలని, ఏఎన్ఎం పోస్టులకు, ఆశాలకు ప్రమోషన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. మట్టి ఖర్చులకు రూ. 50 వేలు, రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుమలత, హేమలత, వసంత, రాజ్యలక్ష్మి, చంద్రకాంత, నమృతా, సరిత, ఝాన్సీ, సుజాత, శారద, అరుణ, స్వప్న, సురేఖ, లావణ్య, శ్వేత, స్వప్న, బాలమని, విజయనీ, శశికళ, రాణి, రాధ, సీఐటీయూ జిల్లా నాయకులు ఉన్నికృష్ణన్, సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు, సీఐటీయూ మల్కాజిగిరి మండల నాయకురాలు సుమిత్ర, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

రజక వృత్తిదారుల సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు సౌదారం సుభద్రమ్మ ఆధ్వర్యంలో శనివారం సీఐటీయూ ఉప్పల్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసి రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేడ్చల్ జిల్లాలో అర్హులైన రజకులకు ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 50 ఏండ్లు నిండిన వారికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని, ఉచిత విద్యుత్ పథకంలో ఎల్‌టీ-4 మార్చాలన్నారు. ఆధునిక ధోబీ ఘాట్లను నిర్మించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, జిల్లా కోశాధికారి సట్టురవి, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, జిల్లా నాయకులు ఎస్. స్వరూప, ఎం.ఉమా, సర్దార్ అశోక్, సారయ్య, స్వామి, తదితరులున్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా గుండ్లపోచంపల్లి



- మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీని గత ఐదేండ్ల కాలంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిద్దామని మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అర్కల్ గూడ, జ్ఞానాపూర్, బాసురేగడి, సుతారిగూడ, కండ్లకోయ, గుండ్లపొచంపల్లి వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అయినప్పటి నుండి తనకు సహకరించిన కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, డీఈ, ఆర్వో, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది ప్రతి ఒక్కరికీ చైర్ పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి,వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు మారేపల్లి రాజకుమారి సుధాకర్,లక్కిరెడ్డి శ్రీలత శ్రీనివాస్ రెడ్డి, అంతోనమ్మ ఫిలిప్స్, సముద్రాల హంసా రాణి కృష్ణ గౌడ్,రజిత వెంకటేష్, దొడ్ల మల్లికార్జున్, హేమంత్ రెడ్డి, అమరం సరస్వతి, భేరి బాలరాజు, జైపాల్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తవిడబోయిన గిరిబాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

కాంగ్రెస్ రామంతపూర్ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు జన్మదిన వేడుకలను శనివారం కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి, ఏఎస్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం గిరిబాబును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గడ్డం రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బెజ్జం యాదగిరి, సతీష్, గరిక సుధాకర్, ఉపేందర్ రెడ్డి, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి
- ఘనంగా శ్రీకరి మహాసన హై స్కూల్ మొదటి వార్షికోత్సవం

నవతెలంగాణ - చర్లపల్లి

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను ఎదుగుతారని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో శ్రీకరి మహాసన హై స్కూల్ మొదటి వార్షికోత్సవానికి ముఖ్యతిథులుగా కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, నాచారం సీఐ రుద్వీర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ రుద్వీర్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

నాణ్యతమైన విద్య అందిండమే లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమై విద్య అందించడమే లక్ష్యమని శ్రీకర మహసన హౌల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజన్ చౌహాన్ అన్నారు. నాణ్యతమైన విద్యను ఇవ్వడం కోసం చైర్మెన్ నగులూరి సాయిబాబా శ్రీకరి మాహసన హై స్కూల్‌ను స్థాపించారని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసి వారికి ఉజ్వల భవిష్యత్ ఇచ్చి దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని పాఠశాల చైర్మెన్ సాయిబాబా కుమార్తెలు సుచిత్ర రేఖ, పద్మజ రేఖ, గిరిజరమణి అన్నారు.



విద్యార్థుల అభ్యున్న తికి తాము అహర్నిశలు కృషి చేస్తామని పాఠశాల డైరెక్టర్లు సుచిత్ర రేఖ, పద్మజ రేఖ, గిరిజరమణి అన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను విద్యలో భాగం చేస్తున్నామన్నారు. పిల్లల ఎదుగుదలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సకలమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మేడ్చల్ మండలంలోని మునీరాబాద్‌లో మాసీ సీఎం కేసీఆర్ సోదరి సకలమ్మ మృతి చెండంతో ఆమె అంతిమయాత్రలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సకలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హైమాస్ట్ వీధి దీపాలు ఏర్పాటు

- ప్రారంభించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి

నవతెలంగాణ-ఉప్పల్



రామంతపూర్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి డీమార్ట్ వద్ద ఇందిరానగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధి దీపాలను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు వాటికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఏ బస్తీల్లో కాలనీలో వీధి దీపాలు వెలగపోయినా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట్రావు, నారాయణదాసు, లింగం, నగేష్, దానయ్య, సతీష్, సుధారాణి పాల్గొన్నారు.

బంజారాలు అన్ని రంగాల్లో రాణించాలి



- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రాములు నాయక్

నవతెలంగాణ - చర్లపల్లి

బంజారాలు అన్ని రంగాలలో రాణించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. శనివారం చర్లపల్లి సిరి గార్డెన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..1952 జనవరి 30న మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతులమీదుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రారంభమైందన్నారు. 72 వసంతాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 20 జిల్లాల్లో పూర్తి చేశామని, మిగతా 13 జిల్లాల్లో పూర్తి చేసి ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. జనవరి 30న అన్ని తండాలలో సేవాలాల్ జెండాలను ఎగురేసి సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. తండాలు మండల, జిల్లా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షుడిగా ధీరావత్ శ్రీను నాయక్

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షుడిగా ధీరావత్ శ్రీను నాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి : బొంతు శ్రీదేవి

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ అన్నారు. ఇందిరా, రాజీవ్ గాంధీల హయంలోనే తండాలు అభివృద్ధి అయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే బంజారాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమా నాయక్, బాపు నగర్ మాజీ కౌన్సిలర్ కిషన్ రాథోడ్, మహంకాళి టెంపుల్ చైర్మెన్ ధీరావత్ శంకర్ నాయక్, మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ నాయక్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇస్లావత్ హరినాయక్, హనుమ, దసరత్, కిషన్ నాయక్, ధీరావత్ లింగం నాయక్, బుక్య బీమా నాయక్, ధీరావత్ రెడ్డి నాయక్, ధీరావత్ లక్ష్మణ్ నాయక్, నరసింహ నాయక్, గంజి నాయక్, పకీర నాయక్, భాస్కర్ నాయక్, అరుణ బాయ్, వివిధ జిల్లాల బంజారా నాయకులు హాజరయ్యారు.

అఖిల భారత యాదవ సభ అధ్యక్షుడికి జగన్ యాదవ్ సన్మానం

నవతెలంగాణ-ఉప్పల్



అఖిల భారత యాదవ మహాసభ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చింతల రవీంద్రనాథ్ యాదవ్‌ను శనివారం రామంతాపూర్ యాదవ సంఘం నాయకులు వల్లపు జగన్ యాదవ్ కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ యాదవ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సంఘం కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు.

తాండ్ర పాపారాయుడు 268వ వర్ధంతి



నవతెలంగాణ-ఆల్వాల్

సర్దార్ తాండ్ర పాపారాయుడు 268వ వర్ధంతి సందర్భంగా ఆల్వాల్‌లోని మంగపురం కాలనీ అధ్యక్షులు రాకేష్ రావు టీపీ పార్క్ వద్దనున్న పాపారాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాకేష్ రావు మాట్లాడుతూ.. తాండ్ర పాపారాయుడు జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన దేశం కోసం చేసిన పోరాటాలను, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులోకి పూర్తిస్థాయి ఆరోగ్య సేవలు



నవతెలంగాణ -అల్వాల్

అల్వాల్‌లోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారి డాక్టర్ యాకేందర్ రెడ్డి తెలిపారు. ఇకపై అల్వాల్, పరిసర ప్రాంతాల ప్రజలు వివిధ రకాల వైద్య సేవలను ఇక్కడే పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అల్వాల్ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రసూతి కేంద్రం అందుబాటులోకి రానుందని చెప్పారు. దీంతో గర్భిణీ స్త్రీలకు మరింత మెరుగైన వైద్య సేవలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ, సూపర్వైజర్ జగన్, అరుణ, సంగీత, సృజన సిబ్బంది ఉన్నారు.

పోచారం మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం





నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో రూ.2కోట్ల 20లక్షల 87వేలతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పోచారం పురపాలక సంఘంలో సీసీ కెమెరాలు, విలీన గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, పారిశుధ్య విభాగం, ప్రజాపాలన నిర్వహణ, స్టేషనరీ కొనుగోలు, టౌన్ ప్లానింగ్ సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ పనులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అయిదేండ్లలో దాదాపు రూ.60కోట్లతో భవనాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీలు, జంక్షన్‌ల అభివృద్ధి శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్స్ గోంగాళ్ళ మహేష్, నార్రి ధనలక్ష్మి కాశయ్య, చింతల రాజశేఖర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకిటి శైలజ బాల్‌రెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, బాలగోని వెంకటేష్ గౌడ్, నల్లవెల్లి లక్ష్మి శేఖర్ ముదిరాజ్, బెజ్జంకి హరిప్రసాద్ రావు, శ్రీలత బుచ్చిరెడ్డి, సూర్వి రవీందర్‌గౌడ్, అబ్బువతి నీ సరిత స్వామి,సూర్వి సుధ లక్ష్మీ శ్రీనివాస్ బద్దం మమతా జగన్ మోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలీ, దాసరి శంకర్ వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

గ్రామాల్లో ప్రజాపాలన సభల పేరుతో కాంగ్రెస్ సభలు



- బీజేపీ నాయకులు ప్రభంజన్ గౌడ్

నవతెలంగాణ - పోచారం

గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభల పేరుతో కాంగ్రెస్ సభలు నిర్వహిస్తున్నారని బీజేపీ నాయకులు ప్రభంజన్ గౌడ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కాచవాని సింగారంలో నిర్వహించిన వార్డుకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన సభ కాంగ్రెస్ సభలా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులను ఇందిరమ్మ కమిటీలో సభ్యులుగా తీసుకొని వారి పార్టీ కార్యకర్తలకు, వారికి తమకు అనుకూలమైన వారికి సంక్షేమ పథకాలు వచ్చేలా పేర్లను లిస్టులో సెలెక్ట్ చేయడం దారుణమన్నారు. మరోసారి అర్హులైన పేదలకు భంగపాటు తప్పలేదని చెప్పారు. అధికారులు దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయకుండా పారిపోవడం సిగ్గుచేట్టన్నారు. అర్హులైన పేదలందరికీ న్యాయం జరిగేదాక బీజేపీ తరపున పోరాటం చేస్తామన్నారు.

బీజేపీ మల్లాపూర్ అధ్యక్షుడిగా శైలేష్ రెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి



బీజేపీ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా గూడూరు శైలేష్ రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎన్నికల పరిశీల కులు ఆచారి ప్రకటించారు. ఈ సందర్భంగా గూడూరు శైలేష్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లాపూర్ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



నాచారం డివిజన్ లోని పని చేయని విద్యుత్ దీపాల స్థానంలో కొత్త గా లైట్లు ఏర్పాటు చేసే పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రారంభించారు. వీధి దీపాల సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాచారం డివిజన్ మాజీ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, విటల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, ఎలక్ట్రికల్ సిబ్బంది ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ,చర్లపల్లి



తన కూతురు వివాహనికి రావాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. -నవతెలంగాణ, కాప్రా

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

వినాయక్ నగర్ డివిజన్, ఈస్ట్ కాకతీయ నగర్ కమిటీ సభ్యులు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుల మోతే శోభన్ రెడ్డిలను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈస్ట్ కాకతీయ నగర్ ప్రాంతంలోని వాళ్ళు ఎదుర్కొం టున్న పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ ఈ సమస్యలపై వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి, బాక్స్ డ్రైన్ సమస్యలతో పాటు శానిటేషన్ సంబంధిత సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రిపబ్లిక్ డే వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో గణతంత్ర వేడుకలు, రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమాల దృష్ట్యా ఉదయం 7.30 గంటల నుంచి ఉద యం11.30 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. పంజాగుట్ట, బేగంపేట, సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యా మ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాలైన టివోలీ ఎక్స్ రోడ్స్, ప్లాజా ఎక్స్ రోడ్డు మార్గాలను మూసివేయనున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు షెడ్యూల్ కంటే ముందే బయల్దేరి రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు.

అక్రమంగా నిలువ ఉన్న మందులు స్వాధీనం



నవతెలంగాణ-ఓయూ

డ్రగ్స్ కంట్రోల్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి అడ్డగుట్టలోని గోదాంపైన దాడులు నిర్వహించి అక్రమంగా నిలువ ఉంచిన 2.20లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ డీజీ కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకు అడ్డగుట్ట, తుకారాంగేట్‌లోని నివాసంలో తనిఖీలు నిర్వహించి సిద్ధి శ్రీదర్ అనే వ్యక్తి ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా 27రకాల మందులన నిలువ ఉంచి అమ్ముతున్నాడని గుర్తించిన్నట్టు సికింద్రాబాద్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ బీ గోవింద్ తెలిపారు. అంతేకాకుండా ఆయుర్వేద మందులని దేవ టోన్ సిరప్‌తో కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయని, శతపుష్ప పండు పొడి, కోర్డిఫోలియో మాత్రలు వాడితే జ్వరం ఇట్టే తగ్గిపోతుందని అవాస్తవాలు ప్రచారం చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని రకాల మందులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మందులు వాడడం వలన జరిగే దుష్పరిణామాలను పూర్తిగా అధ్యయనం చేసి తదుపరి చట్ట పర చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా వీటిని సరఫరాచేసిన వారిపైన కూడా చర్యలు ఉంటాయని వెల్లడించారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులను నిలువ ఉంచినా, విక్రయాలు జరిపినా కూడా డ్రగ్స్, కాస్మెటిక్స్ యాక్ట్ ప్రకారం నేరమని తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని, ఇటువంటి వ్యక్తులకు అమ్మకాలు జరిపిన హెూల్ సేల్ వ్యాపారులు, డీలర్స్ కూడా శిక్షార్హులవుతారని వెల్లడించారు.

ఓటు హక్కును వినియోగించుకుని ప్రగతిలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ గౌ. జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నేషనల్ ఓటర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా పోలీసు వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25న దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. మనది ప్రజాస్వామ్య దేశమని, తెలంగాణలో అందరి సహకారంతో సాఫీగా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికల కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయడం జరిగిందని తెలిపారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించి, ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యన్ని పరిరక్షించాలని ఆయన సూచించారు. డెబ్బై ఐదు ఏండ్ల క్రితం, మన రాజ్యాంగ నిర్మాతలు స్వేచ్ఛగా, నిష్పక్షికంగా ఎన్నికలను నిర్వహించడం, పర్యవేక్షించాలన్న లక్ష్యంతో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)ను బలమైన, స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఓటర్ల నమోదు పెంచడానికి భారత ఎన్నికల కమిషన్ పలు చర్యలు ప్రవేశపెట్టిందన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంత ముఖ్యమో వివరించి, అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది నేషనల్ ఓటర్స్ డే థీమ్ 'ఓటును మించినది ఏమీ లేదు-నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అని తెలిపారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా నూతనంగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లకు ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆయా జిల్లా కలెక్టర్లకు, అధికారులకు, బూత్ స్థాయి అధికారులకు అవార్డులు అందజేశారు. క్విజ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలలో రాష్ట్రస్థాయిలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బందికి మెమోంటో, అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఈఓలు సత్యవాణి, హరి సింగ్, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, డీసీలు రజినీకాంత్ రెడ్డి, ప్రశాంతి, అధికారులు, సీఈఓ కార్యాలయ అధికారులు, విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, వివిధ వర్గాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో 57 ఎస్సీ కులాల-మేధోమథనం

- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆలస్యం ఎస్సీ వర్గీకరణ అమలులో చేయకూడదు: తాళ్ళ అజయ్



నవతెలంగాణ-ఓయూ

సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళ అజయ్ అధ్వర్యంలో శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో 57 ఎస్సీ కులాల-మేధోమథనం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ప్రొ. గజవెల్లి ఈశ్వర్, 57 ఎస్సీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, నాగుల శ్రీనివాస్ యాదవ్, డా. రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ. గజవెల్లి ఈశ్వర్ మాట్లాడుతూ.. సామాజిక వెనకబాటు ఆధారంగా వర్గీకరణ చేయాలని, ఎస్సీ వర్గీకరణ అమలులో ఉపకులాల న్యాయబద్ధమైన వాటాను తేల్చాలని, ఎస్సీ జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను పెంచి వర్గీకరణలో అత్యధికంగా వెనుకబడిన ఉపకులాలకు ఎక్కువ వాటాను కేటాయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వెంటనే వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తెలిపారు. జరుగుతున్న వేల గొంతులు - లక్ష డప్పులు కార్యక్రమానికి పూర్తి మద్దతుగా నిలుస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 57 ఎస్సీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం మాట్లాడుతూ.. ఎస్సీ ఉప కులాలుగా సామాజిక అనచివేతకు గురి కాబడి మాదిగ, మాలల కంటే అత్యంత వెనుకబాటుకు గురయ్యామని, మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల ఉద్యమంలో ఉపకులాలు అన్ని కూడా పాల్గొన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు ఆలస్యం చేయకుండా వెంటనే అమలుపరచాలని కోరారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను మాదిగ, మాలల కొట్లాటగా చూపించి వర్గీకరణను ఆలస్యం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆలస్యం మూలంగా అనేక మంది అసువులు బాశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఆలస్యం చేయకుండా కమిషన్ నివేదికను వెంటనే తీసుకొని వర్గీకరణ అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం చేవెళ్ల డిక్లరేషన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగ, ఉప కులాల మద్దతు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపకులాల నాయకులు మంగేష్, పశుపతి, గౌరీ శంకర్, తులసీరామ్, సాలమ్మ, బిక్షపతి, స్వామి, అశోక్ పోషం, వెంకట్ ప్రసాద్, రాము, సంపత్ విద్యార్థి సంఘాల నాయకులు లింగంపల్లి మనోజ్, తీగల శివ (బీమ్ ఆర్మీ) బూషిపాక గణేష్ ఎంఎస్ఓ సుమంత్, హరీష్, మధు, రాము పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలి
- అదం సంతోష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ముగ్గురు ఉపాధ్యక్షులుగా, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు జాయింట్ సెక్రటరీలుగా, ఐదుగురు కార్యదర్శులుగా నియమితులయ్యారు. నూతన కమిటీకి శనివారం అదం సంతోష్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు గణేష్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేయాలని కోరారు. అదం సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలని, అర్హులైన లబ్దిదారులకు పథకాలు అందేలా మనం కృషి చేయాలని అదం సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అన్ని డివిజన్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాద్ గౌడ్, గంట రాజు సాగర్, జలీల్, కుమురమ్మ పాల్గొన్నారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

- బీసీలను ఓటర్లగా కాకుండా రాజ్యాధికారంలో గుర్తింపు ఇవ్వాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

దేశంలో సగానికి పైగా ఉన్న బీసీ జనాభాను దృష్టిలో ఉంచుకొని జాతీయ స్థాయిలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి అధ్యక్షతన బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి, బీసీ కులగలనా చేపట్టాలి అనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావే శాన్ని ఏర్పాటు చేశారు. జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఒకలాభరణం కృష్ణమోహన్ బీసీ సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. జనాభాలో 60 శాతం పైగా బీసీలు ఉండగా ప్రభుత్వాలు బీసీల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తుందని అన్నారు. బీసీ ప్రధానమంత్రి ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం జరగకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి బీసీల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించ కపోతే జాతీయస్థాయిలో బీసీలను ఏకం చేసి ధర్మాగ్రహ దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాతీయ సంచార కులాల సంఘం అధ్యక్షుడు నరహరి, ఆచార్య భాస్కర్, ఆచార్య వెంకటరమణ, ఆచార్య కవిలత, ఆచార్య బాగయ్య, ఆచార్య రవిచంద్ర, ఆచార్య నవీన్‌యాదవ్, డా.గణపతి, హైకోర్ట్ న్యాయవాదు లు ఓం ప్రకాష్ యాదవ్, సారిక, వివిధ కుల, ప్రజా, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు సాయిపటేల్, డా.దత్తాత్రేయ, డా. కిరణ్, డా.వెంకటరమణ, డా.కావ్య, హేమలత, డి.లక్ష్మి, సంగీత, డా. వర్కాల వసుమతి, కె.రఘుపతి, ఎన్.శ్రీనివాస్, రమణయాదవ్, వి.బి.రమణ, సాయియాదవ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పీహెచ్డీ నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి



- ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చిన ఏబీవీపీ

నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీలో గత మూడేండ్ల నుంచి యూనివర్సిటీ పీహెచ్డీ ప్రవేశాలు నిర్వహించక పెద్ద మొత్తంలో ఖాళీలు ఉన్నాయి. కాబట్టి ఈ అకడమిక్ ఏడాది 2024-2025 పీహెచ్డీ ప్రవేశాలకు ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించాలని ఏబీవీపీ సభ్యులు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం 62 ఏండ్ల వరకు ప్రొఫెసర్స్‌కి గైడ్‌షిప్ ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి సర్వీస్‌లో ఉన్న ప్రొఫెసర్స్, రిటైర్డ్ ప్రొఫెసర్‌కి అందరికీ ఆ యొక్క వయస్సును అనుసరించి గైడ్షిప్ ఇవ్వాలని, ఎలిజిబిలిటి టెస్ట్‌లో ఓసీలకు 40శాతం, బీసీశాతం, ఈడబ్ల్యుఎస్ విద్యార్థులకు 35శాతం ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 30 శాతం మార్కులతో కటాఫ్ పెట్టాలని, యూజీసీ నిబంధనల ప్రకారం మెరుగైన పరిశోధన జరగడానికి ప్రయివేట్ యూనివర్సిటీలో కూడా పరిశోధనలు సజావుగా జరగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేత గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ పరిశోధన కేంద్రలలోని ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వారికి గైడ్‌షిప్ ఇవ్వాలని, పీహెచ్డీ ప్రవేశ పరీక్ష ఫీజులను తగ్గించాలని కోరారు. పరిశోధన పరీక్షలో స్టేట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని సూచించారు.

జవ్వాది అనిల్‌కు వీర తెలంగాణ అవార్డు



నవతెలంగాణ-బంజారాహిల్స్

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ లక్ష్యాలను చేదించినందుకు ఎస్‌బీఐ లైఫ్ సీనియర్ అడ్వయిజర్ జవ్వాది అనిల్ కుమార్‌కు వీర తెలంగాణ అవార్డు వరించింది. శనివారం ఎస్‌బీఐ లైఫ్ కార్యక్రమంలో సంస్థ జోనల్ డైరెక్టర్ రాజీవ్ శ్రీవాస్తవ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ అభిషేక్ ముజేందర్‌లు అతనికి ఈ అవార్డును అందజేశారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, అవార్డు రావడం ఆనందంగా ఉందని అన్నారు. దిగువ, మధ్య తరగతి ప్రజలకు ఇన్సూరెన్స్‌ల పట్ల అవగాహన కల్పిస్తూ వాటి ప్రాధాన్యతను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు.

నేడు ఉచిత వినికిడి శిబిరం

- అన్ని వయస్సుల వారికి పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ హైదరాబాద్‌లోని ప్రత్యేకమైన చెవి, ముక్కు గొంతు సంరక్షణలో ప్రముఖ క్లినిక్. బేగంపేటలోని క్లినిక్‌లో నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వినికిడి ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నారు. వినికిడి లోపం, దాని ప్రభావం గురించి అవగాహన పెంచడం, వినికిడి లోపాలతో పోరాడుతున్న వారికి అధునాతన పరిష్కారాలను అందించడం ఈ శిబిరం లక్ష్యం. అన్ని వయసుల వారికి ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్‌కు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ చావా ఆంజనేయులు తెలిపారు. ఈ ఉచిత వినికిడి శిబి రంలో ఆడియో మెట్రీ, బరా టెస్ట్, హియరింగ్ టెస్ట్, క్లాకియర్ ఇంప్లాంట్‌కు కావాల్సిన అన్ని రకాల పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షల్లో ఏమైనా వినికిడి సమస్యలు వస్తే ఖచ్చితమైన పరిష్కారం చూపుతామని తెలిపారు. అంతే కాకుండా ఇది వరకు వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారికి సరైన పరిష్కా రం ఇక్కడ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. వెయ్యికి పైగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసిన ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ సుబ్బా రాయుడు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చే యనున్నారు. ఉచిత వినికిడి ఆరోగ్య శిబిరం కోసం నమోదు చేసుకోవడానికి, ఆసక్తిగల వారు 8179033446 లేదా 8008188800 నెంబర్లను సంప్రదించవచ్చు.

హెబ్రోన్ చర్చి వివాదంపై న్యాయ విచారణ చేయాలి



- ప్రభుత్వాన్ని కోరిన హెబ్రోన్ చర్చ సభ్యులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

హెబ్రోన్ చర్చి వివాదంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని చర్చి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెవరెండ్ జోయల్ జాన్ స్టీవార్ట్, రీఛార్డ్, మాజీ డీజీపీ బాబురావు పాల్గొని మాట్లాడారు. అకారణంగా 16 ఏండ్ల పాటు ఎమ్మెల్సీగా పనిచేసిన వ్యక్తితో పాటు చర్చి సభ్యులపై దాడులు చేశారని తెలిపారు. పవిత్రమైన చర్చి ప్రాంగణంలోకి గుండాల ప్రవేశించేలా సహకరించిన వారు దాడులకు ప్రేరేపించారని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రత్యేక న్యాయ విచారణ కమిటీని ఏర్పాటు చేసి దోషులను గుర్తించాలని అన్నారు. ఉద్దేశపురకంగా చర్చిలో అలజడి సృష్టించే వారిని కఠినంగా శిక్షించి శాంతి సామరస్యాలు నెలకొనెల చూడాలని కోరారు.

అపోలో హాస్పిటల్స్ 'ఫుట్ అండ్ ఆంకిల్ కేర్ కేంద్రం' ప్రారంభం

- ఆర్థోపెడిక్ సేవలకు సమగ్ర పరిష్కారం
- డయాబెటిక్ రోగులకు ప్రత్యేక చికిత్స



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 'ఫుట్ అండ్ ఆంకిల్ కేర్ కేంద్రం' ప్రారంభమైంది. ఈ కేంద్రం ప్రారంభించడంతో అపోలో ఆరోగ్య రంగంలో మరో ముందడుగు వేసింది. ఈ ఆధునిక కేంద్రం ఫుట్ అండ్ ఆంకిల్ సంబంధిత సమస్యలకు ఉన్నత సేవలు, ప్రత్యేక చికిత్సలు అందిస్తూ, ప్రపంచ స్థాయి ఆర్థోపెడిక్ సంరక్షణను అందించనుంది. ఈ కేంద్రం సమగ్ర ఆర్థోపెడిక్ సంరక్షణ, డయాబెటిక్ రోగుల ప్రత్యేక చికిత్సకు వీలు కల్పించనుంది. ఈ ప్రారంభాన్ని పురస్కరించుకొని జూబ్లీ హిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ శేషభట్టారు మాట్లాడుతూ.. రోగులు తరచూ మా వద్దకు చివరి ఆశగా వస్తున్నారన్నారు. మా చికిత్స కేవలం అవయవాలను సంరక్షించడమే కాకుండా, వాటి పని తీరు, కదలికను మెరుగుపరచడం కూడా అన్నారు. ఇది అనేక మంది రోగుల జీవితాలను మారుస్తుందన్నారు. ముఖ్యంగా తీవ్రమైన పాదాల వైకల్యాలు, మధుమేహ నాడీవ్యవస్థ సమస్యల వల్ల అవయవాల కోల్పోయే ప్రమాదంలో ఉన్న రోగులకు, వారి కదలికను పునరుద్ధరించి, జీవన నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు డాక్టర్ వేణు సహకారంతో అక్యూట్ చార్కాట్ డిసీజ్ అనే అధునాతన న్యూరోపతి అందిస్తున్నామన్నారు. మా బృందంలో న్యూరాలజిస్ట్, వాస్కులర్ స్పెషలిస్టు, పీడియాట్రీ, ఆర్థోపెడిక్ సర్జన్లు వంటి విభాగాల నిపుణులు ఉన్నారన్నారు. అన్ని సేవలను ఒకే చోట సమగ్రంగా అందించడం ద్వారా మధుమేహ రోగులకు సమర్థవంతమైన చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. ఇది భారతదేశంలో ఇలాంటి సేవలు అందిస్తున్న ఏకైక కేంద్రం అన్నారు. ఫుట్ అండ్ ఆంకిల్ సెంటర్ అత్యుత్తమ సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోగి కేంద్రీకృత దృక్పథాన్ని కలిగి ఉందన్నారు. చిన్న గాయాల నుంచి కష్టమైన శస్త్రచికిత్సల వరకు ఈ కేంద్రం సంప్రదాయ, సూక్ష్మ సాంకేతికతను ఉపయోగించి విభిన్న అవసరాలను తీర్చగలదని తెలిపారు. భారతదేశంలో డయాబెటిక్ ఉధృతి అధికంగా ఉన్నందున డయాబెటిక్ ఫుట్ మేనేజ్‌మెంట్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సమస్యను పరిష్కరిస్తుందని తెలిపారు. పలు దేశాల ప్రఖ్యాత ఫుట్ అండ్ అంకిల్ సర్జన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీఈవో తేజస్వి రావు మాట్లాడుతూ.. ఈ కేంద్రం ప్రారంభం ప్రపంచ స్థాయి, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం మన దేశంలోనే హైదరాబాదును అడ్వాన్స్‌డ్ ఫుట్ అండ్ ఆంకిల్ కేర్ హబ్‌గా తీర్చిదిద్దుతుందని అన్నారు.

సంప్రదాయ ఆభరణాలతో మగువల అందం రెట్టింపు



- సినీ నటి అనుపమ పరమేశ్వరన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆభరణాలతో మగువల అందం రెట్టింపు అవుతుందని సినిమా నటి అనుపమ పరమేశ్వరన్ అన్నారు. జూబ్లీహిల్స్ పిల్లర్ నెంబర్ 1604 వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వియార ఫైన్ జువెలరీ షోరూంను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, జస్టిస్ డాక్టర్ విఆర్ కే కే సాగర్‌లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుపమ మాట్లాడుతూ.. భారతీయ సాంప్రదాయ ఆభరణాలను ప్రపంచం మెచ్చుతుందని అన్నారు. తాను కూడా శుభకార్యాల సమయంలో సాంప్రదాయ ఆభరణాలను ధరించేందుకు ఇష్టపడతానని తెలిపారు. సాంప్రదాయ, ఆధునిక మేలవింపుతో ఆభరణాలను తమ షోరూంలో అందుబాటులో ఉంచినట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి లలిత్ కుమార్ తెలిపారు. ప్రీమియం స్టెర్లింగ్ వెండి చక్కటి రత్నాలతో రూపొందించిన వియారా విస్తృత శ్రేణి స్టేట్‌మెంట్ నెక్లెస్‌లు, క్లిష్టమైన చెవిపోగులు, సున్నితమైన కంకణాలు మరిన్నింటిని అన్వేషించే అవకాశం సందర్శకులకు ఉంటుందన్నారు. మా మొట్టమొదటి వియారా స్టోర్‌కి తలుపులు తెరిచేందుకు మేము సంతోషిస్తున్నామని లలిత్ పేర్కొన్నారు.

శ్లోకలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - ధూల్ పేట్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముందస్తుగా జియా గూడ శ్లోక స్కూల్ లో వేడుకలు, పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పిల్లలకు ఇంటి వద్ద చదువు పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు సూచించారు. దీంతో విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహిస్తూ భవిష్యత్తులో రాణిస్తారని అవగాహన కల్పించారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని చిన్నారి విద్యార్థులు జాతీయ పతాక దుస్తులతో ఆకట్టుకున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

- సీనియర్ నాయకులు మధుసూదన్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక ఆయుధమని అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సీనియర్ నాయకులు మధుసూదన్ యాదవ్ అన్నారు. నేషనల్ ఓటర్ డే పురస్కరించుకొని శనివారం నల్లకుంటలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, అజయ్, కష్టయ్య, సాయిలు, శ్రీనివాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా స్పెషల్ డ్రైవ్..!

- కొనసాగుతున్న డీ-సిల్టింగ్ పనులు
- ఇప్పటిదాకా 2561 కి.మీ పైపులైన్, 2.03 లక్షల మ్యాన్ హెూళ్లు శుభ్రం
- నిర్ణీత సమయంలో టార్గెట్ చేరుకోవాలన్న ఎండీ, ఈడీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్ స్పెషల్ డ్రైవ్' కార్యక్రమం లక్ష్యం దిశగా సాగుతోంది. జలమండలి పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది, అధికారులు సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో పూడికతీత పనులు రోజూ చేపడుతున్నారు. ఒకవైపు రోజూ వారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుకుంటూనే మరోవైపు స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పనులు చేస్తున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో ఇప్పటిదాకా 19,688 ప్రాంతాల్లో పనులు నిర్వహించారు. అందులో 2561 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 2.03 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. స్పెషల్ డ్రైవ్‌పై ఫోకస్ పెట్టి క్రమంగా విధులు నిర్వర్తిస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అభినందించారు. డాష్ బోర్డులో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఇందులో ఏవైనా సమస్యలుంటే ఐటీ విభాగం అధికారుల సాయం తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల నూతన సీవరేజ్ పైపులైన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సిబ్బంది పనితీరు, స్పెషల్ డ్రైవ్ పురోగతిపై సంబంధిత సీజీఎంలు, డైరెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలని సూచించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.



సీఎం సూచనలతో పొడిగింపు..

సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జలమండలి 90 రోజుల స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. గతేడాది అక్టోబర్ 2న స్వయంగా ముఖ్యమంత్రి, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ డ్రైవ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదట 90 రోజుల గడువుతో ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. డిసెంబర్ 31 నాటికి మంచి ఫలితాలు వచ్చాయి. దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కారం అయ్యాయి. రోజూవారీగా వచ్చే ఫిర్యాదులు 30 శాతం వరకు తగ్గాయి. ఈ విషయాల్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి జలమండలి సిబ్బంది, అధికారులను ప్రశంసించారు. బోర్డు పనితీరును మెచ్చుకున్న ఆయన ఈ డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడిగించాలని సూచించారు. దీంతో మరో 90 రోజుల పాటు డ్రైవ్ గడువును పొడిగించి డీ-సిల్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు.

పోరాటాల ద్వారానే సంక్షేమ పథకాల అమలు



- కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడాలి
- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

పోరాటాల ద్వారానే సంక్షేమ పథకాల అమలవుతాయని, ప్రజావ్యతిరేకత అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్నీ గద్దె దిగించే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో జరుగుతున్న సందర్భంగా గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ చేసిన పోరాటాలు, ఆందోళనలు, కార్యక్రమాలు సమీక్ష చేసుకొని భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకొని ప్రభుత్వ విధానాలపై పోరాడి పేదలందరి పక్షాన పోరాటం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై ముందు ముందు అనేక పోరాటాలు పార్టీ చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటుతున్నా ఇచ్చిన 6 గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు మినహాయించి ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు గానీ, రూ500 గ్యాస్ సబ్సిడీ గాని, రూ.4000 పెన్షన్ గాని, ఇందిరమ్మ ఇండ్లు గాని, రైతు భరోసా గాని. రైతు బీమా గాని, విద్యార్థులకు స్కాలర్షిప్ కానీ, ఇంటర్ డిగ్రీ మహిళా విద్యార్థులకు స్కూటర్లు గాని ఏ ఒక్కటీ అమలు చేయకపోగా ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారుమహాసభలలో చర్చించి ప్రజలను ఏకం చేసి ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అంబర్పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, సుబ్బారావు, సోమన్న షబానా, నాయకులు నిరంజన్, మోహన్, నాగేందర్, ఏసు, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మంచినీటి, సివరేజీ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు . శనివారం జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ రామ కష్ణతో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ద్వారా మంజూరైన నూతన పైప్ లైన్ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. అలాగే డివిజన్ లోని పలు బస్తీలు, కాలనీలలో మంచినీటి లోప్రెషర్ సమస్య అధికంగా ఉందని, ఇదివరకే పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని కార్పొరేటర్ ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందిపడకుండ వారి సమస్యలు పరిష్కరించడం అధికారుల బాధ్యతని గుర్తుచేశారు. త్వరలో మంచినీటి లోప్రెషర్ సమస్యను నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్ రెడ్డి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానమివ్వాలి



- జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-మెహదీపట్నం

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాసనమండలి ఎన్నికలు- బీసీల పాత్ర పై బీసీ మేధావులు, బీసీ సంఘాలు లక్డికపూల్ అశోక హెూటల్‌లో ఏర్పాటుచేసిన విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అన్ని పార్టీలు బీసీలకే టికెట్లు ఇవ్వాలని కోరారు. బీసీలకు టికెట్ ఇవ్వని పార్టీలకు బీసీలందరూ ఐక్యమై బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలందరూ వారి శక్తిని తెలుసుకొని ఐకమత్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ శూన్యత ఉందని దానిని బీసీలు రాజ్యాధికారంలో తమ సముచితమైన వాటా కోసం పోరాటంతో పూరించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బీసీ సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రేమనగర్‌లోని హైమావతి పాఠశాలలో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ మాట్లాడుతూ అంబేద్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్ గా ఉండి ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగాన్ని తయారు చేశారని, రాజ్యాంగం భారత ప్రజలందరికీ హక్కులను బాధ్యతలు ఇచ్చిందని, భారత పౌరులందరూ రాజ్యాంగాన్ని చదవాలని, రాజ్యాంగ నియమాలను పాటించాలన్నారు. అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ ,నెహ్రూ, రాజగోపాల్ ఆచారి బాబు రాజేంద్రప్రసాద్ ,లాల్ బహదూర్ శాస్త్రి వంటి నాయకులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, ఇలాంటి నాయకుల జీవిత చరిత్రలు చదివితే నేటితరం విద్యార్థులు వారి లక్ష్యాలను సులభంగా చేరుకోగలరని అన్నారు. విద్యార్థులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోఠి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజనీతి శాస్త్ర విద్యార్థులు ప్రజలకు వారి ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యత తెలిపేందుకు నిర్వహించిన ఒక చిన్న వ్యంగ్య నాటికను ప్రదర్శనఅందరినీ ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ , డైరెక్టర్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ లోక పావని హాజరై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నమునా ఓటింగ్ విధానంలో వీసీతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ ఆడెపు రాజేశ్వర్, డాక్టర్ శంకర్ ఇతర రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.



వీధి కుక్కల సంరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యం

- బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని

నవతెలంగాణ - ముషీరాబాద్

వీధి కుక్కల పట్ల ప్రేమను పెంపొందించడంతో పాటు, వాటి సంరక్షణ గురించి అవగాహన కల్పించడమే తమ సంస్థ లక్ష్యమని బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల అన్నారు. శనివారం దోమల్‌గూడలోని చైతన్య విద్యాలయంలో బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మార్స్ పెట్‌కేర్ సంయుక్తంగా నిర్వహించిన 'లవ్ మైఇండీ డాగ్ షో' మూడో ఎడిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెంపుడు జంతువుల సంక్షేమానికి తమ కంపెనీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ షోలో యంగ్, వైజ్ ఇండీ, గ్రేట్ ఇండీ వంటి విభాగాలలో పోటీలు జరిగాయి. విజేతలకు మార్స్ పెట్‌కేర్ ఇండియా ఎండీ సలీల్ మూర్తితో కలసి అమల బహుమతులు అందజేశారు. పోటీలతోపాటు పెంపుడు జంతువుల సంరక్షణ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలతో పాటు పశువైద్య సలహాలు అందించారు. వందలాది మంది వీధి కుక్కల ప్రేమికులు వారి ఇంటి కుక్కలతో పాల్గొన్నారు.



నేడు రూట్ బస్సు పాసులను అనుమతించాలి

టి.ఆర్.టి.యు, జి.టి.ఏ

సర్క్యులర్ జారీ చేస్తాం : ఫలక్‌నుమా డిపో మేనేజర్

నవతెలంగాణ - ధూల్ పేట్

రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా ఆర్టీసీ బస్సులలో విద్యార్థుల రూట్ బస్సు పాసులను అనుమతించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.యు) హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.విజయ భాస్కర్, తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జి.టి.ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డి.గిరివర్ధన్ లు అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వారు ఫలక్ నూమ బస్సు డిపో మేనేజర్ రమేష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జనవరి 26 ఆది వారం సెలవు దినమని, గణతంత్ర దినోత్సవమని జాతీయ పర్వదినమని అవగాహన లేక కొంత మంది కండక్టర్ లు విద్యార్థుల రూట్ బస్సు పాసులను అనుమతిం చకపోవడానికి అవకాశముందన్నారు. గతంలో ఆగస్టు 15, జనవరి 26 ప్రభుత్వ సెలవు దినాలని ఆర్టీసీ బస్సులలో నుంచి దించి వేసిన ఉదాంతాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలలో, కళాశా లల్లో, విద్యాలయాల్లో జరిగే గణతం త్ర వేడుకలలో పాల్గొనే అవకాశం కల్పించడానికి రూట్ బస్సు పాసు లను అనుమతించాలని కోరారు.

ఫలక్ నూమ డిపో మేనేజర్ రమేష్ స్పందిస్తు.. ఫలక్ నూమ బస్సు డిపో లో నోటీసు బోర్డులో ఆదివారం రూట్ బస్సు పాసులను అనుమతించాలని ఉత్తర్వులు అతికించనున్నట్లు చెప్పారు. కండక్టర్లందరికి ఆర్టీసీ బస్సులలో రూట్ పాసులను అనుమతించాలని సర్క్యులర్ జారీ చేస్తామని తెలిపారు.



జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా శనివారం జాంబాగ్ డివిజన్‌లోని వివి కళాశాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ జాంబాగ్ బిల్ కలెక్టర్ శివలాల్, ఆశా వర్కర్లు రామ, దుర్గేశ్వరి, బాల లక్ష్మీ, సుధారాణి, ఆర్ పి లు నాగశ్రీ ,మమత, స్వాతి తదితరులు.

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సుశీల్ యోగా స్టూడియోలో గణతంత్ర వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

సుశీల్ యోగా స్టూడియోలో ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలు చూడ ముచ్చట గా జరిగాయి. దోమలగూడ సుశీల్ యోగా స్టూడియోలో యోగా గురువులు సుశీల్, సాహిల్ ఆధ్వర్యంలో పలువురు పాల్గొని జెండా వందనం చేసిన అనంతరం ఏరియల్ యోగా ద్వారా విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. యోగాతో ఒంటికి ఎంతో మంచిదని, శారీరక సౌష్ఠవం, మానసిక ఆరోగ్యంకు యోగా దోహద పడుతుందని సుశీల్ తెలిపారు. ఏ వేడుక, పండుగ వచ్చినా ముందస్తుగా వైవిధ్య థీమ్‌తో నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నామని ఆయన అన్నారు. రిజ్వానా, సుమన్, సోనాలి, స్మిత, మోనిక, అనిల్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్‌లో వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను జహనుమా సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం నిర్వహించిన పలు పోటీలలో స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. వాక్చాతుర్యం, జి.కె ఎస్సే రైటింగ్‌లో మొదటి స్థానం సంపాదించారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డితో రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండు బ్రదర్, షౌరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఇన్‌చార్జి టీచర్లు, ఓం ప్రకాష్ దిల్లీకర్, సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రదర్శన

- సుచిత్ర అకాడమీలో బీస్కోప్-2025 పేరుతో ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సుచిత్ర అకాడమీ తమ విద్యార్థుల అసాధారణమైన సజనాత్మకత, ప్రతిభను చాటుకుంటూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రదర్శన "బిస్కోప్ 2025"ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అద్భుతమైన శిల్పాలు, కుండల నుంచి క్లిష్టమైన సిరామిక్ ముక్కలు, ఆకర్షణీయమైన ఇన్‌స్టాలేషన్‌లు, శక్తివంతమైన టై-డై క్రియేషన్‌లు, సున్నితమైన చేతి పనులు, ఎంబ్రాయిడరీ, ఆకర్షణీయమైన పెయింటింగ్‌ల వరకు 250కి పైగా కళాత్మక చిత్రాలను ప్రదర్శిం చారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కళాకారిణి దీపా నాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె స్ఫూర్తిదాయకమైన మాటలు విద్యార్థులతో ప్రతిధ్వనించాయి, వారి సజనాత్మక అభిరుచులను మరింతగా అన్వేషించడానికి వారి ని ప్రోత్సహించాయి. "ఈ రోజు ప్రదర్శనలో ఉన్న ప్రతిభ, సజనాత్మకత స్థాయిని చూస్తుంటే మన సమాజంలో కళ భవిష్యత్‌పై నాలో ఆశ నింపింది. ఈ యువ కళాకారులు కళాత్మక వ్యక్తీకరణకు టార్చ్ బేరర్లు, వారి కళాత్మక ప్రయాణాలను అభిరుచి, అంకిత భావం తో కొనసాగించాలని నేను వారిని కోరుతున్నాను" అని దీపా నాథ్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం లో సుచిత్ర అకాడమీ ప్రిన్సిపల్ దీపా కపూర్‌తో పాటు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి



- అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ పలాని

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హల్ లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందని ఓటు మన జన్మ హక్కు అని అన్నారు. జిల్లా లోని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు కావాలని అన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక మంలో జిల్లా అధికారులు, ఉద్యోగు లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడేవారికి సముచిత స్థానం లభిస్తుంది



- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి

నవాతెలంగాణ-తుర్కయంజాల్

బీజేపీలో కష్టపడే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఏబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఎలిమినేటి నరసింహ రెడ్డి సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి బీజేపీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని, పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసి, సమస్యలపై పోరాటం చేసి రాబోయే రోజుల్లో చైర్మెన్ పదవిని కైవసం చేసుకోవాల్సిందిగా ఎలిమినేటి నరసింహ సూచించారు. కార్యక్రమానికి పోరెడ్డి అర్జున్ రెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, కొత్తరాంరెడ్డి, బచ్చిగళ్ల రమేష్, కందాల బల్దేవ్ రెడ్డి, కొండ్రు పురుషోత్తం, పలుస శ్రవణ్ గౌడ్, అర్జున్ గౌడ్, బండారి రణధీర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విభజించు..పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం

జనం మదిలో రాజ్యాంగం... బీజేపీ మనసులో మనువాదం : బృందాకరత్

సంగారెడ్డి నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధులు

దేశవ్యాప్తంగా ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవం జరుగుతుంది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జనవరి 26న అమల్లోకి వచ్చింది. ప్రజలందరి మదిలో రాజ్యాంగం ఉంది. కానీ బీజేపీ నాయకుల మనసులో రాజ్యాంగం లేదు. మనువాదం ఉన్నది. మనువాదానికి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడారు. ఆయన మనసులో అదానీ-గాడ్సే ఉన్నారు. అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదు. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి.'అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నాలుగు రోజులపాటు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఐబీ కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శనను నిర్వహించారు. అనంతరం పీఎస్ఆర్ గ్రౌండ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వానసంఘం చైర్మెన్ చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగసభకు ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రియమైన సోదర, సోదరీమణులారా పార్టీ మహాసభల నేపథ్యంలో అందరికీ లాల్‌సలాం అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు.

ఈ మహాసభ ప్రజాప్రదర్శన, బహిరంగసభలో సీతారాం ఏచూరి లేరనీ, ఆయన మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఆయనకు దగ్గరి సంబంధముందన్నారు. ఏచూరి స్ఫూర్తితో ఎర్రజెండాను, ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లేందుకు శపథం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. నిజాం నవాబు, బ్రిటీష్, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. కార్మికులే ఈ మహాసభలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దేశంలో కార్మికులు, రైతులు దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతున్నదని విమర్శించారు. కానీ కార్పొరేట్లకు మాత్రం రూ.మూడు లక్షల కోట్లు రాయితీలిచ్చిందని వివరించారు. మోడీ సర్కార్ పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మిక సంఘాలన్నీ వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని అన్నారు. వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, కనీస వేతనాలు అందడం లేదని చెప్పారు. ఎనిమిది గంటల పనివిధానం కాకుండా పది గంటలు, 12 గంటల పనివిధానం అమలవుతున్నదని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. సామాన్యులపైకి బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్‌ను తెస్తే కమ్యూనిస్టులు అడ్డుకుంటారని చెప్పారు. పేదలు, రైతులు, కార్మికులపై జులుం ప్రదర్శిస్తే సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. రాజ్యాంగం, సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, ఫెడరలిజంపై విశ్వాసం లేని వారు కేంద్రంలో పాలకులుగా ఉన్నారని విమర్శించారు. హిందూ ముస్లిం, ఆదివాసీ ముస్లింలను విభజిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను విభజించు పాలించు బ్రిటీష్ విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రెచ్చగొడుతున్నారనీ, ఇది దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మానికి, ప్రజల మత విశ్వాసాలకు, హిందూత్వ భావజాలానికి సంబంధమే లేదన్నారు. మతాన్ని ఆయుధంగా రాజకీయాలకు వాడుకోవడం సరైంది కాదని చెప్పారు. దీన్ని వ్యతిరేకించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు. స్వార్థం కోసం, కుటుంబం కోసం కాకుండా సమాజ మార్పుకోసం సీపీఐ(ఎం) పోరాడుతుందని ఆమె చెప్పారు. ఎర్రజెండాను ముందుకెళ్లాలనీ, మతోన్మాద శక్తులను వెనక్కి కొట్టాలని అన్నారు. దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాటం చేయాలన్నారు.

ప్రభుత్వాలకు ఎర్రజెండా అంటే భయం : చెరుపల్లి సీతారాములు



ప్రజల పక్షాన కొట్లాడే ఎర్రజెండా పార్టీ నాయ కులంటే పాలకపార్టీలకు భయమనీ, ప్రజల పక్షాన పోరాడుతున్న ఎంతో మంది నాయకులను చంపే శాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. దోపిడీదారులకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్నది ఎర్రజెండానే అన్నారు. సీపీఐ(ఎం) పార్టీకి ఓట్లు, సీట్లు అటుఇటైనా పేదల కోసం నిలబడి పోరాడుతుందని నొక్కి చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి పెట్టుబడులు అంటూ మోడీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు విదేశాల్లో తిరుగుతున్నారనీ, వారు తిరిగేది ప్రజల కోసం కాదు..తమకు దక్కాల్సిన మూటల కోసమని విమర్శించారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ పోయిందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన, దరఖాస్తుల స్వీకరణతో కాలం వెళ్లబుచ్చుతున్నదని వివరించారు. మోడీ సర్కారు మతం, కులం చుట్టూ ప్రజలను తిప్పుతుంటే..రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దరఖాస్తుల చుట్టూ తిప్పుతున్నదని విమర్శించారు.

పేదలకు భూములివ్వకుండా పెద్దలకిచ్చే యత్నం : జి.నాగయ్య



రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందనీ, దాన్ని పేదలకు పంచకుండా పారిశ్రామి కవేత్తలకు కేటాయించే ప్రయ త్నంలో రాష్ట్ర సర్కారు ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య విమర్శిం చారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి సొంత ఇండ్లు లేవనీ, వారికి ఇండ్ల జాగాలు ఇచ్చేందుకు పాలకులకు చేయి రావడం లేదని చెప్పారు. అసైన్డ్ భూమి ఎకరం ఇస్తే 400 గజాలిచ్చి అమ్ముకునే హక్కు కల్పిస్తామని చెబుతూ పేదలను భూముల నుంచి దూరం చేసే యత్నంలో పాలకులు ఉన్నారని చెప్పారు. 69 కేంద్రాల్లో ఇండ్ల జాగాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు.

మతోన్మాదులారా ఖబడ్దార్ : తమ్మినేని



(మొదటిపేజీ తరువాయి)

చూడ్డమేనని చెప్పారు. మతోన్మాదాన్ని తిప్పికొడతామని అన్నారు. ఖబడ్దార్ మతోన్మాదులారా... బీజేపీ కుయుక్తులను అడ్డుకుంటామని చెప్పారు. పార్టీ నాలుగో మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలను నిర్వహిస్తామన్నారు. సకల జనులు బీజేపీ ప్రమాదాన్ని గుర్తించి అడ్డుకోవాలని కోరారు. బీజేపీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీని కలుపుకుని పోతామని చెప్పారు. అందరినీ ఒకతాటిమీదకు, ఒక వేదికమీదకు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తే సమర్థిస్తామనీ, విస్మరిస్తే పోరాటం చేస్తామని చెప్పారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2,500 అమలు ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు ఓట్లు వచ్చినపుడు ఒక మాట, తర్వాత ఇంకోమాట మారుస్తున్నాయని అన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల, దామగుండం వంటి సమస్యలపై అన్ని పార్టీలనూ పిలిచి మాట్లాడారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుంటే ప్రశ్నిస్తామనీ, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే అడ్డుకుంటామని అన్నారు. కలిసొచ్చే శక్తులను కలుపుకుని పనిచేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర మహాసభలో చర్చించి ప్రజా ఉద్యమాలకు పూనుకుంటామని చెప్పారు.

ఎర్రజెండా కోసం మేమున్నామని సహకరించడం స్ఫూర్తిదాయకం : చుక్క రాములు



మహాసభలను జయప్రదం చేయడానికి పారిశ్రామిక కార్మికవర్గం రెండు నెలల నుంచి కష్టపడుతున్నదనీ, ఎర్రజెండా కోసం మేమున్నామనీ పారి శ్రామిక కార్మికులు, అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు, వ్యవసాయ కూలీలు, రైతులు, పేదలు అన్ని విధాలా సహకరించడం స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మెన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు కొనియాడారు. జహీరాబాద్‌లో నిమ్జ్ కోసం 12,500 ఎకరాలను గుంజుకుంటే బాధితుల పక్షాన పోరాడింది సీపీఐ(ఎం) మాత్రమేననీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా ముందుకు రాలేదని వివరించారు. సంగారెడ్డి జిల్లాలోని అనేక పరిశ్రమల్లో మెరుగైన వేతన ఒప్పందాలు జరిగే పోరాటాలు చేయడంలోనూ, విజయం సాధించడంలోనూ ఎర్రజెండా పాత్ర కీలకమని నొక్కి చెప్పారు. కార్మికులంతా ఒక్కతాటిపై ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

దమ్ముంటే అందరికీ అన్ని సౌకర్యాలు కల్పించండి : జూలకంటి రంగారెడ్డి



ఒకే దేశం ఒకే ఎన్నిక..ఒకే దేశం..ఒకే పన్ను..ఒకే దేశం.. ఒకే ఆహారం.. నినాదాలను మాని దమ్ముంటే దేశంలో అందరీ అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో అందరికీ వైద్య, విద్యా సౌకర్యాలను కల్పించాలని కోరారు. దేశంలో 80 కోట్ల మందికి తాము ఉచితంగా రేషన్ ఇస్తున్నామని చెప్పడానికి పాలకులు సిగ్గుపడాలన్నారు. దేశంలో రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయనీ, బూర్జువా పార్టీలు ప్రయివేటు కంపెనీల లిమిటెడ్‌లుగా మారాయని విమర్శించారు. పాలకులు సంపన్నుల కోసం పనిచేస్తూ పేదలపై పన్నులు, భారాలు, అప్పులు మోపుతున్న తీరును ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు.

పోరాటాల గడ్డ ఎర్రజెండా వెలుగుల కోసం చూస్తోంది : ఎస్.వీరయ్య



తెలంగాణ పోరాటాల గడ్డ అనీ, ఎర్రజెండా వెలుగుల కోసం ఎదురుచూస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు హామీనిచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు మినహా ఏదీ అమలు కావడం లేదని విమర్శించారు. కనీస వేతనాల కోసం కార్మికుల పక్షాన కొట్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వమేమో 10 వేలు, 12 వేలు చాలని జీవోలు విడుదల చేస్తున్నదనీ, ప్రధాని మోడీనేమో రోజువారీ కూలి రూ.178 ఇస్తే సరిపోతుందని అంటున్నారని విమర్శించారు. ఆ వేతనంతో ఒక్క బీజేపీ నేతగానీ, నాయకులుగానీ బతికి చూపించాలని సవాల్ విసిరారు. 8 గంటల పనివిధానాన్ని తీసేసి రెండు షిఫ్టు విధానం(12 గంటల పనివిధానం) తేవడం ప్రమాదకరమన్నారు. విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణిని క్రమంగా ప్రయివేటీకరిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గమ్మునా ఉండటాన్ని తప్పుబట్టారు. పేరు ఆర్టీసీ..బస్సులు ప్రయివేటువేంటి అని రేవంత్‌సర్కార్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర హక్కుల కోసం కొట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఎర్ర సముద్రం

కదం తొక్కిన రెడ్ ఆర్మీ



- దద్దరిల్లిన ప్రజా ప్రదర్శన
- కోలాట, డప్పుల దర్వులాట...విచిత్ర వేషాధారణ
- ఎర్ర తోరణమై సాగిన కార్మిక, శ్రామిక జనం
- జనంతో కలిసి సాగిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు
- ప్రదర్శనలో బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్ర, రాష్ట్ర నాయకులు
- ఐబీ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ఎర్ర ప్రవాహం
- అమరుల స్మారకంగా మూడు జ్యోతులు అందజేత

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మిక, కర్షక లోకం ఎర్ర ప్రవాహమై సాగింది. రెడ్ ఆర్మీ కదం తొక్కడంతో ఎర్ర సముద్రంలా ఉప్పొంగింది. డప్పులదర్వులు, కోలాటా నృత్యాలు ధూంధాం చేశాయి. విచిత్ర వేషాధారణలు ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి. చీమల దండై కదిలిన ఎర్రసైన్యం కవాతుతో సంగారెడ్డి పట్టణం దద్దరిల్లింది. రెడ్ షర్ట్స్, ఎర్రచీరలు ధరించి... ఎర్రజెండాను భుజాన ఎత్తిపట్టి "అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా' అంటూ పాట పాడుతూ ఆటలాడుతూ సాగిన ప్రజా ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి, కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (గోకుల్ గార్డెన్) జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఐబీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా సాగారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, పేదలు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఐబీ నుంచి ప్రారంభమైన ప్రజా ప్రదర్శన బహిరంగ సభాస్థలికి చేరుకుంది. ప్రదర్శన ముందు భాగాన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్రకమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి.సాగర్, అబ్బాస్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఇతర ముఖ్య నాయకులు ముందు భాగాన సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై బృందాకరత్ ప్రజలకు అభివాదం చేశారు.

డప్పుల దర్వులు...కోలాటాల నృత్యాలు

సీపీఐ(ఎం) ప్రజా ప్రదర్శనలో డప్పు కళాకారులు చిందేస్తూ దరువేశారు. ప్రదర్శన అగ్రభాగాన సాగిన డప్పు కళాకారులు ఎర్రజెండా పాటల ఊపులో ఆడిపాడారు. ఎర్ర దుస్తులు ధరించి ప్రత్యేక శిక్షణ పొందిన కళాకారులు ప్రదర్శనకు ఊపుతెచ్చారు. మహిళా కళాకారులు కోలాటాల నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రెండూ మూడు కోలాట దళాలు ఎర్రజెండా పాటలపై కోలాట దర్వులేస్తూ ఆడాయి. అదే విధంగా ప్రదర్శనలో విచిత్ర వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలే కాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలు, మతోన్మాద పోకడల్ని ఎత్తిచూపుతూ వేసిన వేషాలు ఆలోచింపజేశాయి. రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో సీపీఐ(ఎం) రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించింది. ప్రదర్శనలో రాజ్యాంగం చేతబట్టిన ఇద్దరు కళాకారులు అంబేద్కర్ వేషాధారణతో ప్రదర్శనలో ముందు నడిచారు. అదే విధంగా బీజేపీ దేవుళ్ల జపం చేస్తూ మతాన్ని రాజకీయాలకు వాడుతున్న దృశ్యం కూడా మతసామరస్యం కోరుకునే వాళ్లను ఆలోచింపజేసింది. సరళీకృత విధానాల వల్ల పేదలు మరింత పేదలవుతున్న తీరు.. హిందూ, ముస్లీం, క్రిష్టియన్ వేషాధారణలో మత సామరస్యాన్ని కోరే సందేశానిచ్చారు. మతోన్మాద భూతం, రైతులు, కనీస వేతనాల్లేని కార్మికులు, హింసకు గురవుతున్న మహిళల వంటి వేషాధారణలు ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచాయి.

కదం తొక్కిన కార్మిక వర్గం

ప్రజా ప్రదర్శనలో కార్మిక వర్గం కదం తొక్కింది. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న సంగారెడ్డిలో సీపీఐ(ఎం) కార్మిక వర్గం గట్టి పునాది కలిగి ఉన్నది. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులకు మెరుగైన వేతనాలు సాధించి పెట్టింది. అందుకే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల ప్రదర్శనలో ఎర్రజెండాలు చేతబూని కదం తొక్కుతూ కదిలారు. అసంఘటిత రంగంలోని హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. భూ నిర్వాసితులు, రైతులు, గ్రామీణ, పట్టణ పేదలు, ఇండ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్న పేదలు అత్యధికంగా ర్యాలీకి తరలివచ్చారు.













కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదనీ, కార్పొరేట్ల కోసం చట్టాలు మారుస్తూ పోతున్నదని విమర్శించారు. దేశంలోని మార్కెటింగ్ వ్యవస్థను అంబానీ, అదానీలకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీలు సంపన్నుల కోసం పనిచేసే పార్టీలని చెప్పారు. మోడీ ప్రభుత్వం వచ్చాక అంబానీ ఆస్తి లక్ష కోట్ల రూపాయల నుంచి రూ.8 లక్షల కోట్లకు, అదానీ ఆస్తి రూ.40 వేల కోట్ల నుంచి రూ.7.5 లక్షల కోట్లకు పెరిగిన తీరును వివరించారు. ట్రంప్ గెలిచాక డిన్నర్ పార్టీకి మన దేశం నుంచి అంబానీని మాత్రమే పిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. పెట్టుబడిదారులకు ఎర్రజెండా ప్రాధాన్యత తెలుసుననీ, అందుకే పాలకులతో నిరంతరం అణచివేయిస్తూ అరెస్టులు చేయిస్తున్నారని చెప్పారు. మోడీ సర్కారు ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తున్నదనీ, పౌర హక్కుల కోసం నిలదీస్తే చంపేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కారు హరిస్తున్నదని తీరును వివరించారు. ప్రజాస్వామ్యం ఉంటేనే కష్టజీవులకు హక్కులుంటాయని నొక్కి చెప్పారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబితే మోడీ సర్కారు దాన్ని భగ్నం చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వేతన హక్కును కల్పించాలనీ, 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ ఇల్లు, విద్య, వైద్య సౌకర్యాల కల్పన హక్కు ఉండాలని నొక్కి చెప్పారు. ఈ హక్కుల కోసం కొట్లాడేది ఎర్రజెండా మాత్రమేననీ, ఇతర పార్టీలకు అది చెప్పే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఒకేదేశం..ఒకే ఎన్నిక వస్తే ముందు అంతరించిపోయే పార్టీలు బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ అనీ, ఆ తర్వాత కాంగ్రెస్ అంతమైపోతుందని చెప్పారు. ఇదంతా ఏకపార్టీగా బీజేపీ మిగిలే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్నీ, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కపౌరునిపైగా ఉందని నొక్కి చెప్పారు.

అమరుల స్ఫూర్తి కొనసాగింపుగా..

ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల స్ఫూర్తికి కొనసాగింపుగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి స్మారకజ్యోతులతో సీపీఐ(ఎం) శ్రేణులు ర్యాలీగా వచ్చారు. సూర్యాపేట జిల్లా నుంచి తీసుకొచ్చిన మల్లు స్వరాజ్యం స్మారకజ్యోతిని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్‌కు అందజేశారు. భైరాన్‌పల్లి నుంచి సీపీఐ(ఎం) శ్రేణులు తీసుకొచ్చిన అమరవీరుల స్మారకజ్యోతిని పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులుకు అందజేశారు. కేవల్ కిషన్ స్మారకంగా మెదక్ జిల్లా శ్రేణులు తీసుకొచ్చిన అమరవీరుల స్మారకజ్యోతిని కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుకు అందజేశారు. 'అమరుల ఆశయాలను కొనసాగిద్దాం..' అంటూ ప్రతినబూనారు.



హైదరాబాద్ చేరుకున్న ప్రకాశ్‌కరత్

- సీపీఐ(ఎం) నాయకుల ఘన స్వాగతం

సంగారెడ్డిలో కొనసాగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల్లో పాల్గొనేందుకు ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ శనివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.



నవతెలంగాణ మానవి
ఆదివారం 26 జనవరి 2025
హైదరాబాద్
www.navatelangana.com



భారత రాజ్యాంగానికి 75 ఏండ్లు. రాజ్యాంగాన్ని దేశానికి శక్తివంతమైన దారి దీపిక అనొచ్చేమో! దేశ కాలమాన పరిస్థితులు బట్టి ఎప్పటికప్పుడు అధునాతనం అవుతున్న రాజ్యాంగ ప్రధాన ఉద్దేశం దేశాన్ని గణతంత్ర, ప్రజాస్వామ్య రాజ్యంగా మార్చడం. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి మార్గం చూపుతున్న విధంగా మహిళల నడక సాగుతున్నదా? ఆమె జీవితం ఆత్మగౌరవంతో సాగుతున్నదా? విద్య, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం పొందుతున్నదా? సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం అందుకుంటున్నదా? రాజ్యాంగ శిల్పులు ఊహించిన విధంగా ప్రజలలో మహిళను భాగంగా చూస్తున్నారా? అసలు రాజ్యాంగం మహిళలకు ఏమిచ్చింది? క్లుప్తంగా చర్చిద్దాం.



రాజ్యాంగం ఆమెకేమిచ్చింది?

భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ మహిళల స్థితిగతులపై ఆలోచించి మహిళల సాధికారత కోసం కృషి చేశారు. ఆయన దృష్టిలో మహిళలు కేవలం గృహిణులు కాదు. సమాజంలో సమాన భాగస్వాములు. అందువల్లనే భారత రాజ్యాంగంలో మహిళలకు సమానత్వం, గౌరవం కల్పించడానికి అనేక ఏర్పాట్లు చేశారు. తద్వారా మహిళల సాధికారత సాధ్యమవుతుందని భావించారు.

అందులో ముఖ్యమైనవి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వం, ఆర్టికల్ 15 వివక్ష లేని హక్కు, ఆర్టికల్ 16 మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభించేలా రాజ్యాంగం నిర్దేశించింది. ఆర్టికల్ 39 సి మహిళా ఉద్యోగినులు దోపిడీకి గురికాకుండా కాపాడటం, ఆర్టికల్ 39(ఎ) మహిళలకు సమానంగా వేతనం, ఆర్టికల్ 42 ఉచిత ప్రసూతి సెలవులు ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. అంబేద్కర్ మహిళల కోసం చేసిన కృషి వల్లనే మహిళల స్థాయిని పెంచే విడాకులు వంటి హక్కులు కల్పించే హిందుకోడ్ బిల్లు వచ్చింది. అనేక సామాజిక అన్యాయాలకు, అసమానతలను నిర్మూలిస్తూ కొన్ని సంస్కరణలకు కారణమైంది. మహిళల విద్యను ప్రోత్సహించింది. హిందూ వివాహ చట్టం 1955, హిందూ వారసత్వ చట్టం - 1956, వరకట్న నిషేధ చట్టం-1961, కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984, మహిళల అసభ్య ప్రదర్శన నిషేధ చట్టం -1986, 2005 మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం, లైంగిక వేధింపుల చట్టం 2013 వంటి సదుపాయాలున్నాయి. పంచాయితీ రాజ్ , నగరపాలక సంస్థల్లో మహిళలకు 50 % రిజర్వేషన్లు ఉన్నాయి. మహిళల హక్కుల రక్షణ, భద్రత సంబంధించిన అంశాల పరిరక్షణకు జాతీయ మహిళా కమిషన్ కృషి చేస్తుంది.

మనకున్న చట్టాలు కొంత వరకు సహాయపడిన్నాయి. కానీ అనుకున్న ఫలితాలు సాధించగలుగుతున్నామా? లేదు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు.



పెరుగుతున్న దాడులు

ఉద్యోగ అవకాశాలు, వేతనాలు, సామాజిక గుర్తింపు వంటి అనేక విషయాల్లో లింగవివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళలపై గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి సుడిగుండాల్లో చిక్కి విలవిలలాడుతూనే ఉన్నారు. ఉదాహరణగా బిల్కిస్ బానో కేసు తీసుకుందాం. 2002లో గుజరాత్ అల్లర్లలో గర్భవతిగా ఉన్న బిల్కిస్ బానో, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యలు సంచలనం కలిగించిన విషయం అందరికి తెలిసిందే. ఆమె ఎన్నో ఏండ్లు న్యాయం కోసం పోరాడింది. నిందితులకు శిక్ష పడింది. కానీ ఏం లాభం? గుట్టుచప్పుడు కాకుండా క్షమాభిక్ష పేరుతో హంతకులైన నేరస్థులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాదు పూలదండలతో ఆహ్వానం పలికింది. దీంతో బిల్కిస్ బానో, మానవ హక్కుల సంస్థలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం రద్దయింది. ఈ కేసు దేశ మహిళల భద్రత, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకానిచ్చింది. ఈ మధ్య కాలంలో ఎన్ని సవాళ్లు, ఎన్ని అవమానాలు, ఎంత యాతన? దానికి బాధ్యులెవరు? దేశంలో మహిళల మాన ప్రాణాలకు రక్షించాల్సిన ఆ రాష్ట్ర ప్రభుత్వం నేరస్థుల పక్షాన నిలబడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం కాదా?



చైతన్యం కావాలి

ప్రస్తుతం కోట్లాది పోరాడి సాధించుకున్న మహిళల హక్కులు కోల్పోయే తిరోగమన దిశగా అడుగులు పడుతున్నాయి. జన జీవనంలోకి చొచ్చుకొచ్చి నియంత్రిస్తున్న మతం కోరలు చాచి వికటాట్టహాసం చేస్తున్నది. మహిళల శ్రేయస్సుకు ముప్పు కలిగించే మతం కోరలు పీకి, భారతీయ మహిళ రాజ్యాంగం తనకు కల్పించిన హక్కులు, చట్టాలు అందుకోవాలి. సమాజంలో అన్ని రకాల వివక్షతలు పోయి సమస్థానం, గౌరవమర్యాదలు అందుకొని ఉన్నతంగా ఎదిగే రోజు రావాలి. ఇది జరగాలంటే రాజ్యాంగ పరమైన హక్కులతో పాటు ప్రజల్లో అవగాహన, చైతన్యం రావాలి. అందుకు పౌర సంస్థల, ఉద్యమ సంస్థల కృషి మరింత అవసరం.

మహిళలు ఇంటికే పరిమితమా..?

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నానాటికీ దిగజారిపోతున్నది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోరుతూ ముప్పై ఏండ్లకు పైగా పోరాటం చేయాల్సి వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల ముందు సెప్టెంబర్ 28, 2023లో బిల్లు వచ్చినప్పటికీ అమలు కాలేదు. మహిళలు సమాజంలో తమ స్థితి మెరుగుపడటం కోసం, తమ హక్కుల కోసం పోరాడి కొన్ని చట్టాలు సాధించుకున్నారు. కానీ మహిళల స్థితిగతుల్లో రావలసిన మార్పు రాకపోవడానికి కారణం ఏంటి? మహిళలను కేవలం గృహిణులుగానే చూసే సామాజిక దృక్పథం కొనసాగుతూనే ఉంది. అందుకు ఎల్ అ టి చైర్ పర్సన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు మంచి ఉదాహరణ. వారాంతపు సెలవు ఎందుకు? ఇంట్లో పెళ్ళాం ముఖం ఎంత సేపని చూస్తారు? అని అతని వ్యాఖ్య. ఉద్యోగులంటే పురుషులేనా? మహిళలు కాదా? మహిళలు చేసే ఉద్యోగానికి విలువ లేదా? మహిళ గృహిణిగా మాత్రమే ఉండాలా? ఏమిటీ ధోరణి? ఎందుకిలా మాట్లాడుతున్నారు? మన సమాజం పురుషస్వామ్య సమాజం. మహిళల్ని గృహిణులుగా మాత్రమే చూసే దృక్పథం ఇప్పటికి బలంగా ఉంది.

ఇవే కారణాలు...

సామాజిక సాంస్కృతిక విలువలు అంటే ఆచారాలు, సంప్రదాయాలు మహిళల అభివృద్ధికి అడ్డంగా నిలిస్తున్నాయి. అందువల్లే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగే బిల్లు చట్టం రావడానికి ముప్పై ఏండ్లకు పైనే పట్టింది. ఇక చేసుకున్న చట్టాల అమలులో ఉన్న లొసుగులు, లోపాలు, పోలీసులు న్యాయస్థానాలు మహిళల ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించక పోవడం, నిందితులకు తగిన శిక్షలు పడకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా లేకపోవడం వల్ల పురుషులపై ఆధారపడి పోరాడే శక్తి కోల్పోతుంది. ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాకపోవడానికి, జెండర్ అసమానతలు తొలగక పోవడానికి కులం, మతం పితృస్వామ్యం వంటి సామాజిక సాంస్కృతిక కారణాల పాత్ర ప్రధానమైనది.

స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి

మన దేశంలో ఉన్న అన్ని మత గ్రంథాల్లో పురుషుల కంటే మహిళలు తక్కువ అన్న భావన కనిపిస్తుంది. పురుషులకు సేవ చేయడమే మహిళ కర్తవ్యం అని నమ్మే మత సాంప్రదాయాలు, కుల కట్టుబాట్లు మహిళా స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి. మహిళలను సమాజానికి దూరం చేస్తున్నాయి. కులగౌరవం కాపాడాలనే పేరుతో మహిళల చదువు, ఉద్యోగాలకు అనుమతించకుండా బాల్యవివాహాలు చేస్తున్నారు. కులం తప్పి మరో కులం/మతం వారిని పెండ్లి చేసుకుంటే పరువు హత్యలకు పాల్పడటం, మత నాయకులు, కుల పెద్దలు మహిళల హక్కులు వ్యతిరేకిస్తూ తీర్పు చెప్పడం, ప్రచారం చేయడం వంటివన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేవే.

సమాజం సవ్యంగా సాగుతుందా?

పితృస్వామిక భారతీయ సమాజంలో పురుషులదే నిర్ణయాధికారం. మహిళ గృహిణి మాత్రమే. విద్య, ఆరోగ్య, ఆస్తి హక్కులు అంతంత మాత్రమే. ఒకరిద్దరు కంపెనీ సిఇఓలను లేదా నిర్ణయాధికారంలో ఉన్న మహిళలను చూపించి అది మహిళాభివృద్ధి, లింగ సమానత్వం అనుకుంటే పొరపాటే. మహిళలకు తగిన గుర్తింపు, సమాన అవకాశాలు, ఆర్థిక సమానత్వం లేని వ్యవస్థలో, మహిళలకు రక్షణలేని, మానవ విలువలు అడుగంటుతున్న సమాజం సవ్యంగా సాగుతుందా? సాగదు. మరింత వెనుకబడిపోతుంది. స్త్రీని సమాజాభివృద్ధిలో భాగస్వామిగా చేసిన సమాజం ముందుకు పోతుంది.



- వి. శాంతి ప్రబోధ

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2025 ఏడాదికి గానూ కేంద్రం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించినవారిని ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. ఏడుగురిని పద్మ విభూషణ్, 19 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. పద్మ అవార్డుల్లో ఏడుగురు తెలుగువారున్నారు. వీరిలో తెలంగాణ నుంచి ప్రఖ్యాత వైద్యులు దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి.. పద్మ విభూషణ్‌కు ఎంపికయ్యారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వరించింది. ఇక ఏపీ నుంచి కళల విభాగంలో సినీనటుడు బాలకృష్ణ పద్మభూషణ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన టీడీపీ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. బ్రెజిల్‌కు చెందిన వేదాంత గురు జోనల్ మాశెట్టి, కువైట్‌కు చెందిన షేకా ఏజే అల్ సబాహ్, నేపాల్‌కు చెందిన నరేస్ గురుంగ్‌లు పద్మశ్రీ అవార్డులకు ఎంపికైనవారిలో ఉన్నారు.

ప్రతి ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటిస్తారు. పద్మ అవార్డులను పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు విభాగాల్లో కేంద్రం అందిస్తుంది. కళల, సమాజ సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలతో పాటు వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించినవారిని ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు.



పద్మ విభూషణ్ వీరికే

దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (వైద్యం) - తెలంగాణ
జస్టిస్ జగదీశ్ ఖేహర్ (రిటైర్డ్) (ప్రజా వ్యవహారాలు) - చండీగఢ్
కుముదిని రజినీకాంత్ లాఖియా (కళలు) - గుజరాత్
లక్ష్మీనారాయణ సుబ్రమణియం (కళలు) - కర్నాటక
ఎం.టి.వి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - కేరళ
ఓసాము సుజుకీ (మరణానంతరం) (వాణిజ్యం, పరిశ్రమలు) - జపాన్
శారదా సిన్హా (కళలు) - బీహార్

పద్మభూషణ్ వీరికే..

నందమూరి బాలకృష్ణ (కళలు) - ఆంధ్రప్రదేశ్
ఎ.సూర్యప్రకాశ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - కర్నాటక
అనంత్ నాగ్ (కళలు) - కర్నాటక
బిబేక్ దెబ్రాయ్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - ఎన్‌సీటీ ఢిల్లీ
జతిన్ గోస్వామి (కళలు) - అసోం
జోస్ చాకో పెరియప్పురం (వైద్యం) - కేరళ
కైలాశ్ నాథ్ దీక్షిత్ (ఇతర- ఆర్కియాలజీ) - ఎన్‌సీటీ ఢిల్లీ
మనోహర్ జోషి (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - మహారాష్ట్ర
నల్లి కుప్పుస్వామి చెట్టి (వాణిజ్యం, పరిశ్రమలు) - తమిళనాడు
పీఆర్ శ్రీజేశ్ (క్రీడలు) - కేరళ
పంకజ్ పటేల్ (వాణిజ్యం, పరిశ్రమలు) - గుజరాత్
పంకజ్ ఉదాస్ (మరణానంతరం) (కళలు) - మహారాష్ట్ర
రామ్‌బహదుర్ రాయ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - ఉత్తర్‌ప్రదేశ్
సాధ్వీ రీతంభర (సామాజిక సేవ) - ఉత్తర్‌ప్రదేశ్
ఎస్.అజిత్ కుమార్ (కళలు) - తమిళనాడు
శేఖర్ కపూర్ (కళలు) - మహారాష్ట్ర
శోభన చంద్రకుమార్ (కళలు) - తమిళనాడు
సుశీల్ కుమార్ మోడీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - బీహార్
వినోద్ ధామ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) - అమెరికా

పద్మశ్రీ అవార్డులు

మందకృష్ణ మాదిగ (ప్రజావ్యవహారాలు) - తెలంగాణ
కె.ఎల్ కృష్ణ (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
మాడుగుల నాగఫణి శర్మ (కళలు) - ఆంధ్రప్రదేశ్
మిర్యాల అప్పారావు(మరణానంతరం) (కళలు)- ఆంధ్రప్రదేశ్
వదిరాజ్ రాఘవేంద్రచార్య పంచముఖి (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
జోనస్ మాశెట్టి (వేదాంత గురు) - బ్రెజిల్
హర్వీందర్‌సింగ్ (పారాలింపియన్ గోల్డ్‌మెడల్ విన్నర్) - హర్యానా
భీమ్ సింగ్ భవేష్ (సోషల్‌వర్క్) - బీహార్
పి.దక్షిణా మూర్తి (డోలు విద్వాంసుడు)- పుదుచ్చేరి
ఎల్.హంగ్‌థింగ్ (వ్యవసాయం-పండ్లు)- నాగాలాండ్
బేరు సింగ్ చౌహాన్ (జానపద గాయకుడు) - మధ్యప్రదేశ్
షేఖా ఎ.జె. అల్ సబాహ్ (యోగా)- కువైట్
నరేస్ గురుంగ్ (జానపద గాయకుడు) - నేపాల్
హరిమన్ శర్మ (యాపిల్ సాగుదారు) - హిమాచల్ ప్రదేశ్
జుమ్దే యోమ్‌గామ్ గామ్లిన్ (సామాజిక కార్యకర్త)- అరుణాచల్‌ప్రదేశ్
విలాస్ దాంగ్రే (హోమియోపతి వైద్యుడు) - మహారాష్ట్ర
వెంకప్ప అంబాజీ సుగటేకర్ (జానపద గాయకుడు) - కర్నాటక
నిర్మలా దేవి (చేతి వృత్తులు) - బీహార్
జోయ్నచరణ్ బతారీ (థింసా కళాకారుడు)- అసోం
సురేశ్ సోనీ (సోషల్‌వర్క్- పేదల వైద్యుడు)- గుజరాత్
రాధా బహిన్ భట్ (సామాజిక కార్యకర్త)- ఉత్తరాఖండ్
పాండి రామ్ మాండవి (కళాకారుడు) - ఛత్తీస్‌గఢ్
లిబియా లోబో సర్దేశాయ్ (స్వాతంత్ర్య సమరయోధురాలు) - గోవా
గోకుల్ చంద్ర దాస్ (కళలు)- పశ్చిమ బెంగాల్
సాల్లీ హోల్కర్ (చేనేత)- మధ్యప్రదేశ్
మారుతీ భుజరంగ్‌రావు చిటమ్‌పల్లి (సాంస్కృతికం, విద్య)- మహారాష్ట్ర
బతూల్ బేగమ్ (జానపద కళాకారిణి) - రాజస్థాన్
వేలు ఆసన్ (డప్పు వాద్యకారుడు) - తమిళనాడు
భీమవ్వ దొడ్డబాలప్ప శిల్లేక్యాతర (తోలుబొమ్మలాట) - కర్నాటక
పర్మార్ లావ్జీభాయ్ నాగ్జీభాయ్ (చేనేత)- గుజరాత్
విజయలక్ష్మి దేశ్‌మానే (వైద్యం)- కర్నాటక
చైత్రం దేవ్‌చంద్ పవార్ (పర్యావరణ పరిరక్షణ)- మహారాష్ట్ర
జగదీశ్ జోషిలా (సాహిత్యం)- మధ్యప్రదేశ్
నీర్జా భట్లా (గైనకాలజీ) - ఢిల్లీ
హ్యూ, కొల్లీన్ గాంట్జర్ (సాహిత్యం, విద్య - ట్రావెల్) - ఉత్తరాఖండ్

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

నలువైపులా రహదారులు ఉండాలనీ, దానికోసం అవసరమైనచోట్ల ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు, పరామర్శకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డార్మిటరీ, ఫైర్‌స్టేషన్, క్యాంటిన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలని ఆదేశించారు. మరణించిన వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుండటంతో వారు వచ్చేందుకు రెండు, మూడు రోజులు పడుతోందనీ, అప్పటి వరకు మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. అవయవాల మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలనీ, ఏదో కోల్పోతున్న భావన ఉండరాదని అన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

(మొదటిపేజీ తరువాయి)

వందే భారత్ రైలు పరుగులు తీసింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కాశ్మీర్‌కు రూ.1,500 నుంచి రూ.2,100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

పేదల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య(75) మృతిచెందారు. కొత్తగూ డెం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుం టున్న సందర్భంలో ఒక్కసారిగా బీపీ తగ్గి, గుండెపోటు రావడంతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచా రు. అనంతరం ఆయన నివాసం సుజాతనగర్ మం డల కేంద్రానికి తరలించారు. ఆదివారం ఉదయం అంత్రక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు కుమారుడు లెనిన్, కుమార్తె జ్యోతి ఉన్నారు. ఇద్దరికి ఆదర్శ వివాహాలు చేశారు. భార్య కాసాని లక్ష్మి 2017లో సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణంచెందారు. కాసాని మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు తీవ్ర సంతాపం సానుభూతి తెలిపా రు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం 10 గంటలకు సుజాతనగర్ మండల కేంద్రంలో సంతాప సభ అనంతరం అంత్యక్రియలు జరుగుతాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. అంత్యక్రియలో అన్ని వర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాసాని ప్రజా పోరాట నాయకులు : మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు, సుజాతనగర్, కొత్తగూడెం ప్రాంతాల ప్రజల పక్షాన నాలుగున్నర దశాబ్దాల పాటు కాసాని ఐలయ్య తను నమ్మిన సిద్ధాంతం కోసం దీక్ష, పట్టుదలతో నిలబడ్డారు. రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చినా, ఇబ్బందులు తలెత్తినా ఎర్రజెండా పక్కన నిలబడిన నాయకులు ఐలయ్య. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ తుదిశ్వాస వరకు ప్రజల మధ్యనే జీవించారు. ప్రజా ఉద్యమాన్ని కాపాడటమే ఆయనకు ఇచ్చే నివాళి.

వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు పూర్తి చేసుకుని అజాదీ కా అమృత మహోత్సవ్ కాలంలో వున్న మన దేశం విశిష్టమైన గొప్పతనాన్ని, వైవిధ్యభరితమైన సంస్కృతిని చాటిచెబుతూ మనం ఈ పండుగను జరుపుకుంటున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ 75వ గణతంత్ర దినోత్సవం ఎంతో ప్రత్యేకమైనదని, విశిష్టమైనదని వ్యాఖ్యానించారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె శనివారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పశ్చిమ దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైనదని అందుకే భారత్‌ను ప్రజాస్వామ్య మాతృకగా పిలుస్తారని ఆమె కొనియాడారు. అనేక ప్రతికూలతలను, అడ్డంకులను, సవాళ్ళను దాటుకుంటూ సాగిన 75ఏండ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వివరించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆమె ప్రముఖంగా పేర్కొన్నారు. ఆర్థిక, సైన్స్, అంతర్జాతీయ సంబంధాలు సహా పలు రంగాల్లో భారత్ సాధించిన పలు విజయాలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. మన మౌలిక విలువలు, సిద్ధాంతాలు, సూత్రాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుందన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే వైవిధ్యభరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలని అన్నారు. ఈ వైవిధ్యతను మనం ఆచరిస్తేనే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. లింగ సమానత్వం దిశగా కూడా మనం పురోగతి సాధించామన్నారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందన్నారు. నారీ శక్తి వందన్ అభియాన్ మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా మారుతుందన్నారు.

ఆత్మనిర్భర్ కోసం రైతుల కృషి

గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన 75ఏండ్ల తర్వాత కూడా దేశంలోని పలు ప్రాంతాలు దారిద్ర్యంలో వున్నాయని, ఆకలి బాధలను ఎదుర్కొంటున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మన విశ్వాసం చెక్కు చెదరలేదన్నారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు మనం అనేక చర్యలు, తీర్మానాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆహార ధాన్యాలు, ఇతర పంటల విషయంలో మన దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు మన రైతాంగం చెమటోడ్చి నిరంతరంగా శ్రమించిందని అన్నారు. మన కార్మికులు కఠోర శ్రమతో మన తయారీ రంగాన్ని, మౌలిక వసతులను మరింత మెరుగైన రీతిలో వుండేలా తీర్చిదిద్దారన్నారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మనం చొరవలు తీసుకుంటున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందన్నారు. ప్రాథమిక అవసరాలను ఒక హక్కుగా మార్చడం ద్వారా సంక్షేమం అన్న భావననే ప్రభుత్వం పునర్నిర్వచించిందన్నారు. సాహసోపేతమైన, దార్శనికత, ఆర్థిక బలంతో రాబోయే కాలంలో కూడా మన పురోగతి ఇదే వేగంతో కొనసాగుతుందన్నారు.

పటిష్టమైన ఆర్థిక వ్యవస్థతో వచ్చిన ఆత్మ విశ్వాసంతో మనం ముందుకు వెళుతున్నామన్నారు. ఇటీవలి కాలంలో ప్రధాన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ జిడిపి వృద్ధిరేటు కొనసాగుతోందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల వారికి ఉచిత ఆహారం అందించే పథకాలను కరోనా మహమ్మారి కాలంలో అమలు చేశామని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం ఆ పథకాల పరిధిని పెంచి, అమలును కొనసాగిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రస్తుత అమృత కాలంలో కనివినీ ఎరుగని సాంకేతిక మార్పులు ఎదురవుతున్నాయని, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతిక చొరవలు పతాక శీర్షికల నుండి మన రోజువారీ జీవితాల్లోకి వచ్చేశాయని ఆమె పేర్కొనానరు. రాబోయే భవిష్యత్తులో ఆందోళన చెందే అంశాలు, అవకాశాలు సృష్టించే రంగాలు కూడా అనేకం వున్నాయన్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుంటే వారు సరికొత్త సరిహద్దులను అన్వేషిస్తూ ముందుకు సాగిపోతున్నారన్నారు. వారి మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తూ వారికి మార్గం సుగమం చేయడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. వారి విశ్వాసమే రేపటి భారతాన్ని నిర్మిస్తుందని ఆమె ఆకాంక్షించారు. యువత మనస్సులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులే మన జాతి నిర్మాతలను ఆమె అభిప్రాయపడ్డారు. మౌనంగా పనిచేసుకుంటూ దేశానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించేందుకు ఇతోధికమైన సేవలందించే మన రైతాంగం, కార్మికులకు కచ్చితంగా మనందరం కృతజ్ఞులమై వుండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. చివరగా ఇటువంటి పర్వదినాన మనసాయుధ బలగాలకు, పోలీసులు, పారా మిలటరీ బలగాలకు భారత్ అభివాదం చేస్తోందన్నారు. వారి ధైర్యసాహసాలే లేకపోతే ఈనాడు మనం లేమని వ్యాఖ్యానించారు. చివరగా మనందరం మనం కృషి చేయగలిగే రంగాల్లో కృషి చేస్తూ, దేశానికి ఇతోధికంగా సేవలందిస్తూ, నిబద్ధతతో వ్యవహరిస్తూ లక్ష్యాల సాధన దిశగా సాగాలని కోరారు.

భూసమస్యలతోనే 65 శాతం నేరాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేరాల్లో 65 శాతం భూసమస్యల కారణంగానే జరుగుతున్నాయనీ, ఆ సమస్యలను పరిష్కరించడమంటే సమాజానికి మేలు చేయడమేనని న్యాయవాది, ల్యాండ్ లా రిసోర్స్ పర్సన్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో హైదరాబాద్ కార్యదర్శి రామచంద్రారెడ్డి అధ్యక్షతన "భూ భారతి - ల్యాండ్ లా ఇన్ తెలంగాణ" అనే అంశంపై సునీల్ కుమార్ ప్రసంగించారు. న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లు అనీ, న్యాయం ఎక్కడ దొరుకుతుందో అక్కడికి వెళ్లాలని సూచించారు. సమస్యలను అర్థం చేసుకోవాలనీ, ఎల్లప్పుడు నేర్చుకోవడం కొనసాగించాలన్నారు. తొలినాళ్లలో రికార్డులనేవి కేవలం శిస్తు వసూలు చేయడానికే ఉద్దేశించారే తప్ప భూయజమానిని నిర్ధారించేందుకు కాదని చెప్పారు. బ్రిటీషర్ల హయాంలో భూయజమానిని గుర్తించడానికి రికార్డులపరంగా ప్రయత్నాలు మొదలయ్యాయనీ, కాలానుక్రమంలో వచ్చిన రికార్డుల నమోదు ప్రక్రియలను వివరించారు. కొత్తగా వస్తున్న భూభారతి చట్టంలో తప్పుల సవరణకు మెకానిజం, మ్యుటేషన్ ఫిర్యాదు చేసే ఎక్కడ చేయాలి?, అనే అంశాలున్నాయని స్పష్టం చేశారు. 2020 ధరణి చట్టంలో లోపాలను సవరించినట్టు తెలిపారు. భూభారతి చట్టం రూపకల్పనకు ముందు రికార్డులన్నింటిని పరిశీలించి, వాటి లోపాలు, తలెత్తిన పరిణామాల అధ్యయనంతో పాటు 18 రాష్ట్రాల రికార్డులను పరిశీలించినట్టు చెప్పారు. 2009 నుంచి 2015 మధ్య బీహార్ రాష్ట్రంలో భూమికి సంబంధించి అద్భుతమైన చట్టాలు వచ్చాయని చెప్పారు. భూమి హక్కుల రికార్డుల్లో లోపాలను ప్రభుత్వమే సరిచేసే అవకాశం భూభారతిలో ఉందని తెలిపారు. హక్కులకు సంబంధించిన వివాదాలకు మాత్రమే కోర్టులకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. ఇంతకు ముందు హక్కుల రికార్డులోపాలకు కారణమైన ప్రభుత్వం సవరించకుండా ప్రజలే కోర్టుకు వెళ్లాలని ఉండటంతో పలు ఇబ్బందులు తలెత్తాయని గుర్తుచేశారు. మ్యుటేషన్ ముందు విచారణను నిర్దేశించిచన సమయంలోపు చేయాలని కొత్త చట్టం చెబుతున్నదన్నారు. భూదాన భూముల అన్యాక్రాంతంపై ఎవరైనా ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే అవకాశముందని తెలిపారు. సాదాబైనామాకు సంబంధించి గత ప్రభుత్వం కాలంలో 9.24 లక్షల దరఖాస్తులను స్వీకరించినా... అవి పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. భూభారతి చట్టంలో వీటికి పరిష్కారం చూపించినట్టు తెలిపారు. అదే విధంగా వ్యవసాయేతర భూముల హక్కుల గురించి కూడా ఈ చట్టంలో ప్రస్తావన ఉందనీ, ప్రతి భూకమతానికి ఒక నెంబర్ ఉంటుందని తెలిపారు. దేశంలో ఇంకా సగం మందికి భూమే జీవితమనీ, దాన్ని నమ్ముకునే వారంతా బతుకుతున్నారని గుర్తుచేశారు. సమాజ సమస్యలు మన తలుపులు తట్టకముందే మనం ఆ సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలన్నారు. సమాజంలో మనమూ బతకాల్సి ఉందని గుర్తుచేశారు. అంతర్గత సంతృప్తి కోసం పని చేయాలని సూచించారు.

రైతు సంఘం జాతీయ నేత సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో ఉన్న కౌలు చట్టాలు మాజీ సీఎం కేసీఆర్ వల్ల లేకుండా పోయాయని తెలిపారు. ప్రస్తుత చట్టం 70 శాతం మందికి ఉపయోగపడ్డా ..సాగుదార్లకు హక్కు కల్పించే చట్టం లేదని చెప్పారు. ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూభారతి చట్టం తెచ్చారనీ, గెజిట్, ప్రభుత్వ జీవోలు వచ్చి అమలయ్యేందుకు మరో ఐదారు నెలలు పట్టొచ్చని చెప్పారు. ధరణి రద్దై, భూభారతి చట్టం ఇంకా అమలు కాలేదని గుర్తుచేసారు. అందుకే చాలామందిలో ఊగిసలాట కొనసాగుతున్నదన్నారు. చట్టాలకు అవసరమైనప్పుడు సవరణలు చేసుకోవచ్చనీ, భూభారతి చట్టాన్ని తొందరగా అమల్లోకి తీసుకురావాలని సూచించారు. కౌలుదారులు ఎప్పుడు భూమి తమదేనని ఒక్క కేసు పెట్టలేదని స్పష్టం చేశారు. వారికిచ్చే లోన్ ఎలిజిబిలిటీ కార్డు (ఎల్ఇసీ)తో నాలుగు రకాల ప్రయోజనాలుంటాయని వివరించారు. ఏ ప్రభుత్వం వచ్చినా చట్టాలు మారుస్తుంటుందని చెబుతూ, 1786లో మద్రాసులో రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు నుంచి 2025 వరకు మారిన పరిణామాలను విపులంగా వివరించారు. ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి మాట్లాడుతూ ధరణితో ప్రతి గ్రామంలో వంద మందికి కనీసం 10 మంది బాధితులుగా మారారని తెలిపారు. హైకోర్టులో దీనిపై 47 వేలకు పైగా కేసులున్నాయని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఐలూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి మాధవ కృష్ణారెడ్డి, న్యాయ విద్యార్థుల ప్రతినిధి హైదర్ అలీ, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

ప్రధానకార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను రాష్ట్రంలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన వారందరికీ అందించాలని నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ప్రకటించారు. జాతీయ పర్వదినమైన గణతంత్ర దినోత్సవం ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు, సీఎం కార్యాలయ కార్యదర్శులు వి శేషాద్రి, చంద్ర శేఖర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్ , పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించాలని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ పథకాల పండుగను ప్రారంభించాలని తెలిపారు.

నితీశ్,రింకు అవుట్

తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి, ఫినిషర్ రింకు సింగ్‌లు గాయం బారిన పడ్డారు. చెపాక్‌లో రెండో టీ20 ముంగిట ప్రాక్టీస్ సెషన్లో నితీశ్, రింకు గాయపడినట్టు బీసీసీఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. చెపాక్‌లో ఇంగ్లాండ్‌తో టీ20కి ఈ ఇద్దరు దూరం అయ్యారు. చివరి మూడు టీ20లకు నితీశ్, రింకు స్థానంలో శివం దూబె, రమణ్‌దీప్‌లను సెలక్షన్ కమిటీ జట్టులోకి ఎంపిక చేసింది.

సూపర్ తిలక్

ఛేదనలో తెలుగోడి అద్భుత ఇన్నింగ్స్

రెండో టీ20లో భారత్ ఘన విజయం



నవతెలంగాణ-చెన్నై

తెలుగు తేజం తిలక్ వర్మ (72 నాటౌట్, 55 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఛేదనలో సహచర బ్యాటర్లు విఫలమైనా ఓ ఎండ్‌లో నిలబడిన తిలక్ వర్మ ఆఖరు వరకు క్రీజులో నిలబడ్డాడు. టెయిలెండర్ల అండతో చెపాక్‌లో భారత్‌కు సూపర్ విక్టరీ అందించాడు. తిలక్ వర్మ అజేయ అర్థ సెంచరీతో ఇంగ్లాండ్‌పై భారత్ 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. 166 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో ఛేదించింది. వాషింగ్టన్ సుందర్ (26, 19 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ కెప్టెన్ జోశ్ బట్లర్ (45, 30 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), బ్రైడన్ కార్సె (31, 17 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), జేమీ స్మిత్ (22, 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించటంతో 165/9 పరుగులు సాధించింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం సాధించింది. తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

తిలక్ ఒక్కడే : భారత్ లక్ష్యం 166 పరుగులు. చెపాక్ పిచ్‌పై ఇంగ్లాండ్ పేసర్లతో బరిలోకి దిగింది. భారత్‌కు ఇదేమీ పెద్ద సవాల్ కాదు అనిపించింది. కానీ ఇంగ్లాండ్ బౌలర్లు ఆతిథ్య జట్టును ఇరకాటంలో పడేశారు. అభిషేక్ శర్మ (12), సంజు శాంసన్ (5), సూర్యకుమార్ యాదవ్ (12), ధ్రువ్ జురెల్ (4), హార్దిక్ పాండ్య (7) నిరాశపరచటంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. స్పెషలిస్ట్ బ్యాటర్లు అందరూ డగౌట్‌కు చేరగా.. 78/5తో భారత్ ఓటమి ప్రమాదంలో పడింది. ఈ సమయంలో వాషింగ్టన్ సుందర్ (26)తో కలిసి తిలక్ వర్మ కీలక భాగస్వామ్యం నిర్మించాడు. ఒక్కో పరుగూ జోడిస్తూ లక్ష్యానికి చేరువగా తీసుకెళ్లాడు. సుందర్ నిష్క్రమణతో కథ మళ్లీ మొదటికొచ్చింది. అక్షర్ పటేల్ (2), అర్షదీప్ సింగ్ (6) తేలిపోయారు. 146/8తో ఓ ఎండ్ నుంచి సహకారం లోపించింది. ఇక్కడ దూకుడు జోడించిన తిలక్ వర్మ వేగంగా పరుగులు పిండుకున్నాడు. మరో నాలుగు బంతులు ఉండగానే ఉత్కంఠకు తెరదించాడు. రవి బిష్ణోయ్ (9 నాటౌట్) ఆఖర్లో రెండు బౌండరీలతో మెరిశాడు. మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 39 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన తిలక్ వర్మ ఒత్తిడిలో అసమాన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ : 165/9 (జోశ్ బట్లర్ 45, బ్రైడన్ కార్సె 31, అక్షర్ పటేల్ 2/32, వరుణ్ 2/38)

భారత్ ఇన్నింగ్స్ : 166/8 (తిలక్ వర్మ 72 నాటౌట్, వాషింగ్టన్ సుందర్ 26, కార్సె 3/29, రషీద్ 1/14)

అనికెత్ రెడ్డి మాయజాలం

గెలుపు ముంగిట హైదరాబాద్



నవతెలంగాణ-హైదరాబాద్ : రంజీ ట్రోఫీ గ్రూప్-బి హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ గెలుపు ముంగిట నిలిచింది!. బ్యాటర్లు, బౌలర్లు సత్తా చాటడంతో ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆధిపత్యం చెలాయిస్తోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అనికెత్ రెడ్డి (5/72) ఐదు వికెట్ల మాయజాలానికి తోడు స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (2/62) మెరవటంతో హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 92 ఓవర్లలో 275 పరుగులకే కుప్పకూలింది. హిమాచల్ తరఫున శుభమ్ అరోరా (53), మహజన్ (68), ఆకాశ్ (46) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన హైదరాబాద్.. హిమాచల్ ప్రదేశ్‌ను ఫాలోఆన్ ఆడించింది. ఫాలోఆన్‌లో హిమాచల్ ప్రదేశ్ 5 ఓవర్లలో 21/0తో పోరాడుతోంది. హైదరాబాద్, హిమాచల్ ప్రదేశ్ రంజీ మ్యాచ్‌లో నేడు ఆఖరు రోజు. హిమాచల్ మరో 269 పరుగుల వెనుకంజలో ఉండగా.. నేడు వీలైనంత త్వరగా పది వికెట్లు పడగొట్టి విజయాన్ని అందుకునేందుకు హైదరాబాద్ ఎదురుచూస్తోంది.

చాంపియన్ మడిసన్ కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025



మెల్‌బోర్న్ : ఎటువంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అమెరికా అండర్ డాగ్, 29 ఏండ్ల మడిసన్ కీస్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండు సార్లు చాంపియన్ అరినా సబలెంకపై మడిసన్ కీస్ మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించింది. 6-3, 2-6, 7-5తో మడిసన్ కీస్ గెలుపొందింది. మడిసన్ కీస్ కెరీర్‌లో ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ విజయం. ఆరు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో కీస్ అదరగొట్టింది. పాయింట్ల పరంగా 92-91తో సబలెంకకు గట్టి పోటీ ఇచ్చింది. మడిసన్ 15 గేములు నెగ్గగా, సబలెంక 14 గేములు గెలుపొందింది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ జానిక్ సినర్‌తో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ తలపడనున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.